www.prajasakti.com
PRAJASAKTI Regd.No. 15795/68
సిటీ
ప్రజాశక్తి
ప్రతి అక్షరం ప్రజల పక్షం
Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu
సంపుటి : 39 Vol సంచిక : 06 No | విజయవాడ, ఆదివారం 6 జనవరి 2019 | 12 + స్నేహ + 12 పేజీలు వెల : 5.00 Rs.

జన్మభూమిలో వీటికి బదులిస్తారా?

ప్రత్యేక కథనం

2లో..

స్పిన్నర్ల హవా



- సత్తాచాటిన కుల్దీప్, జడేజా
- ఆస్ట్రేలియా 236/6
- వెలుతురులేమితో ముందే నిలిచిన మూడో రోజు ఆట

సిడ్నీ టెస్ట్‌లో మూడోరోజు భారత స్పిన్నర్లు తిప్పేశారు. కుల్దీప్, జడేజాల మాయాజాలంతో ఆతిథ్య కంగారు జట్టు 236 పరుగులకే ఆరు వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. ఫాలోఆన్‌ను తప్పించుకోవాలంటే ఆసీస్ జట్టు దాదాపు 200 పరుగులు చేయాల్సి ఉంది. వెలుతురు సరిగా లేక గంటముందే మ్యాచ్‌ను నిలిపివేశారు. టీమిండియాకంటే కంగారు జట్టు ఇంకా 386 పరుగుల వెనకంజలో ఉంది.

12



'పారిపోయిన ఆర్థిక నేరగాడు విజయ్ మాల్యా

- పిఎంఎల్‌వి కోర్టు ప్రకటన
- లిక్కర్ డాన్ ఆస్తుల జప్తుకు తొలి అడుగు

8



మేఘాలయ ప్రభుత్వానికి రూ. 100 కోట్ల జరిమానా

- ఎన్‌జిటి

8

నరసరావుపేట యువ జడ్జి ఐశ్వర్య హఠాన్మరణం

ప్రముఖుల నివాళి



జడ్జి ఐశ్వర్య (ఫైల్)

ప్రజాశక్తి - నరసరావుపేట రూరల్ (గుంటూరు జిల్లా)

గుంటూరు జిల్లా నరసరావుపేట ఒకటో అదనపు జూనియర్ సివిల్ జడ్జి పొట్లూరి ఐశ్వర్య(26) శనివారం తెల్లవారు జామున గుండెపోటుతో మృతి చెందారు. శుక్రవారం ఆమె కోర్టులో కాలు బెణికి జారి పడినట్లు సిబ్బంది తెలిపారు. అనంతరం విశ్రాంతి కోసం సెలవు పెట్టారన్నారు. ఈ క్రమంలో శనివారం తెల్లవారుజామున ఐశ్వర్య తన తల్లికి కాఫీ కలుపుతూ కుప్పకూలిపోయారు. వెంటనే ఆస్పత్రికి తరలించగా అప్పటికే ఆమె మరణించినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఐశ్వర్య భౌతిక మిగతా 9లో

ఆగని హింస

కేరళలో సిపిఎం నేతల ఇళ్లపై సంఘ్ పరివార్ బాంబు దాడులు

కొన్ని చోట్ల ప్రతిచర్యలు

నివేదిక కోరిన కేంద్ర హోం మంత్రి



కొచ్చి /న్యూఢిల్లీ : కేరళలో ఆర్‌ఎస్‌ఎస్, బిజెపి హింసాకాండ కొనసాగుతోంది. శబరిమల అయ్యప్ప ఆలయంలోకి మహిళల ప్రవేశాన్ని వ్యతిరేకిస్తూ, సుప్రీంకోర్టు తీర్పు ధిక్కరిస్తున్న ఆర్‌ఎస్‌ఎస్, బిజెపి కార్యకర్తలు రాష్ట్ర వ్యాప్తంగా దాడులకు దిగడం ద్వారా బీభత్స కాండను సృష్టిస్తున్నారు. సిపిఎం, ఇతర వామపక్ష నేతలను, కార్యకర్తలను లక్ష్యంగా చేసుకుని ఈ దాడులు జరుగుతున్నాయి. అరాచక మూకలపై కొన్ని చోట్ల ప్రతిదాడులు కూడా మిగతా 9లో

చట్టాన్ని అందరూ గౌరవించాలి

శబరిమలపై ఐక్యరాజ్య సమితి

ఐక్యరాజ్య సమితి : శబరిమల వివాదంపై సుప్రీం కోర్టు తన తీర్పు ఇచ్చిందని, దానిని అందరూ గౌరవించాలని ఐక్యరాజ్య సమితి పేర్కొంది. "ఈ వివాదంపై సుప్రీం కోర్టు ఇప్పటికే తీర్పునిచ్చింది. ఈ విషయాన్ని మనం దేశ న్యాయస్థానాలకు వదిలేయాలి.

అన్ని పార్టీలు చట్టాన్ని గౌరవించాలని మేము కోరుతున్నాం. ప్రజలందరికి సమాన హక్కులు ఉండాలన్న ఐక్య రాజ్య సమితి వైఖరి మీకు తెలిసిందే" అని ఐక్యరాజ్య సమితి ప్రధాన కార్యదర్శి గుటెరస్‌కు డిప్యూటి ప్రతినిధి ఫర్హాన్ హాక్ వ్యాఖ్యానించారు.



రాజాం మండలం పొగిరి గ్రామంలో మురుగునీటి కాలువను పరిశీలిస్తున్న చంద్రబాబు

మోడీ గారడీకి ఓట్లు రాలవు

- ఎన్నికల్లో ప్రజలు గట్టిగా బుద్ధి చెప్తారు
- జగన్‌కు సహకరించేందుకే ఎన్ఐఎకు దాడి కేసు
- కేంద్రం వైఖరి వల్లే ఉపాధి కూలీలకు డబ్బు ఇవ్వలేకపోయాం
- సంక్రాంతి తరువాత రుణ మాఫీ బకాయిలు

ప్రజాశక్తి- శ్రీకాకుళం ప్రతినిధి

వచ్చే ఎన్నికల్లో ప్రధాని మోడీ గారడీ పని చేయదని, ఓట్లు రావని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అన్నారు. గత ఎన్నికల్లో ప్రధాని మోడీ మాటల గారడీకి ఓట్లు పడ్డాయని పేర్కొన్నారు. ఇచ్చిన హామీలు నెరవేర్చకపోవడం, గత నాలుగున్నరేళ్లలో రాజ్యాంగ వ్యవస్థలను ధ్వంసం చేయడం, అస్తవ్యస్త పరిపాలన నేపథ్యంలో వచ్చే ఎన్నికల్లో ప్రజలు తగిన బుద్ధి చెప్తారని చెప్పారు. శ్రీకాకుళం జిల్లా రాజాం మండలం పొగిరిలో శనివారం జరిగిన జన్మభూమి-మా ఊరు కార్యక్రమంలో ప్రజలనుద్దేశించి ఆయన మాట్లాడారు. కేరళలోని శబరిమలై ఆలయంలోకి మహిళలను ప్రవేశించనివ్వకుండా అడ్డుకుంటూ సుప్రీంకోర్టు ఆదేశాలకు మిగతా 9లో



థాయిని కుదిపేసిన 'పాబుక్'

అండమాన్‌ను నేడు తాకే అవకాశం



శనివారం నాడు థాయిలాండ్‌లోని నఖాన్ రాష్ట్రంలో పాబుక్ తుపాను ధాటికి నేలకొరిగిన చెట్లు

ప్రజాశక్తి- గ్రేటర్ విశాఖ బ్యూరో

దక్షిణ చైనాలో ఏర్పడిన పాబుక్ తుపాను అండమాన్ పరిసరాల్లో కేంద్రీకృతమై ఉన్నట్లు భారత వాతావరణ కేంద్రం తెలిపింది. ఇది పశ్చిమ, వాయువ్య దిశగా గంటకు 13 కిలోమీటర్ల వేగంతో ముందుకు కదులుతోందని పేర్కొంది. శనివారం మధ్యాహ్నం 2.30 గంటలకు అండమాన్ సముద్రంలోకి వచ్చినట్లు ప్రకటించింది. ప్రస్తుతం పోర్టు బ్లెయిర్‌కు తూర్పు - ఆగ్నేయంగా 550 కిలోమీటర్ల దూరంలో ఉందని తెలిపింది. పశ్చిమ, వాయువ్య దిశలో ముందుకు కదులుతూ ఆదివారం సాయంత్రం అండమాన్ దీవులను తాకుతుందని పేర్కొంది. ఆ సమయంలో 70 నుంచి 80 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తాయని, 90 కిలో మీటర్లు పెరిగే అవకాశముందని హెచ్చరించింది. తర్వాత ఇది ఉత్తర - వాయువ్య దిశకు పయనం మార్చుకుని కొంతదూరం వెళ్లాక ఈశాన్య దిశగా కదిలి 7 లేదా 8వ తేదీన మయన్మార్ తీరానికి చేరుకుంటుందని తెలిపింది. దీని ప్రభావంతో అండమాన్ దీవుల్లో భారీ వర్షాలు కురుస్తున్నట్లు వాతావరణ శాఖ పేర్కొంది. ఈ తుపాను రాష్ట్రంపై ఎలాంటి ప్రభావమూ చూపదని నిపుణులు చెబుతున్నారు. మూడు నాలుగు రోజులు రాష్ట్రంలో పొడి వాతావరణం, సాధారణ చలి నెలకొంటుందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం పేర్కొంది.



దేశ వ్యాప్త సమ్మెకు పెరుగుతున్న మద్దతు

రవాణా, బ్యాంకు ఉద్యోగ సంఘాల బాసట

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

మోడి ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై పది కేంద్ర కార్మికసంఘాల నాయకత్వంలో కార్మికవర్గం మరోసారి సమరశంఖం పూరించడంతో వారికి వివిధ యూనియన్ల నుండి రోజురోజుకూ మద్దతు పెరుగుతున్నది. దేశవ్యాప్తంగా జనవరి 8, 9 తేదీలలో జరగనున్న జాతీయ కార్మిక సమ్మెకు అఖిల భారత రోడ్డు రవాణా వర్కర్స్ అసోసియేషన్ సమన్వయ కమిటీ, ఆలిండియా మోటార్ ట్రాన్స్‌పోర్టు కాంగ్రెస్, బ్యాంకు ఉద్యోగుల యూనియన్లు మద్దతు ప్రకటించాయి. ఈ మేరకు సమ్మెను విజయవంతం చేయాలని ఏఐఆర్‌టిడబ్ల్యూఎఫ్ ఉప ప్రధాన కార్యదర్శి ఆర్ లక్ష్మయ్య, బ్యాంకు యూనియన్ల నాయకులు పిలుపునిచ్చారు. జాతీయ సమ్మెకు సంఘీభావంగా తాము కూడా పాల్గొని జయప్రదం చేస్తామని వారు స్పష్టం చేశారు. శనివారం నాడిక్కడ స్థానిక సిఐటియు (బిటిఆర్ భవన్) లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ట్రాన్స్‌పోర్ట్ యూనియన్ నాయకులు లక్ష్మయ్య మాట్లాడుతూ, వ్యవసాయ రంగం తర్వాత ఎక్కువ మందికి ఉపాధి కల్పిస్తున్నది రవాణా రంగమేనని అన్నారు. అందువల్ల కేంద్రం విధిస్తున్న నూతన పన్నుల నుంచి మిగతా 9లో

జాతీయ సమ్మెకు సిద్ధం కావాలి

సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్.నర్సింగరావు



ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

దేశవ్యాప్తంగా ఈ నెల 8, 9 తేదీల్లో చేపట్టే సమ్మెను జయప్రదం చేయాలని సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్. నర్సింగరావు పిలుపునిచ్చారు. విశాఖలోని ఎన్‌పిఆర్ భవన్‌లో శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలో నిత్యావసరాల ధరల పెరుగుదలతో ప్రజలు సతమతవుతున్నారని, ప్రభుత్వరంగ పరిశ్రమలను మిగతా 9లో









విజయవాడలో కృష్ణానది తీరాన నిర్వహించిన సామూహిక 'హనుమాన్‌చాలీసా' పారాయణ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు, తరలివచ్చిన ప్రజలు

నేడు కానిస్టేబుల్ అభ్యర్థులకు ప్రాథమిక రాత పరీక్ష

ఆర్‌పిఎఫ్ పరీక్షకు హాజరయ్యే వారికి 8న పరీక్ష

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పోలీస్ శాఖలోని పోలీస్ కానిస్టేబుల్(సివిల్), కానిస్టేబుల్(ఎఆర్), కానిస్టేబుల (ఎపిఎస్పీ), జైళ్ల శాఖలోని వార్డర్స్, అగ్నిమాపక శాఖలోని ఫైర్‌మెన్ పోస్టుల భర్తీ కోసం ప్రాథమిక రాత పరీక్షను ఆదివారం నిర్వహించనున్నారు. ఈ మేరకు స్టేట్ లెవల్ పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు చైర్మన్ కుమార్ విశ్వజిత్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మొత్తం 3,92,788 మంది అభ్యర్థులకు హాల్‌టికెట్లు జారీ చేశామని, 704 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. ఆదివారం రోజే ఆర్‌పిఎఫ్ పరీక్ష ఉండటం వల్ల కానిస్టేబుల్ పరీక్ష రాసేందుకు వీలు కాదని, మరో అవకాశం కల్పించాలని 6500 అభ్యర్థనలు వచ్చాయని తెలిపారు. ముందుగా విన్నవించుకున్న వారికి మాత్రమే ఈ నెల 8న కాకినాడ జెఎన్‌టియులో ప్రత్యేకంగా పరీక్ష నిర్వహిస్తామని పేర్కొన్నారు. తొలుత ప్రత్యేక పరీక్షను 7న నిర్వహించాలని అనుకున్నప్పటికీ దూర ప్రాంతాల నుంచి వచ్చే అభ్యర్థుల్ని దృష్టిలో పెట్టుకుని ప్రత్యేక పరీక్షను 8న నిర్వహిస్తున్నామని తెలిపారు.

ప్రజాసంకల్పయాత్ర @ 3,600 కిలోమీటర్లు

గుర్తుగా మొక్కను నాటిన జగన్



సమస్యలను జగన్‌కు వివరిస్తున్న కడప ఉల్లి రైతులు

ప్రజాశక్తి- సోంపేట (శ్రీకాకుళం జిల్లా)

ప్రతిపక్ష నేత, వైసిపి అధినేత చేపట్టిన ప్రజాసంకల్పయాత్ర శ్రీకాకుళం జిల్లా సోంపేట మండలంలోని బారువ జంక్షన్ వద్ద శనివారం 3,600 కిలోమీటర్ల మైలురాయిని దాటింది. దీనికి గుర్తుగా జగన్ వేప మొక్కను నాటి, పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. 337వ రోజు పాదయాత్ర మండలంలోని తురకశాసనం క్రాస్ శిబిరం నుంచి ప్రారంభమై పాలవలస, కొర్లాం, బారువ జంక్షన్ మీదుగా లక్కవరం క్రాస్ వరకూ కొనసాగింది. ఇప్పటివరకూ 3593.6 కిలోమీటర్లు నడిచిన ఆయన శనివారం మరో 13.6 కిలోమీటర్లు నడిచి, మొత్తం 3607.2 కిలోమీటర్ల పాదయాత్రను పూర్తి చేశారు. తమ గ్రామంలో కిడ్నీ వ్యాధిగ్రస్తులు చాలామంది ఉన్నారని, వారికి వైద్య సహాయం అందడం లేదని పాలవలస గ్రామస్తులు జగన్ వద్ద వాపోయారు. తమను ఆదుకోవాలని కోరారు. ఉల్లి ధరలు గతేడాది కంటే దారుణంగా పడిపోయాయని కడప జిల్లాకు చెందిన ఉల్లి రైతులు జగన్ వద్ద వాపోయారు. మార్క్‌ఫెడ్ ద్వారా ఉల్లిని కొనుగోలు చేసేలా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని కోరారు. తిత్లీ తుపాను వల్ల నష్టం వాటిల్లినా, పరిహారం చెల్లిం పుల్లో రాజకీయాలతో బాధితులకు న్యాయం చేకూ రడం లేదని మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేశారు. సముద్రపు ఒడ్డున అక్రమంగా ఇసుకను తవ్వి తీయడంతో నీరు ఉప్పుగా మారుతోందని, ఫలితంగా గ్రామంలో మంచినీరు కరువవుతోందని టి.శాసనాం మత్స్యకారులు జగన్‌కు ఫిర్యాదు చేశారు.

ప్రజ్ఞ

1. ఆక్స్‌ఫర్డ్ తాజా నివేదిక ప్రకారం ప్రపంచ వ్యాప్తంగా అభివృద్ధి చెందే నగరాలు ఏ దేశంలో ఉన్నాయి?
2. 2018లో ఏ ఫోన్‌కు నిక్కీ సుపీరియర్ ప్రొడక్ట్ అండ్ సర్వీసెస్ అవార్డు లభించింది?
3. చంద్రుడు దక్షిణ ధృవానికి చేరుకున్న మొదటి స్పేస్ క్రాఫ్ట్ ఏది?
4. ఏ రాష్ట్రంలో సలభతర వాణిజ్యం మొదటి స్థానంలో ఉంది?
5. 2019 క్లైమెట్ ఛేంజ్ పెర్ఫామెన్స్ ఇండెక్స్ (సిసిపిఐ)లో మొదటి స్థానంలో ఏ దేశం నిలిచింది?

సమాధానాలు 7లో

జన్మభూమిలో వీటికి బదులిస్తారా?

ఫీచర్స్ అండ్ పాలిటిక్స్

ఈ రోజు రాష్ట్రవ్యాప్తంగా జన్మభూమి సభల్లో జలవనరుల నిర్వహణ, విద్యుత్తు, పర్యావరణం, ఆరోగ్యం గురించి ప్రచారం జరుగుతుంది. ముఖ్యమంత్రి విడుదల చేసిన శ్వేతపత్రం-5 ఈ ప్రచారానికి ప్రాతిపదిక. ఆ శ్వేతపత్రంలో వాస్తవాలు కప్పిపుచ్చే ప్రయత్నం జరిగిందని దిగువ అంశాలు సూచిస్తున్నాయి. వీటికి ప్రభుత్వం సమాధానం ఇస్తుందా?

1. 2015-16లో సమర్థనీటి నిర్వహణలో పంటను కాపాడినందుకు రాష్ట్రానికి సిబిఐపి అవార్డు దక్కిందని పేర్కొన్నారు. అవార్డు వచ్చి వుండొచ్చు కానీ సమర్థనీటి నిర్వహణలో పంటను కాపాడినది వాస్తవమా?. 34శాతం వర్షాభావం ఉన్న 2014-15లో 160.02 లక్షల టన్నుల ఆహార ధాన్యాలను పండిస్తే, 5శాతం వర్షాభావం ఉన్న 2015-16లో 143.78లక్షల టన్నుల ఆహార ధాన్యాలు మాత్రమే పండాయి. అంటే 16.24లక్షల టన్నుల దిగుబడి తగ్గింది. నిజానికి వర్షాభావం అతి తక్కువ ఉన్న సంవత్సరం 2015-16. కానీ, అతి తక్కువ దిగుబడి వచ్చిన సంవత్సరం అదే. మరి పంటను కాపాడినదెక్కడ? దాని వల్ల కలిగిన ప్రయోజనం ఎక్కడ?.
2. రూ.63,675.52కోట్లు ఖర్చు చేసి 32.02లక్షల ఎకరాలకు నీటి సౌకర్యాన్ని కల్పించామని పేర్కొన్నారు. అదే వాస్తవమైతే రాష్ట్రంలో నీటి సౌకర్యం ఉన్న ప్రాంతపు విస్తీర్ణం ఆ మేరకు పెరిగి ఉండాలి. 2013-14లో సాగునీటి సదుపాయం ఉన్న ప్రాంతపు స్థూల విస్తీర్ణం 40.96లక్షల హెక్టార్లు. 2017-18 నాటికి అది 35.82లక్షల హెక్టార్లకు పడిపోయింది. పోనీ నికరసాగు విస్తీర్ణం చూద్దామంటే అది కూడా 30.14లక్షల హెక్టార్ల నుంచి 27.19లక్షల హెక్టార్లకు పడిపోయింది. మరి అదనపు సాగునీటి సౌకర్యం కల్పించి ఉంటే ఈ తగ్గుదల ఎలా వచ్చింది?.
3. పోలవరం 63శాతం పూర్తయ్యిందని తెలిపారు. ప్రాజెక్టు నిర్వాసితుల పునరావాసాన్ని ముందు పూర్తిచేసి ఆ తర్వాత ప్రాజెక్టు నిర్మాణం చేపట్టాలన్నది మార్గదర్శక సూత్రాల్లో, పునరావాస చట్టంలో ఉంది. కానీ 5శాతం పునరావాసం కూడా పూర్తి కాలేదు. ఎన్ని కుటుంబాలకు పునరావాసం కల్పించారో, ఇంకెందరు మిగిలి ఉన్నారో ఆ వివరాలేవీ శ్వేతపత్రంలో లేవు. పునరావాసానికి రూ.32వేల కోట్లు కావాలని కేంద్రాన్ని అడుగుతున్నాం. కేంద్రం మాత్రం పునరావాసం బాధ్యత తనది కాదంటోంది. పునరావాసం ఖర్చే ప్రాజెక్టు వ్యయంలో సింహభాగం. ఈ విషయాన్ని పక్కనపెట్టి 63శాతం పూర్తయ్యిందని చెప్పడం సబబేనా?.
4. 2024 నాటికి పెట్టుబడిలేని ప్రకృతి వ్యవసాయం లక్ష్యం అని తెలిపారు. రసాయన ఎరువులు, పురుగుమందులు లేకుండా ప్రకృతి వ్యవసాయం జరుగుతుంది. కానీ విత్తనాలు, పశువుల పేడ, పచ్చిరొట్ట, వేపపిండి, వేపనూనె వంటివి పెట్టుబడి లేకుండా ఎలా వస్తాయి?. పొలంలో కూలి ఇవ్వకుండా పనులెవరు చేస్తారు?.
5. గ్రీన్‌హౌస్ వాయువుల ఉద్గారాల తగ్గింపు లక్ష్యంగా ప్రకటించారు. ఇప్పుడు కాలుష్యకారక పరిశ్రమలపై ఎటువంటి చర్యలూ లేవు. కొత్తగా పెట్రో కెమికల్ పరిశ్రమలకు, ఫార్మా కంపెనీలకు, ఆక్వా పరిశ్రమకు బార్లా తలుపులు తెరిచారు. గ్రీన్ హౌస్ ఉద్గారాలను పెంచే పరిశ్రమలను ప్రోత్సాహిస్తూనే ఇంకో పక్క ఉద్గారాలను తగ్గిస్తామని ప్రకటించడం సబబేనా?.
6. విద్యుత్ రంగంలో మిగులు సాధించామని ప్రకటిస్తున్నారు. విద్యుదుత్పత్తి 2013-14 నాటికి ఎంత ఉంది? ఇప్పుడు ఎంతకు పెరిగింది? సాధించిన అదనపు విద్యుత్ ఉత్పత్తి ఎంత? అందులో నిలకడగా విద్యుదుత్పత్తి చేసే థర్మల్, గ్యాస్ ఆధారిత విద్యుత్ ఉత్పత్తి ఎంత పెరిగింది?. నిలకడలేని పవన విద్యుత్ గురించి, సౌర విద్యుత్ గురించి శ్వేతపత్రం చెప్పిందే తప్ప ఈ కీలక అంశాన్ని ఎందుకు ప్రస్తావించలేదు?.
7. ఖనిజ వనరుల ద్వారా ఆదాయం రూ.238కోట్ల నుంచి రూ.2147కోట్లకు పెరిగింది. ఖనిజ వనరులు ఒకసారి తవ్వేసి అమ్ముకుంటే భవిష్యత్తులో మన అవసరాలకు కావాలన్నా దొరకవు. అందుకే మన ఖనిజ వనరులను ఉపయోగించి మన రాష్ట్రంలో పరిశ్రమల్ని ఎలా స్థాపించాలో ఆలోచిస్తే అది నిజమైన అభివృద్ధికి దారితీస్తుంది. అలాకాకుండా అయినకాడికి అమ్ముకోవడం అభివృద్ధి అవుతుందా?. గతంలో రాజశేఖర్‌రెడ్డి హయాంలోనూ ఖనిజాలను విచ్చలవిడిగా అమ్ముకున్నారు. ఇప్పుడున్న ప్రభుత్వం చేస్తున్నది అదే. తేడా ఏమిటి?



పంట రుణాలివ్వటం దేశంలోనే రికార్డు

ముఖ్యమంత్రి చంద్రబాబు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

కౌలు రైతులకు రూ.9100 కోట్ల పంట రుణాలివ్వటం దేశంలోనే రికార్డని ముఖ్యమంత్రి చంద్రబాబు వెల్లడించారు. నాలుగు రోజులుగా జరుగుతోన్న జన్మభూమి కార్యక్రమంపై సిఎం అమరావతిలో జిల్లా కలెక్టర్లు, నోడల్ అధికారులు, ప్రజాప్రతినిధులతో శనివారం టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ జీనవ ప్రమాణాలు పెంచేందుకే జన్మభూమి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, దీంట్లో ప్రజల భాగస్వామ్యం పెరిగిందని, ఫిర్యాదుల సంఖ్య తగ్గిందని, వైద్య శిబిరాలకు స్పందన బాగుందని సంతోషం వ్యక్తంచేశారు. ఇది నాలుగున్నరేళ్ల శ్రమ ఫలితమన్నారు. ఒకవైపు అభివృద్ధి పనులు జరుగుతున్నా, మరోవైపు ప్రజలకు సంక్షేమ పథకాలను అందిచ గలుగుతున్నామని ఆశాభావం వ్యక్తంచేశారు. ప్రజల్లో సంతృప్తే ఫిర్యాదుల సంఖ్య తగ్గటా నికి కారణమన్నారు. తీవ్ర ఆర్థిక లోటులో కూడా రైతులకు రూ.24 వేలకోట్లు రుణమాఫీ చేశామని తెలిపారు. రూ.4వేల కోట్ల ఇన్‌పుట్ సబ్సిడీ ఇచ్చామన్నారు. గతంలో ఎరువులు అడిగితే లాఠీ ఛార్జీలు, పోలీస్‌స్టేషన్లో విత్తనాల పంపిణీ జరిగేదని, అలాంటి పరిస్థితులు లేకుండా చేసి రైతులను అన్ని విధాలుగా ఆదుకున్నామని సంతృప్తి వ్యక్తం చేశారు. రేషన్, పెన్షన్, ఇళ్ల కోసం వచ్చే ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలన్నారు. రాష్ట్ర ప్రగతికి రథాలు ప్రజలు, ఉద్యోగులేనని, వారి సంక్షేమం కోసం చాలా చేశామని వివరించారు. ఉద్యోగుల సొంత ఇంటి కలను నేరవేరుస్తామని, పెట్టుబడి లేని వ్యవసాయం పై రైతుల్లో అవగాహన పెంచాలని, చుక్కల భూముల విషయంలో ప్రభుత్వం సుమోటోగా వ్యవహరించి సమస్యలను పరిష్కరిస్తుందని తెలిపారు.

ప్రజాసంక్షేమంపై జన్మభూమి నిర్వహించాలి

ఎపి కౌలురైతుల సంఘం రాష్ట్రకార్యదర్శి పి.జమలయ్య

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాజకీయ అంశాలను పక్కనపెట్టి, ప్రజా సంక్షేమ అంశాలపై జన్మభూమి కార్యక్రమాలు నిర్వహించాలని ఎపి కౌలురైతుల సంఘం రాష్ట్రకార్యదర్శి పి.జమలయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జన్మభూమి కార్యక్రమంలో పాల్గొంటున్న ప్రజాప్రతినిధులు రాజకీయ అంశాలు చర్చించడాన్ని ఆయన వ్యతిరేకించారు. గుంటూరు జిల్లా కొల్లూరు మండలం చింతల్లంక గ్రామంలో శనివారం నిర్వహించిన జన్మభూమి-మాఊరు కార్యక్రమానికి హాజరైన ఆయన మాట్లాడుతూ కౌలురైతులకు రుణాలు ఇవ్వకపోయినా పెద్ద ఎత్తున ఇచ్చినట్లు చెప్పుకోవడం చాలా దారుణమని తెలిపారు. మొక్కజొన్న బోనస్ డబ్బులు ఇవ్వక పోవడమే కాకుండా, మొక్కజొన్న లబ్ధిదారుల లిస్టులు ప్రకటించక పోవడం పట్ల స్థానిక రైతులు ఆందోళన చెందుతున్నారన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో టిడిపికి ఓట్లు వేసి గెలిపించాలని ప్రజాప్రతినిధులు పిలుపునివ్వడం సిగ్గుచేటన్నారు. వ్యవసాయరంగంపై ముఖ్యమంత్రి విడుదల చేసిన శ్వేతపత్రంపై చర్చ నిర్వహించకపోవడమేగాక, రైతులకు ఉపయోగపడే ఒక్క అంశం కూడా సభలో చర్చించకపోవడం దారుణమన్నారు. వ్యవసాయ అనుబంధరంగాల అభివృద్ధికి సంబంధించిన సంక్షేమ పథకాలు ఏఒక్కటీ కౌలురైతులకు ఉపయోగపడే విధంగా లేవంటూ కౌలురైతులు ఆవేదన వ్యక్తం చేశారని స్పష్టం చేశారు. జన్మభూమి కార్యక్రమం ఎన్నికల ప్రచారంలా కొనసాగడం పట్ల ప్రజలు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారన్నారు. జన్మభూమి కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు అనుసరిస్తున్న విధానాలను ఆయన తీవ్రంగా ఖండించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షులు టి.సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌ఐఎకు అప్పజెప్పడం అభ్యంతరకరం

సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధం

అప్పీల్‌కు వెళ్లే యోచనలో టిడిపి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో



విశాఖ ఎయిర్‌పోర్టు విఐపి లాంజ్‌లో ప్రతిపక్ష నేత వైయస్ జగన్‌మోహన్‌రెడ్డిపై జరిగిన హత్యాయత్నం కేసును జాతీయ దర్యాప్తు సంస్థకు కేంద్రం అప్పజెప్పడం రాష్ట్రాల సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధమని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఆర్థికశాఖా మంత్రి యనమల రామకృష్ణుడు, రాజ్యసభ సభ్యులు కనకమేడల రవీంద్రకుమార్ ఆరోపించారు. హైకోర్టులో కేసు పెండింగ్‌లో ఉండగా కోర్టు నిర్ణయానికంటే ముందుగా ఎన్‌ఐఎకు బదిలీ చేయడాన్ని టిడిపి నేతలు తప్పుపడుతున్నారు. దీనిపై సుప్రీంకోర్టుకు అప్పీల్‌కు వెళ్లే విషయాన్ని ఆ పార్టీ పరిశీలిస్తోంది.. ఎన్‌ఐఎ యాక్ట్ ప్రకారం నేషనల్ సెక్యూరిటీ కేసు, రాష్ట్రాల్లో శాంతి భద్రతల అంశాల్ని మాత్రమే ఎన్‌ఐఎకు అప్పజెప్పాలని సూచిస్తోందని రాష్ట్ర ఆర్థిక శాఖా మంత్రి యనమల రామకృష్ణుడు శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఏ దర్యాప్తు సంస్థకిచ్చినా కొత్తగా ఈ కేసులో బయటకొచ్చే అంశాలేవీ లేవని టిడిపి జాతీయ కార్యదర్శి లోకేశ్ పేర్కొన్నారు. జగన్ కేసుల విచారణను ఆలస్యం చేయడం ద్వారా ఆయనకు రాజకీయ లబ్ధి చేకూర్చాలనే యోచనలో రాష్ట్రాల సమాఖ్య స్ఫూర్తికి భిన్నంగా నడవడం ప్రజాస్వామ్యానికి మంచిది కాదని సుప్రీంకోర్టు న్యాయవాది, రాజ్యసభ సభ్యులు కనకమేడల రవీంద్రకుమార్ పేర్కొంటున్నారు.

ఎన్‌ఐఎ విచారణకు భయమెందుకు?

వైసిపి ఎమ్మెల్యే ఆర్కే రోజా

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో



ఎన్‌ఐఎ విచారణను ఎందుకు స్వాగతించలేకపోతున్నారని వైసిపి ఎమ్మెల్యే ఆర్కే రోజా అన్నారు. కేసు విచారణను ఎన్‌ఐఎకి హైకోర్టు అప్పగిస్తే నిందితుడు శ్రీనివాస్ కంటే చంద్రబాబు, లోకేష్‌లకు బాధకలుగుతోందన్నారు. చంద్రబాబు పాలనలో ఆంధ్రప్రదేశ్ ఆర్థిక నేరగాళ్లకు అడ్డాగా మారిందని ఆమె ఆరోపించారు. కోర్టు ఆదేశాలను సైతం గౌరవించకుండా సిఎం నియంతలా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. శనివారం హైదరాబాద్‌లోని పార్టీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో ఆమె మాట్లాడారు. తనను ఎవరూ ప్రశ్నించకూడదు అన్నట్లుగా చంద్రబాబు మాట్లాడుతున్నారని, కాకినాడలో బిజెపి మహిళా నేతను పట్టుకుని ఫినిష్ చేస్తానని ఒక గుండాలా బెదిరింపులకు దిగారన్నారు. అసెంబ్లీ సాక్షిగా ప్రతిపక్షాన్ని కూడా ఇలాగే బెదిరించారన్నారు. సినిమాలు లేని నటుడు శివాజీతో ఆపరేషన్ గరుడ పేరుతో స్టోరీ చెప్పించారన్నారు. అదే నిజమైతే ఇంతవరకు శివాజీని ఎందుకు విచారించలేదని నిలదీశారు. ప్రతిసారీ ఎన్నికల్లో పొత్తులు పెట్టుకోవడం, ఆ తరువాత బయటకు రావడం ఎవరు చేస్తున్నారో రాష్ట్ర ప్రజలందరికీ తెలిసిందేనన్నారు. పగలు కాంగ్రెస్‌తో రాత్రి బిజెపితో రహస్య సంబంధాలు నెరుపుతూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారన్నారు. ఎమ్మెల్యే కిడారి సర్వేశ్వరరావు హత్య కేసును రాష్ట్ర ప్రభుత్వమే ఎన్‌ఐఎకు అప్పగించినప్పుడు...ప్రతిపక్ష నేతపై దాడి కేసును అప్పగించడం ఫెడరల్ స్ఫూర్తికి విరుద్ధమెలా అవుతుందని ప్రశ్నించారు. పరిటాల రవి, మాధవరెడ్డిల హత్య కేసులు తిరగదోడితే...చంద్రబాబే కుట్రదారుడనే విషయం తెలుస్తుందన్నారు.

ప్రత్యేకం

పిడి ఖాతాలెన్ని..?

సెప్టెంబర్ నివేదికలో 34,877

డిసెంబర్‌లో 45,704 ఖాతాలు

అంకెలపై అకౌంటెంట్ జనరల్ ఆశ్చర్యం

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

ప్రభుత్వం నిర్వహించే పర్సనల్ డిపాజిట్ ఖాతాలపై అనునానాలు ఇంకా తొలగడం లేదు. అసలు ఎన్ని ఖాతాలున్నాయి, వాటిల్లో ఎంత నిధులు ఉన్నాయన్నది అర్థం కాని పరిస్థితి కనిపిస్తోంది. చివరకు అకౌంటెంట్ జనరల్ కార్యాలయమే దీనిపై పెద్ద ఎత్తున అనుమానాలు వ్యక్తం చేయడం విశేషం. ప్రభుత్వం నుంచి వెళ్లిన నివేదికల్లో భిన్న గణాంకాలు చూపించడమే ఇందుకు కారణం.

మార్చి 2018 నాటికి ముగిసిన ఆర్థిక సంవత్సరానికి ఉన్న ఖాతాలపై ఎజి కార్యాలయానికి నివేదికలు వెళ్లాయి. అందులో సెప్టెంబర్, డిసెంబర్ నెలల్లో పంపించిన రెండు నివేదికల్లో భిన్న గణాంకాలను చూపించడాన్ని ఎజి కార్యాలయం ఎత్తి చూపించింది. రాష్ట్ర ఖజానా కార్యాలయం నుంచి సెప్టెంబర్‌లో పంపిన నివేదికలో మార్చి 2018 నాటికి 45,704 పిడి ఖాతాల్లో రూ.30,844 కోట్లు ఉన్నట్లు నివేదించారు. తరువాత కేటగిరీల వారీగా పంపించాలని అధికారులు కోరగా డిసెంబర్‌లో పంపిన నివేదికలో మార్చి 2018 నాటికి 34,877 పిడి ఖాతాలు మాత్రమే ఉన్నట్లు పేర్కొన్నారు. ఈ ఖాతాల్లో రూ.30,815 కోట్లు ఉన్నట్లు ఖజానా అధికారులు నివేదించారు. ఇలా రెండు నివేదికల్లో రెండు రకాల అంకెలు చూపించడాన్ని ఎజి అధికారులు ప్రశ్నించారు. మార్చి నాటికి ముగిసిన ఏడాదికి సంబంధించిన ఖాతాలపై భిన్న నివేదికలు రావడం ఎలా సాధ్యమని ఎజి అధికారులు ప్రశ్నించారు. అలాగే ఒకేసారి 10.287 ఖాతాలను తగ్గించి చూడించడం ఎంతవరకు వాస్తవమంటూ ప్రశ్నించారు. ఇది రాష్ట్ర అధికారుల్లో ఉన్న డోలాయమాన పరిస్థితికి నిదర్శనంగా ఉందని ఎజి వ్యాఖ్యానించింది.

ఇదే సమయంలో పిడి ఖాతాల కేటగిరీలపైనా స్పష్టత కరవైందన్న విమర్శలు వస్తున్నాయి. వాస్తవానికి ఎ-కేటగిరీలో వివిధ స్థానిక సంస్థలు వసూలు చేసే పన్నులు, విద్యా సంస్థలు వసూలు చేసే ప్రత్యేక రుసుములు, ఇతర కార్పొరేషన్లకు సంబంధించిన నిధులు ఉంటాయి. అలాగే బి-కేటగిరీలో రెవెన్యూ డిపాజిట్లు, కోర్టుల్లో డిపాజిట్లు వంటివి ఉంటాయి. అయితే కోర్టు ఫీజులకు సంబంధించి 672 కోట్ల రూపాయలను ఎ-కేటగిరీ పిడి ఖాతాల్లో చూపించారని, దానిని బి-కేటగిరీలో చూపించాల్సిన అవసరం ఉందని ఎజి అధికారులు పేర్కొన్నారు. అలాగే బి-కేటగిరీలో చూపించిన కార్మిక చట్టానికి సంబం ధించిన 665 కోట్లు, పద్మావతి విశ్వవిద్యాలయానికి చెందిన 24 కోట్లు, ఆంధ్రా విశ్వవిద్యాలయానికి చెందిన 78 కోట్లు, ఎస్వీ విశ్వవిద్యాలయానికి చెందిన 17 కోట్లు, కృష్ణదేవరాయ యూనివర్శిటీకి సంబంధించిన 29 కోట్లు వంటివి వాస్తవానికి ఎ-కేటగిరీలో చూపించాలని ఎజి అధికారులు అంటున్నారు. అలాగే వివిధ ఆర్థిక సంఘాలకు చెందిన నిధులు సి-కేటగిరీలో చూపించాలని ఎజి అధికారులు అభిప్రాయపడ్డారు. ఈ అభ్యంతరాలపై తమ అభిప్రాయాన్ని వెల్లడించాలని, ఎజి అధికారులు రాష్ట్ర ఆర్థికశాఖకు లేఖరాసినట్లు తెలిసింది.

సంక్షిప్తం

టిడిపి దాడులకు భయపడం : బిజెపి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

బిజెపి నాయకులపై ముఖ్యమంత్రి చంద్రబాబు, టిడిపి నాయకులు చేస్తున్న దాడులకు భయపడేది లేదని ఆ పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ సభ్యులు పి.విజయబాబు, రాష్ట్ర ఉపాధ్యక్షులు టి.నాగభూషణం తెలిపారు. విజయవాడలోని ఒక హోటల్‌లో శనివారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ కాకినాడ జన్మభూమి సభలో పాల్గొన్న బిజెపి మహిళా కార్పొరేటర్ లక్ష్మీప్రసన్న జిల్లాలో చేపట్టిన అభివృద్ధి పనులు, అవినీతిపై నిలదీయగా సమాధానం చెప్పలేక టిడిపి దాడులకు పాల్పడటం సిగ్గు చేటన్నారు. బిజెపి అధ్యక్షుడు కన్నా లక్ష్మీ నారాయణ శనివారం ఉదయం పూజా కార్యక్రమంలో ఉండగా టిడిపి వర్గాలు ఆయన ఇంటిపై భౌతిక దాడులకు దిగడాన్ని ఖండించారు.

జగన్‌కు మోడీ మద్దతు పలకడం అన్యాయం

లక్ష కోట్లు అవినీతికి పాల్పడిన ప్రతిపక్షనేత వైయస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రధాని నరేంద్రమోడీ మద్దతు పలకడం అన్యాయమని బ్రాహ్మణ కార్పొరేషన్ రాష్ట్ర అధ్యక్షులు వేమూరి ఆనందసూర్య అన్నారు. బందరు రోడ్డులోని టిడిపి కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బిజెపి రాష్ట్ర అధ్యక్షులు కన్నా లక్ష్మీనారాయణ దొంగ నాటకాలు ఆడుతూ రాష్ట్రంలో అల్లకల్లోలం సృష్టించేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు.

ఆర్‌పిఐ సభ్యత్వ నమోదు ప్రారంభం

రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా (ఏ) పార్టీ సభ్యత్వ నమోదు, రెన్యూవల్ కార్యక్రమాన్ని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు కొమ్మారెడ్డి బ్రహ్మానందరెడ్డి శనివారం విజయవాడలో ప్రారంభించారు. ముందుగా మహిళా కార్యకర్తలతో సభ్యత్వం నమోదు చేయించారు. 13 జిల్లాల్లో, నియోజకవర్గాలు, మండల, గ్రామపంచాయతీ, స్థాయిల్లో సభ్యత్వ నమోదు కార్యక్రమం జరుగుతుందని ఆయన తెలిపారు. ఆర్‌పిఐ జాతీయ అధ్యక్షులు, కేంద్రమంత్రి రాందాస్ అథవాలే ఆదేశాల మేరకు ఆంధ్రప్రదేశ్‌లో సభ్యత్వ నమోదు చేపట్టినట్లు తెలిపారు.

ఆర్టీసి కారుణ్య నియామకాలకు గ్రీన్‌సిగ్నల్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఆర్టీసిలో పనిచేస్తూ మరణించిన వారి కుటుంబ సభ్యుల్లో అర్హులైన వారికి కారుణ్య నియామకాల కింద ఉద్యోగాలు కల్పించేందుకు ఆర్టీసి ఎమ్‌డి ఎన్‌వి సురేంద్రబాబు శనివారం ఆదేశాలు జారీ చేశారు. కారుణ్య నియామకాల కోసం ఇప్పటికే 1065 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని, డ్రైవర్, కండక్టర్, శ్రామిక్ పోస్టులను ఐదు దఫాలుగా భర్తీ చేస్తామని తెలిపారు. అర్హులైన వారి వివరాలను డిపో మేనేజర్లు పరిశీలించి జాబితాను ఆయా రీజియన్ల మేనేజర్లకు పంపించాలని ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్(అడ్మిన్) ఎ కోటేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ధ్రువపత్రాల పరిశీలన, ఫిజికల్ వెరిఫికేషన్ అనంతరం అర్హత కలిగిన వారి తుది జాబితాను ఈ నెల 18లోగా చీఫ్ పర్సనల్ మేనేజర్‌కు పరిశీలిన నిమిత్తం పంపాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఇదే విషయాన్ని ఆర్టీసి ఇయు రాష్ట్ర అధ్యక్షులు వైవి రావు, ప్రధాన కార్యదర్శి పలిశెట్టి దామోదరరావు మరో ప్రకటనలో తెలిపారు.

సంక్రాంతిలోగా లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్

ఆర్టీసి సిబ్బందికి 2016 సంవత్సరానికి గాను చెల్లించాల్సిన లీవ్ ఎన్‌క్యాష్‌మెంటును సంక్రాంతిలోగా చెల్లించాలని నిర్ణయించారు. ఈ మేరకు పర్సనల్ ఆఫీసర్లు, డిప్యూటీ సిపిఎంలకు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్(అడ్మిన్) ఎ కోటేశ్వరరావు శనివారం ఆదేశాలు జారీ చేశారు. జనవరి 11లోగా అన్ని రీజియన్లు సంబంధిత లీవ్ రికార్డులను ఆడిట్ చేసి ఎన్‌క్యాష్‌మెంట్ బిల్లును సమర్పించాలని కోరారు.

కృష్ణా, గుంటూరులో హైర్డ్ ఎఎన్‌ఎమ్‌ల తొలగింపు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

మాతా శిశు మరణాల రేటు తగ్గించామని, వందశాతం ఇమ్యునైజేషన్ సాధించామని ప్రచారం చేస్తున్న ప్రభుత్వం ఆ కృషి వెనుక ఉన్న హైర్డ్ ఎఎన్‌ఎమ్‌లను విధుల నుంచి తొలగించింది. కృష్ణా, గుంటూరు జిల్లాల్లో పనిచేస్తున్న దాదాపు 150 మంది హైర్డ్ ఎఎన్‌ఎమ్‌లను శనివారం నుంచి విధులకు రావొద్దని అధికారులు మౌఖిక ఆదేశాలు జారీచేశారు. వైద్యఆరోగ్య శాఖ కేటాయించిన నిధులు నిండుకున్నాయని చెబుతూ ఇకపై రానవసరంలేదని ఆదేశించారు. నోటీసులివ్వకుండా తమను తొలగించారంటూ హైర్డ్ ఎఎన్‌ఎమ్‌లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాజధాని జిల్లాలతోపాటు ఒంగోలు, నెల్లూరు తదితర జిల్లాల్లో హైర్డ్ ఎఎన్‌ఎమ్‌లు పనిచేస్తున్నారు. ఏళ్లతరబడి పనిచేస్తున్న తమను ఎలాంటి నోటీసులు లేకుండా పొమ్మనడం అన్యాయమని వారు వాపోతున్నారు.

విధుల్లోకి తీసుకోవాలి:ఎవి నాగేశ్వరరావు

హైర్డ్ ఎఎన్‌ఎమ్‌లను విధుల్లోకి తీసుకోవాలని యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎవి. నాగేశ్వరరావు శనివారం ప్రకటనలో డిమాండ్ చేశారు. వారి సేవల్ని పరిగణలోకి తీసుకొని ఖాళీగా ఉన్న 2వ ఎఎన్‌ఎమ్ పోస్టులలో నియమించాలని కోరారు.

17 నుంచి తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు

అదేరోజు ఎమ్మెల్యేల ప్రమాణస్వీకారం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ శాసనసభ ఈనెల17న సమావేశం కానుంది. ఉదయం 11.30గంటలకు ప్రొటెం స్పీకర్ ముంతాజ్ అహ్మద్‌ఖాన్ కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్యేలతో ప్రమాణ స్వీకారం చేయిస్తారు. స్పీకర్, డిప్యూటీ స్పీకర్ ఎన్నికకు సంబంధించి అదేరోజు నోటిఫికేషన్ వెలువడనుంది. 18న ప్రొటెం స్పీకర్ ఆధ్వర్యంలో స్పీకర్, డిప్యూటీ స్పీకర్ ఎన్నిక జరుగుతుంది. ఆ తరువాత స్పీకర్ అధ్యక్షతన సభా కార్యకలాపాలు జరుగుతాయి. అదేరోజు సాయంత్రం స్పీకర్ అధ్యక్షతన శాసనసభా సలహా మండలి (బిఎసి) సమావేశం జరుగుతుంది. శాసనసభ సమావేశాల ప్రారంభాన్ని పురస్కరించుకుని రాష్ట్ర గవర్నర్ ఇఎస్‌ఎల్ నరసింహన్ 19న ఉభయసభలను ఉద్దేశించి ప్రసంగిస్తారు. గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానాన్ని 20న ముఖ్యమంత్రి కెసిఆర్ సభలో ప్రవేశపెడతారు. సభ ఆమోదం తర్వాత అసెంబ్లీ వాయిదా పడుతుంది. శాసనమండలి కూడా 17నే సమావేశమవుతుంది. ఆరు సార్లు ఎమ్మెల్యేగా ఎన్నికైన సీనియర్ సభ్యులు ముంతాజ్ అహ్మద్‌ఖాన్(ఎంఐఎం) ను ప్రొటెం స్పీకర్‌గా సిఎం కెసిఆర్ శనివారం ప్రకటించారు. ఈనెల 16న రాజ్‌భవన్‌లో ఆయనచేత గవర్నర్ నరసింహన్ ప్రమాణం చేయిస్తారు.

రాఫెల్ పెద్ద కుంభకోణం : రఘువీరారెడ్డి

ప్రజాశక్తి- పరిగి

మోడీ ప్రభుత్వ హయాంలో రాఫెల్ కుంభకోణం అతి పెద్దదని పిసిసి అధ్యక్షులు రఘువీరారెడ్డి తెలిపారు. శనివారం అనంతపురం జిల్లా పరిగి మండలంలోని సేవామందిర్ పిసిసి మెంబర్ ఎటి శ్రీధర్ నివాసంలో విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశానికి కాంగ్రెస్ అవసరం ఎంతో ఉందన్నారు. ప్రజలు రాహుల్‌గాంధీని ప్రధానిగా చూడాలని కోరుకుంటున్నారని అన్నారు. మోడీపై రోజురోజుకూ వ్యతిరేకత పెరుగుతోందన్నారు. రాష్ట్రంలో ఏ పార్టీ అయినా తమతో కలిసి వస్తే పొత్తులు పెట్టుకుంటామని అన్నారు. ఆ పొత్తులు కూడా అధిష్టానం సూచన మేరకే ఉంటాయన్నారు.



బాలోత్సవం

కృష్ణాజిల్లా మచిలీపట్నంలో జరిగిన బాలోత్సవంలో సాంస్కృతిక కార్యక్రమంలో పాల్గొన్న బాలబాలికలు

ముగిసిన కృష్ణా బాలోత్సవం

ఆకట్టుకున్న సాంస్కృతిక, జానపద నృత్యాలు

ప్రజాశక్తి - కృష్ణాప్రతినిధి

కృష్ణాబాలోత్సవం మచిలీపట్నం చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుందని మున్సిపల్ ఛైర్మన్ మోటమర్రి బాబాప్రసాద్ అన్నారు. హిందూ కళాశాల ఆడిటోరియంలో రెండ్రోజులుగా నిర్వహిస్తున్న కృష్ణా బాలోత్సవం శనివారం ముగిసింది. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. మచిలీపట్నంలో ఉన్న అన్ని పాఠశాలల విద్యార్థులను ఒకే వేదికపైకి తీసుకురావడంలో బాలోత్సవం కమిటీ చేసిన కృషి ప్రశంసనీయమన్నారు. బాలల్లో ఉన్న నైపుణ్యాన్ని వెలికితీయడానికి ఇదొక సదవకాశమన్నారు. ఏడాదిలో రెండు పర్యాయాలు ఈ బాలోత్సవం నిర్వహించాలని, దానికి పురపాలక శాఖ పూర్తి సహకారాలు అందిస్తుందని తెలిపారు. కృష్ణాజిల్లా న్యాయసేవాధికార సంస్థ జిల్లా కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి పిఆర్ రాజీవ్ 16 విభాగాల్లో నిర్వహించిన అకడమిక్, కల్చర్ ఈవెంట్లలో గెలుపొందిన 48 మందికి బహుమతులు ప్రదానం చేశారు. చిన్నారులు ప్రదర్శించిన జానపద నృత్యాలు, రంగోళి, శాస్త్రీయ నృత్యాలను పార్లమెంటు సభ్యులు కొనకళ్ల నారాయణరావు, ముడ ఛైర్మన్ బూరగడ్డ వేదవ్యాస్, పార్టీ నాయకులు బూరగడ్డ రమేష్‌నాయుడు, మంత్రి కొల్లు రవీంద్ర సతీమణి కొల్లు నీలిమ ఆసక్తిగా తిలకించారు. బాలోత్సవం కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కొల్లూరి నరేష్‌కుమార్, డి.వాసు, కమిటీ సభ్యులు కె.ఉదయలక్ష్మి, జొన్నలగడ్డ ఝాన్సీ, మాదాల వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

చైనాకు నిలిచిన మిర్చి ఎగుమతులు

- తెలుగు రాష్ట్రాల్లో మందకొడిగా కొనుగోళ్లు
- ధరలు తగ్గే ప్రమాదం ఉందంటున్న వ్యాపారులు



పల్నాడు ప్రాంతంలో కల్లాల్లో ఆరబోసిన మిర్చి

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

తెలుగు రాష్ట్రాల నుంచి వివిధ దేశాలకు మిర్చి ఎగుమతులు నిలిచిపోయాయి. గత రెండునెలలుగా చైనాకు ఎగుమతులు నిలిపివేశారు. మిర్చి బస్తాల్లో ఇతర వ్యర్థ పదార్థాలు అమర్చి పంపడం వల్ల చైనా ప్రభుత్వం ఈ అంశాన్ని సీరియస్‌గా పరిగణించింది. మళ్లీ అనుమతించే వరకూ భారత్ నుంచి మిర్చిని దిగుమతి చేసుకోవద్దని చైనా అధికారులు నిర్ణయించినట్టు గుంటూరులోని ఎగుమతి దారులు తెలిపారు. చైనాతో పాటు శ్రీలంక, బంగ్లాదేశ్, పాకిస్తాన్, థాయ్‌ల్యాండ్ తదితర దేశాలకు గుంటూరు నుంచి ఎక్కువగా మిర్చి ఎగుమతులు జరుగుతుంటాయి. గుంటూరుతో పాటు తెలంగాణలోని ఖమ్మం, వరంగల్ యార్డుల నుంచి కలిపి మొత్తంగా ఏటా 50 నుంచి 60 వేల టన్నుల వరకూ వివిధ దేశాలకు ఎగుమతి జరుగుతోంది. ఇప్పటికే తెలంగాణలో మిర్చి కొనుగోళ్లు ప్రారంభమయ్యాయి. గుంటూరులో కొనుగోళ్లు మందకొడిగా సాగుతున్నాయి. రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితుల వల్ల మిర్చి సాగు ఈ ఏడాది కొంత జాప్యం జరిగింది. గత 15 రోజులుగా కోతలు ముమ్మరంగా సాగుతున్నాయి. కోసిన మిర్చిని కల్లాల్లో ఆరబోసి ఎండపెడుతున్నారు. గతంలో గుంటూరు మిర్చిపై క్రిమిసంహారక మందుల మోతాదు అధికంగా ఉన్నందున పలు దేశాలు దిగుమతికి తిరస్కరించాయి. ఆ తరువాత క్రిమి సంహారక మందుల వినియోగం తగ్గించారు. గుంటూరు సన్నాలు రకం మిర్చికి దేశ, విదేశాల్లో కూడా మంచి డిమాండ్ ఉంది. గుంటూరు సన్నాలకు బ్రాండ్ ఇమేజ్ కూడా వచ్చింది. క్రిమి సంహారక మందుల అవశేషాలు లేకుండానే ఎగుమతి చేస్తున్నారని గుంటూరులోని స్పైసెస్ బోర్డు అధికారులు తెలిపారు. అయితే చైనాకు వెళ్లిన సరుకులో ఇతర వ్యర్థపదార్థాలు వెళ్లినట్టు ఆరోపణలు రావడంతో ఎగుమతి నిలిచిపోయిన మాట వాస్తవనేని ఒక అధికారి ధృవీకరించారు. ప్రస్తుతం గుంటూరు మిర్చి యార్డుకు సగటున 45 వేల నుంచి 55 వేల బస్తాలు మాత్రమే విక్రయానికి వస్తున్నారు. ఈ ఏడాది నీటి ఎద్దడి, బొబ్బర తెగులు వల్ల దిగుబడి తగ్గుతుందని రైతులు చెబుతున్నారు. ఎకరాకు 20 క్వింటాల వరకూ దిగుబడి లభించాల్సి ఉండగా ఈ ఏడాది 10 నుంచి 12 క్వింటాలు మధ్య దిగుబడి వస్తుందని వారు తెలిపారు. ప్రస్తుతం నాన్ ఏసి రకాలకు తేజ,బాడిగ రకం మిర్చి క్వింటాలు గరిష్టంగా రూ.10,500 వరకూ లభిస్తుంది. ఏసి రకాలకు గరిష్టంగా రూ.8వేల నుంచి రూ.9 వేలు లభిస్తుంది. ఏడాది మిర్చి రైతులకు ఖర్చులు మరింత పెరిగాయి. ఒక్కొ తడికి ఎకరాకు రూ.10 నుంచి రూ.15 వేలు అదనంగా ఖర్చయింది. కనీసం రెండు నుంచి మూడు తడులు పెట్టాల్సి వచ్చింది. 2016లో మిర్చి ధరలు క్వింటాలు రూ.15 నుంచి రూ.16 వేల వరకూ గరిష్ట ధర లభించింది. దీంతో తదుపరి ఖరీఫ్‌లో రైతులు మిర్చి సాగును పెంచారు. కానీ 2017లో మిర్చి ధరలు పడిపోయాయి. దీంతో మిర్చికి క్వింటాలుకు రూ.1500 చొప్పున పరిహారం అందించారు. ఈ పరిహారం పంపిణీ చేసినా కొంత మంది రైతులకు గిట్టుబాటు ధరలు లభించలేదు. 2018 సీజన్‌లో కొంత మేరకు సంతృప్తికరమైన ధర రాలేదు. గతేడాది సగటు ధర రూ. 8 వేలు లభించింది. నెంబరు -5,273 రకం, 341రకాలకు సగటు ధర రూ.10 వేల లోపు వచ్చింది. ఈనెల 10 నుంచి గుంటూరు మిర్చి యార్డుకు రైతులు పెద్ద ఎత్తున మిర్చిని తీసుకువచ్చే అవకాశం ఉంది. ఈనెల 20 నుంచి రోజుకు సగటున లక్ష టిక్కిలు వరకూ వచ్చే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. అయితే ఎగుమతులు లేకపోవడం వల్ల రైతులు ఎక్కువ మంది శీతలగిడ్డంగుల్లో నిల్వ చేసుకుని ధరలు వచ్చినప్పుడు విక్రయించుకుంటే మంచిదని వ్యాపారులు అభిప్రాయపడుతున్నారు.

సవాళ్లపై సమిష్టి పోరాటం

- భారతీయ మూలాలను మరిచిపోవద్దు
- విద్యావిధానంలో సమూల మార్పులు అవసరం
- ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు



సభలో మాట్లాడుతున్న వెంకయ్యనాయుడు

ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

స్వాతంత్ర్యమొచ్చి 70 ఏళ్లయినా ఇప్పటికీ పేదరికం, నిరక్షరాస్యత, లింగ, కులవివక్ష తదితర సవాళ్లను దేశం ఎదుర్కొంటోందని, వాటిపై అందరూ సమిష్టిగా పోరాడాలని భారత ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు అన్నారు. నేటికీ దేశంలో 20 శాతం మంది పేదరికంలోనూ, 20 శాతం మంది నిరక్షరాస్యతలోనూ మగ్గుతున్నారని చెప్పారు. తూర్పుగోదావరి జిల్లా కాకినాడ రంగ రాయ వైద్య కళాశాల ప్రాంగణంలో నిర్వహించిన కళాశాల వజ్రోత్సవం, కళాశాల పూర్వ విద్యార్థుల సంఘం (రామ్ కోస) స్వర్ణోత్సవ వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జ్యోతిప్రజ్వలన చేసి కళాశాల థీమ్ సాంగ్ సీడీని, వజ్రోత్సవ వేడుకల సీడీని, సావనీర్‌ను ఆవిష్కరించారు. డాక్టర్ జి.సురేంద్ర రూపొందించిన ఆంధ్ర చరిత్ర డాక్యుమెంటరీని విడుదల చేశారు. కళాశాల అభివృద్ధికి సేవలందించిన డాక్టర్ సుందర శివరావు విగ్రహాన్ని, ఆర్ఎంసి, రామ్ కోస, జిల్లా రెడ్‌క్రాస్ భవన శిలాఫలకాలను ఆవిష్కరించారు. అనంతరం పలువురిని ఆయన సత్కరించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో వెంకయ్యనాయుడు మాట్లాడుతూ ఆంగ్లేయుల పాలన వల్ల మన మూలాలను, సంస్కృతీ సంప్రదాయాలను మరిచిపోయామని, అదే నేడు విలువలు దిగజారడానికి కారణమని అన్నారు. సమున్నతమైన భారతీయ సంస్కృతీ సంప్రదాయాలను కాపాడుకునేందుకు విద్యా విధానంలో సమూలమైన మార్పులు రావాలని చెప్పారు. ప్రధాని నరేంద్రమోడీ చేపట్టిన సరళతర విధానాలతో యావత్ ప్రపంచం దృష్టి భారతదేశంపైనే ఉందన్నారు. ప్రతిపనీ ప్రభుత్వమే చేయాలనే ఆలోచనను ప్రజలు విడనాడి సమాజాభివృద్ధికి తమ వంతుబాధ్యతనుచిత్తశుద్ధితోనిర్వర్తించాలని కోరారు.

రాష్ట్ర డిజిపి ఆర్‌పి ఠాకూర్ మాట్లాడుతూ రామ్ కోస 50 ఏళ్ల వేడుకలకు ప్రపంచ నలుమూలల నుంచి పూర్వ విద్యార్థులు రావడం ఆనందదాయకమన్నారు. రాజ్యసభ సభ్యుడు కెవిపి రామ చంద్రరావు మాట్లాడుతూ మెడికల్ ప్రొఫెషనల్ ప్రొటెక్షన్ యాక్ట్ 2018 చట్టం రాజ్యసభలో చర్చకు రాబోతోందన్నారు. ప్రముఖ సినీ రచయిత, నటుడు తనికెళ్ల భరణి మాట్లాడుతూ కాకినాడ రంగరాయ వైద్యకళాశాల కీర్తి ప్రపంచ వ్యాప్తంగా ఉందన్నారు. ఇక్కడ చదువుకున్న వేలమంది వైద్యులు ప్రపంచ నలుమూలల ఉన్నారని అన్నారు. మాజీ మంత్రి కామినేని శ్రీనివాస్ మాట్లాడుతూ మెడికల్ ప్రొఫెషనల్ ప్రొటెక్షన్ యాక్ట్ 2018లో డాక్టర్లకు వ్యతిరేకంగా కొన్ని అంశాలు ఉన్నాయని, ఇండియన్ మెడికల్ అసోసియన్ (ఐఎంఎ) ప్రతినిధులతో కలిసి వెంకయ్యనాయుడుకు సమస్యలు వివరిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఉపముఖ్యమంత్రి నిమ్మకాయల చినరాజప్ప, రాంకోస అధ్యక్షుడు డాక్టర్ జి.శేషగిరిరావు, ఆర్ఎంసి ప్రిన్సిపల్ ఆది మహాలక్ష్మి, ప్రముఖ వైద్యుడు డాక్టర్ సమరం, ప్రముఖ పారిశ్రామికవేత్త కెవి రావు తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబుకు కౌంట్‌డౌన్ : రామచంద్రయ్య

ప్రజాశక్తి - కడప

చంద్రబాబునాయుడిపై ప్రజల్లో రోజురోజుకూ అసహనం పెరుగుతోందని, ఆయనకు కౌంట్‌డౌన్ మొదలైందని వైసిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సి.రామచంద్రయ్య అన్నారు. శనివారం స్థానిక వైసిపి జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. చంద్రబాబు నాలుగున్నరేళ్లలో ప్రజలకు, రైతులకు, మహిళలకు, యువతకు చేసింది శూన్యమన్నారు.

పాలనంతా అవినీతి మయమైందన్నారు. మోసపూరిత, మాయమాటలు చెప్పి 2014లో అధికారంలోకి వచ్చాడన్నారు. ఇప్పుడు ప్రజలు అన్నీ తెలుసుకున్నారని ఆయన రాజకీయ జీవితానికి చెక్ పెట్టేందుకు సిద్ధమవుతున్నారని పేర్కొన్నారు. దేశంలో ఎక్కువ అవినీతి ప్రభుత్వం చంద్రబాబు ప్రభుత్వమేనని తెలిపారు.

'శ్రవణం' సేవలను విస్తృత పరచండి

ప్రజాశక్తి - తిరుపతి సిటి

శ్రీ వేంకటేశ్వర వినికిడిలోప నిర్ధారణ శిక్షణా సంస్థ (శ్రవణం) సేవలను మరింత విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని టిటిడి ధర్మకర్తల మండలి అధ్యక్షులు పుట్టాసుధాకర్ యాదవ్ అన్నారు. శనివారం ఆయన 'శ్రవణం' ప్రాజెక్టును పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ తొలిదశలోనే శిక్షణ ఇస్తే వినికిడిలోపాన్ని చిన్నారుల్లో నివారించవచ్చని చెప్పారు. 0-3 ఏళ్లలోపు వయస్సు వినికిడి లోపం ఉన్న చిన్నారులను ఎనిమిది దశల్లో ప్రత్యేకంగా శిక్షణ ఇస్తారని తెలిపారు. శ్రవణం ప్రాజెక్టు గురించి ఎస్‌విబిసిలో ప్రత్యేక కథనాలు, స్క్రోలింగ్ ప్రసారం చేయాలని, కరపత్రాలు, గోడపత్రికలు, హోర్డింగుల ద్వారా ప్రచారం చేయాలని ఛైర్మన్ అధికారులను ఆదేశించారు.

'సచార్' సిఫార్సులు అమలు చేయాలి : ఆవాజ్

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

అన్ని రంగాలలో వెనుకబడిన ముస్లిం మైనార్టీల సంక్షేమానికి సబ్‌ప్లాన్ ఏర్పాటు చేయాలని ఆవాజ్ అనంతపురం జిల్లా ప్రధాన కార్యదర్శి ముస్కిన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ముస్లిం సమస్యల పరిష్కారం కోరుతూ, స్వాతంత్ర్య సమరయోధుల చిత్రాలు, ముస్లిములపై దాడులు, హత్యలు తదితర చర్యలను వ్యతిరేకిస్తూ రూపొందించిన 2019 నూతన సంవత్సరం క్యాలెండర్‌ను శనివారం ఆవాజ్ జిల్లా కార్యాలయంలో ఆవిష్కరించారు. ముస్కిన్ మాట్లాడుతూ మున్సిపల్ జనాభా ప్రకారం రిజర్వేషన్ శాతం పెంపుదల చేయాలని, సచార్ కమిటీ సిఫార్సులు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ముస్లిములకు విద్యా, వైద్య సౌకర్యాలు మెరుగుపరచాలని డిమాండ్ చేశారు.

ప్రజాశాంతి 175 స్థానాల్లో పోటీ

ప్రజాశక్తి - ఏలూరు

2019 ఎన్నికలో ప్రజాశాంతి పార్టీ 175 అసెంబ్లీ, 25 పార్లమెంటు స్థానాల్లోనూ పోటీచేస్తుందని ఆ పార్టీ రాష్ట్ర కో-ఆర్డినేటర్ డాక్టర్ హిప్నో కమలాకర్ తెలిపారు. ఏలూరులో శనివారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్టీ అధ్యక్షుడు కెఎ పాల్ ఈ నెల 9న భీమవరం రానున్నట్లు తెలిపారు. మధ్యాహ్నం మూడు గంటలకు ప్రణమ్ ఫంక్షన్‌హాల్‌లో వివిధ జిల్లాల నుంచి వచ్చిన అభిమానులు, రాజకీయ ఔత్సాహికులతో మాట్లాడతారని చెప్పారు. పార్టీ నిర్మాణం, భవిష్యత్ గురించి దిశానిర్దేశం ఉంటుందన్నారు. మండల, జిల్లాపరిషత్ ఎన్నికల్లో సైతం పోటీచేయనున్నామని తెలిపారు. ఎన్నికల్లో మహిళలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామన్నారు. ముందుకొస్తే రైతులను అభ్యర్థులుగా నిలబట్టి గెలుపునకు కృషిచేస్తామని చెప్పారు.

తడిచిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేయాలి

- జన్మభూమి సభల్లో రైతు సంఘం డిమాండ్
- విశాఖ, శ్రీకాకుళంలో నిరసనలు



గుంటూరు జిల్లా దుగ్గిరాల మండలం, చిలువూరులో వేదిక ఎదుట బైఠాయించిన రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి పి.పెద్దిరెడ్డి

ప్రజాశక్తి యంత్రాంగం

రాష్ట్ర వ్యాపితంగా నాలుగో రోజైన శనివారం జరిగిన జన్మభూమి సభల్లోనూ నిలదీతలు, బహిష్కరణల పర్వం కొనసాగింది. గుంటూరు జిల్లాలో నిర్వహించిన పలు సభల్లో రైతు సమస్యలపై రైతు సంఘం ఆధ్వర్యంలో అధికారులకు విన్నవించారు. దుగ్గిరాల మండలం చిలువూరు సభలో రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి పి.పెద్దిరెడ్డి, ఇతర నాయకులు వేదిక ముందు బైఠాయించారు. తుపానుతో తడిసిన ధాన్యాన్ని మద్దతు ధరకు ప్రభుత్వమే కొనుగోలు చేయాలని, ఫసల్‌బీమా పథకం వర్తింపజేయాలని, రుణమాఫీ సొమ్మంతా జమ చేయాలని డిమాండ్ చేశారు. జొన్న, మొక్కజొన్న, పెసలు, మినుముకు బోనస్ ఇంకా రైతులకు చేరలేదన్నారు. తాడేపల్లి మండలం ప్రాతూరులో నిర్వహించిన సభలో జెడ్‌పిటిసి మాట్లాడుతూ టిడిపికి ఓటేయాలని కోరగా పలువురు అభ్యంతరం చెప్పారు. ఇది రాజకీయ సభ కాదని, ప్రజా సమస్యలు చర్చించి పరిష్కరించాలని సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. వజ్రాల నాగిరెడ్డి అనే రైతు మాట్లాడుతూ తాను బ్యాంకుకు వెళితే మీది ఏ పార్టీ? అని అడుగుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళగిరి 13వ వార్డులో విద్యుత్, పారిశుధ్య సమస్యలపై ముస్లిం మైనార్టీలు నిలదీశారు. సమస్యలు పరిష్కరించకుండా ప్రసంగాలతోనే సరిపెడుతున్నారని అధికారులను కృష్ణాజిల్లా మండవల్లి మండలం పెరికేగూడెం, లింగాల, అల్లినగరం గ్రామాల్లో, వత్సవాయి మండలం మంగొల్లులోనూ ఆయా గామస్తులు అడ్డుకున్నారు. తోట్లవల్లూరు మండలం చాగంటిపాడులో లంకభూముల పట్టాల విషయంలో స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేస్తూ గ్రామస్తులు జన్మభూమిని బహిష్కరించారు. గత జన్మభూమిల్లో ఇచ్చిన సమస్యలను పరిష్కరించకుండా మళ్లీ జన్మభూమి నిర్వహణకు వచ్చి ఏం ప్రయోజనమని విశాఖ జిల్లా హుకుంపేట మండలం తడిగిరిలో సిపిఎం, గిరిజన సంఘం ఆధ్వర్యాన స్థానికులు నిలదీశారు. రోడ్డుకు అడ్డంగా పెద్ద కర్రలు పెట్టి నిర్బంధించారు. పోలీసుల సహకారంతో అధికారులు వెళ్లిపోయారు. ముంచంగిపుట్టు మండలం పెదగూడలో రోడ్డు సమస్యపై గిరిజనసంఘం ఆధ్వర్యాన నిలదీశారు. దాదాపు రెండు గంటలపాటు గ్రామసభ జరగకుండా నినాదాలు చేయడంతో ఎట్టకేలకు అధికారులు స్పందించి, ఈ నెల 8న మంత్రి శ్రావణ్‌కుమార్ చేతులమీదుగా రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేయిస్తామని హామీనివ్వడంతో శాంతించారు. తమకు ఇళ్లు, ఇళ్ల స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సిపిఎం ఆధ్వర్యాన విజయనగరం పూల్‌బాగ్ కాలనీ పేదలు సభను కొద్దిసేపు అడ్డుకున్నారు. జియ్యమ్మవలస మండలం చిన్నబుడ్డిడి, మక్కువ మండలం తూరుమామిడిల్లో తాగునీటి సమస్యపై ప్రజలు నిలదీశారు. ఉపాధి వేతన బకాయిలను వెంటనే చెల్లించాలని గుమ్మలక్ష్మీపురం మండలం లుంబేసు గ్రామ గిరిజనులు సభను నిలదీశారు. గతంలో ఇచ్చిన హామీలను అమలు చేసిన తర్వాతే తమ గ్రామానికి రావాలని శ్రీకాకుళం జిల్లా ఎల్ఎన్‌పేట మండలం ధనుకువాడ గ్రామస్తులు రహదారికి అడ్డంగా కర్రలను కట్టి అధికారులను అడ్డుకున్నారు. తమకు ప్రభుత్వం తీవ్ర అన్యాయం చేస్తోందని ఎపి భవన నిర్మాణ కార్మిక సంఘం ఆధ్వర్యాన భవన నిర్మాణ కార్మికులు శ్రీకాకుళంలోని జన్మభూమిలో ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవిని నిలదీశారు. కర్నూలు జిల్లా కొత్తపల్లి మండలం గోకవరంలో ఎపి రైతుసంఘం జిల్లా అధ్యక్షులు ఎ.రాజశేఖర్ మాట్లాడుతుండగా స్థానిక టిడిపి నాయకులు, అధికారులు మైక్ లాగేశారు. సిపిఎం, టిడిపి నాయకుల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. చివరకు అధికారులు చేసేదేమీ లేక మాట్లాడేందుకు అవకాశం కల్పించారు. చిత్తూరు జిల్లా వెదురుకుప్పం మండల పరిధిలోని చెన్నకేశవులు అనేరైతు 'జన్మభూమి-మా ఊరు'కార్యక్రమానికి అధికారులు రాకుండా దారికి అడ్డంగా కట్టెలను వేశాడు. తనకు అర్హత ఉన్నా పెన్షన్, ఇల్లు ఇవ్వలేదన్నాడు. ఏర్పేడులో వైఎస్ఆర్‌కాంగ్రెస్ అధ్యక్షులు కోటేశ్వరరావు మాట్లాడుతూ తమ పంచాయతీ పరిధిలో 200 మంది నిరుద్యోగులుండగా ఏ ఒక్కరికీ నిరుద్యోగ భృతి అందలేదన్నారు. ఐఐటి నిర్మాణానికి 650 ఎకరాలిస్తే తమ పంచాయతీలో కనీసం స్వీపర్ పోస్టు కూడా ఇవ్వలేదన్నారు. సత్యవేడు మండలం కన్నవరంలో ఎంఎల్‌ఏ తలారి ఆదిత్య కారును సిపిఎం మండల కార్యదర్శి రమేష్ అడ్డుకున్నారు. అనంతపురం జిల్లా చిలమత్తూరు మండలంలో సిపిఎం, సిపిఐ, జనసేన నాయకులు స్థానిక సమస్యలను పరిష్కరించాలని అధికారులను నిలదీశారు. హంద్రీనీవా నీటితో చెరువులను నింపాలని డిమాండ్ చేశారు. అక్కడే ఉన్న పోలీసులు నాయకులను అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. గార్లదిన్నె మండలంలో రైతు సమస్యలను పరిష్కరించాలని, కరువు సహాయక చర్యలు చేపట్టాలని అధికారులను కోరారు.

సిపిఎం నేతలకు బండారు క్షమాపణ

క్షమించమని సిపిఎం నాయకులను బహిరంగంగా కోరుతున్నట్లు విశాఖ జిల్లా పెందుర్తి ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి చెప్పారు.. వేపగుంట జడ్‌పి పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న ఆయనను శుక్రవారం అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని సిపిఎం నాయకురాలు బి రమణి ప్రస్తావించారు. దీనిపై బండారు స్పందిస్తూ..గోశాల వద్ద జరిగిన కార్యక్రమంలో తాను సిపిఎం నాయకులపై విరుచుకుపడినందుకు క్షమాపణ కోరుతున్నట్లు తెలిపారు. సిపిఎం నాయకులు ప్రస్తావించిన సింహాచలం దేవస్థానం సమస్యను మరో రెండు నెలల్లో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.



లక్కిరెడ్డిపల్లె సభలో మహిళలకు రైతు బంధు చెక్‌ను అందజేస్తున్న లోకేష్

రాష్ట్రాభివృద్ధికి బాటలు వేద్దాం : లోకేష్

ప్రజాశక్తి - రామాపురం/లక్కిరెడ్డిపల్లె

2019 ఎన్నికల్లో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును మరోసారి గెలిపించి సిఎంను చేస్తే రాష్ట్రం అన్ని విధాలుగా అభివృద్ధి చెందుతుందని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి నారా లోకేష్ అన్నారు. శనివారం కడప జిల్లా రామాపురం, లక్కిరెడ్డిపల్లె మండలంలో పర్యటించి పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. ఆయా మండలాల్లో నిర్వహించిన జన్మభూమి సభల్లో మాట్లాడారు. ముఖ్యమంత్రిగా చంద్రబాబు రాష్ట్ర ప్రజల బాగు కోసం అహర్నిశలు కృషి చేస్తున్నారన్నారు. అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామన్నారు. సిఎం చంద్రబాబు 68 ఏళ్ల వయసులో కూడా రాష్ట్రాభివృద్ధి కోసం 24 ఏళ్ల యువకుడిలా రోజుకు మూడు జిల్లాల్లో పర్యటిస్తూ కష్టపడుతున్నారని పేర్కొన్నారు. రాష్ట్రాభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం అడ్డుకొంటున్నప్పటికీ రాష్ట్ర నిధులతోనే కడప జిల్లాలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేస్తున్నామన్నారు. మంత్రి వెంట రాజ్యసభ సభ్యులు సిఎం.రమేష్, టిడిపి జిల్లా అధ్యక్షులు శ్రీనివాసులురెడ్డి, కేంద్ర మాజీ మంత్రి సాయిప్రతాప్, కలెక్టర్, అధికారులు పాల్గొన్నారు.

పేదల కోసం పోరాడిన నేత సూర్యనారాయణ : ప్రభాకర్‌రెడ్డి

ప్రజాశక్తి - కర్నూలు క్రైమ్



సూర్య నారాయణ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళ్లు అర్పిస్తున్న కె.ప్రభాకర్‌రెడ్డి , తదితరులు

నిరంతరం వ్యవసాయ, రైతు కార్మికుల హక్కుల కోసం తపన పడే సూర్యనారాయణకు కార్యకర్తలుగా మనమందరం కార్మికులు, పేదప్రజల కోసం పనిచేయడమే ఆయనకు మనమిచ్చే ఘన నివాళని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.ప్రభాకర్‌రెడ్డి అన్నారు. శనివారం సూర్యనారాయణ 31వ వర్ధంతి సభ కర్నూలు జిల్లా కల్లూరు సూర్యనారాయణ భవన్‌లో టి రాముడు అధ్యక్షతన జరిగింది. ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ సూర్యనారాయణ పేద కార్మికుల పక్షాన పనిచేసిన ధైర్యశాలి అని అన్నారు. ఆయన ఎదుగుదలను సహించలేని అప్పటి కాంగ్రెస్ నాయకులు, పాణ్యం ఎమ్మెల్యే పథకం వేసి కాపుకాచి 1980 లో దారుణంగా చంపించారన్నారు. నిజాయితీకి మారుపేరుగా నిలిచిన సూర్యన్ని హత్యచేయించినంత మాత్రాన ఆ ప్రాంతంలో ఉద్యమ పోరాటాలు ఆగలేదని అన్నారు. నిరంతరం పోరాడే బాధ్యత మనందరిపై ఉందన్నారు. రాముడు , ధనలక్ష్మి, సోమన్నలు మాట్లాడుతూ పాణ్యం నియోజకవర్గంలో అభివృద్ధి కుంటుపడిందన్నారు. యువతను పెడదోవ పట్టించి వారిని గుండాలుగా, రౌడీలుగా తయారుచేస్తున్నారు. ఆరు సార్లు జన్మభూమి సభలు జరిపినా పరిష్కారం కాని సమస్యలు అనేకం ఉన్నాయన్నారు. సుధాకరప్ప, యేసు, నాగరాజు, శ్యామల, గోవిందు, ఎల్లనాగన్న, రమణమూర్తి, అరుణ , ఉమా, ప్రమీలమ్మలతోపాటు పలువురు కార్మికులు పాల్గొన్నారు.

ప్రకృతి వనరుల పరిరక్షణకు యాత్ర

ముగిసిన ఎస్‌పిఎఫ్ సైకిల్ ర్యాలీ



శ్రీకాకుళం చేరుకున్న ఎస్‌పిఎఫ్ సైకిల్ యాత్ర

ప్రజాశక్తి- శ్రీకాకుళం ప్రతినిధి

భవిష్యత్తు తరాల కోసం ప్రకృతి వనరులను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందని ఆంధ్రప్రదేశ్ స్పెషల్ ఫోర్స్ (ఎస్‌పిఎఫ్) డైరెక్టర్ జనరల్ మాదిరెడ్డి ప్రతాప్‌గా అన్నారు. ప్రత్యేక రక్షణ దళం (ఎస్‌పిఎఫ్) సైకిల్ యాత్ర శనివారం శ్రీకాకుళం జిల్లాకు చేరుకుంది. యువతకు సైక్లింగ్‌పైనా, ప్రకృతి విపత్తుల సమయంలో పోలీస్ శాఖ స్పందించాల్సిన తీరుపైనా అవగాహన కల్పించేందుకు ఈ యాత్రను చేపట్టారు. ముగింపు సందర్భంగా స్థానిక ఆర్ట్స్ కళాశాల మైదానంలో జరిగిన సభలో ఆయన మాట్లాడారు. ప్రస్తుతం యువత శారీరక దారుఢ్యంపై దృష్టి పెట్టడం లేదన్నారు. కూర్చుని పనిచేసుకునేందుకు ఎక్కువగా ఆసక్తి చూపుతున్నారని పేర్కొన్నారు. దీనివల్ల వ్యాధుల బారిన పడుతున్నారన్నారు. 'హెల్దీ ఇండియా... వెల్దీ ఇండియా' నినాదంతో అనంతపురంలో గత నెల 20న ప్రారంభమైన యాత్ర 1412 కిలోమీటర్లు సాగిందని, రాష్ట్ర వ్యాప్తంగా 1500 మంది ఎస్‌పిఎఫ్ సిబ్బంది ఈ యాత్రలో భాగస్వాములయ్యారని తెలిపారు. డిఐజి బివి రామిరెడ్డి, డిఎస్‌డిఒ పాల్గొన్నారు.

పెనుమంట్రలో హమాలీల నిరసన

పశ్చిమ గోదావరి : హమాలీల సంఘం జిల్లా అధ్యక్షులు చింతకాసుల బాబూరావు ఆధ్వర్యంలో పెనుమంట్ర మండలం బ్రాహ్మణచెర్వు సివిల్ సప్లై గోడౌన్ వద్ద హమాలీలంతా శనివారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా చింతకాసుల బాబూరావు మాట్లాడుతూ.. బ్రాహ్మణచెర్వు సివిల్ సప్లై గోడౌన్ వద్ద ఎగుమతి, దిగుమతి చేస్తున్న హమాలీలందరికీ సమాన పనికి సమాన వేతనాలు అందించాలని డిమాండ్ చేశారు.

సంపాదకీయం

అందం

'మబ్బుల దారుల్లో కాంతి సిరులు ఒలికించే/ చుక్కలు నీ భవితను పండిస్తుంటే/ పువ్వులు దోసిట్లో చిరునవ్వులు తళుకులలో/ తీయని నీ ఊహలు చిగురిస్తుంటే/ రాతిరి తేబోయే వేకువ కల కంటూ/ ...చిన్నారి పాపా నిదురపోవమ్మా' అంటూ అమ్మ పాడే జోలపాటలోని అందం... నిదురలోనూ బోసినవ్వులు చిందించే చిన్నారిని చూసుకొని తల్లి అనుభవించే ఆనందం.. సంతోషాల సంబరం. ఇంట్లో బిడ్డ పుట్టిందంటేనే.. అదో అందాల హరివిల్లు. బుడిబుడి అడుగులతో... బోసినవ్వులు చిందిస్తూ, చెంగుచెంగున ఎగిరే లేడిపిల్లలా గంతులు వేస్తుంటే... ఆ అందం.. ఆనందం వర్ణనాతీతం.'నా సర్వస్వం నీకు ఇచ్చేస్తా.. నా బాల్యం నాకూ ఇచ్చేయ్' అంటాడందుకే సినారె. విశ్వకవి రవీంద్రుడైతే– 'ప్రతి శిశువు ఆగమనం ఒక అద్భుతమే' అంటాడు. అంతేకాదు.. టాగూర్ ఓసారి జపాన్ వెళ్ళినప్పుడు– ఒక మిత్రుడి ఇంట ఆయన కవితా గానం చేస్తుంటే... అక్కడివారంతా మైమరచిపోయి ఆ కవితాఝరిలో రసడోలలూగుతున్నారుట. ఇంతలో టాగూర్ దృష్టి ఆ చిన్నారి మీద మళ్ళింది. ఆయన తన కవిత చదవడం ఆపి ఆ చిన్నారినే చూస్తున్నారుట. అంతరాయానికి కారణమైన చిన్నారిపై ప్రేక్షకులు రుసరుసలాడితే, వారిని మృదువుగా అడ్డుకొని, 'ఓ/ ఆ చిన్నారి లాంటి అందమైన/ ప్రకృతిసిద్ధమైన/ ఒక కవితను/ నేను రాయగల వాడినైతే...' అని చదువుకుంటూ పోయారట. అంటే– ఆ చిన్నారిలాంటి అందమైన సహజసిద్ధమైన ఒక కవితను రాయాలన్నది ఆయన కోరిక. కవిత రాయడం అంత సులభం కాదు. అలాగే... చిన్నారి అనగానే దానికో అందం ఉంటుంది. ఆ అందానికి ఓ నవ్యతను మిళితం చేసుకునే ఈ భూమ్మీదకు వస్తుంది. అందుకే అందం చిన్నారి సొంతం. చిన్నారి ప్రతి కదలిక అందంగా అనిపిస్తుంది. కారణం– ఆ చిన్నారి సహజసిద్ధంగా చేస్తుంది దేనినైనా. ఆరోగ్యమైన, స్వచ్ఛమైన అందంతో నవ్వులు చిందిస్తుంది. అందులో కల్మషం ఉండదు. కపటం ఉండదు. నటన ఉండదు. కనుకనే– 'నవ్వితే నీ కళ్ళు/ ముత్యాలు రాలు, ఆ/ నవ్వే నిను వీడక/ ఉంటే అది చాలు' అంటాడు పాలగుమ్మి విశ్వనాథం తన 'అమ్మ దొంగ' గేయంలో. స్వచ్ఛమైన మనసుకు ప్రతిబింబాలు చిన్నారులు. సహజసిద్ధంగా, ముత్యమంత స్వచ్ఛంగా, పువ్వంత సున్నితంగా, ప్రకృతిలా కనిపిస్తుంటారు. అందుకే అంటాడు శ్రీశ్రీ– 'పాపం పుణ్యం ప్రపంచమార్గం/ కష్టం, సౌఖ్యం, శ్లేషార్థాలూ/ ఏమీ ఎరుగని పూవుల్లారా/ అయిదారేడుల పాపల్లారా/ మెరుపు మెరిస్తే /వాన కురిస్తే/ ఆకసమున హరివిల్లు విరిస్తే / అవి మీకే అని ఆనందించే/ కూనల్లారా...' అని తన 'శైశవగీతి'లో. కాబట్టే... చిన్నారి అందం చూసేవారికీ హాయిగా ఉంటుంది.

ఇదే విషయంపై ఆచార్య గోపీ 'బాల్యం కావాలా అనీ/ ఎవరైన అడిగితే/ వద్దు వద్దనీ అంటాను/ మళ్ళీ దాన్ని దాటి/ ఇక్కడికేగా రావలిసింది' అంటూ ఛలోక్తి విసురుతారు. చిన్నారి ప్రపంచంలో జరుగుతున్న అనేకానేక మార్పులే దీనికి కారణం. వాటిలో ఒకటి– చిన్నారి బాలికలకు అందాల పోటీలు. 'లిటిల్ ప్రిన్సెస్'గా ఎన్నికైన ఐదేళ్ల పాప జార్జియాలో జరిగే అంతర్జాతీయ పోటీలలో పాల్గొంటున్నది. బుడిబుడి అడుగుల నాడే ఎంట్రెన్సుల పేరుతో కార్పొరేట్ చదువులు బాల్యాన్ని బలి తీసుకుంటుంటే.. ఈ అందాల పోటీలు వారి బాల్యాన్ని, ఆరోగ్యాన్ని, ఆనందాన్ని నాశనం చేస్తాయి. దీని వెనుక అతి పెద్ద మార్కెట్ విస్తరించి వుంది. అందాల పోటీలపై ఏడాదికేడాది వేలకోట్ల రూపాయలను వెచ్చిస్తోన్న కార్పొరేట్ల దృష్టి ఇప్పుడు పిల్లలపై పడింది. పాలుగారే పసిబుగ్గలపై కృత్రిమ రసాయన సౌందర్య సాధనాలను పులిమి తమ మార్కెట్‌ను మరింత పెంచుకోడానికి చిన్నారులను పావులుగా మార్చుకుంటున్నాయి. శరీరాకృతి, వేష భాషలు, అందానికి మెరుగులు దిద్దుకోవడం వంటివి పసితనం నుంచే ప్రాధాన్యతాంశాలైతే.. ఇక అందమైన బాల్యాన్ని అనుభవించే సమయం దొరకబుచ్చుకునేదెప్పుడు. తమ ప్రాణాలను సైతం లెక్క చేయకుండా పురిటి నొప్పుల్ని భరించి, బిడ్డలకు జన్మనిచ్చిన తల్లులు కూడా తమ బిడ్డల భవిష్యత్‌ను కోరికోరి అంధకారంలోకి నెట్టడం ఆధునికతగా మారింది.

ఏ మనిషికైనా బాల్యమే భవిష్యత్తుకు ప్రాతిపదిక. బాల్యంలో అలవరుచుకున్న మంచి అలవాట్లు, అభిరుచులు ఉజ్వలమైన భవిష్యత్తుకు పునాది. పిల్లలకు అందమైన బాల్యాన్నిస్తే వారి భవిష్యత్తు అందంగా ఉంటుంది. రాబర్ట్ మిన్హాస్ మాటల్లో చెప్పాలంటే– 'భావోద్వేగాలనేవి శరీర పరిపక్వతను అనుసరించి సహజ పద్ధతిలో వికాసం చెందవలసిన ప్రకృతి ధర్మాలు. అసహజమైన రీతిలో, అభివృద్ధిని సాధించే క్రమంలో జీవితంలో ఆయాచితంగా లభించే అందాలని, ఆనందాలని, అనుభవాలని శాశ్వతంగా కోల్పేయే ప్రమాదం పొంచి ఉంద'నేది అభిప్రాయం. బాల్యం అనేది ప్రశాంతంగా, సహజంగా ముందుకు సాగవలసిన వికసన దశ. తద్విరుద్ధంగా జరిగితే అందమైన బాల్యం అందకపోవడమే కాదు.. ముందు ముందు అనుభవించాల్సిన ఆనందకర జీవితాన్నీ చేజేతులా నాశనం చేసుకున్నట్లే. చిన్నారిని టాగూర్ చూసినంత అందంగా చూడగలిగిన శ్రీశ్రీ– 'బాలలే విజ్ఞాన హేతువులు/ నేడు రేపుల మధ్య సేతువులు/ చంద్ర బంధుర సుధా శీతువులు/ మానవత్వ వికాస హేతువులు' అని ఆకాంక్షించాడు. 'మీదే మీదే సమస్త విశ్వం/ మీరే లోకపు భాగ్య విధాతలు/ మీ హాసంలో మెరుగులు తీరును/ వచ్చే నాళ్ళ విభాప్రభాతములు' అంటా ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. కార్పొరేట్ మాయాజాలం నుండి బయటపడి, చిన్నారులు విజ్ఞాన హేతువులుగా మారాలంటే, అందమైన భవితను వారికి అందించాలంటే... అది తల్లిదండ్రుల చేతిలోనే వుంది.

ఇదీ విషయం



ప్రతిమల పెండ్లిజేయుటకు
వందల వేలు వ్యయింతురే కానీ
దుఃఖితమతులైన పేదల పకీరుల
శూన్యములైన పాత్రలలో
మెతుకు విదల్పరు ఈ భరతమేదిని

- గుర్రం జాషువా

విశ్లేషణ

కార్మిక సంఘాల స్వతంత్రతకు సవాలు

నూతన సంవత్సరంలో కార్మికులకు కేంద్ర ప్రభుత్వం ఒక కానుకను అందించింది. అదేమిటంటే '1926 ట్రేడ్ యూనియన్ చట్టా'నికి సవరణలు చేయాలని జనవరి 2వ తేదీన జరిగిన కేబినెట్ సమావేశంలో నిర్ణయించింది. దీనికి అనుగుణంగా పార్లమెంట్ సమావేశాలలో బిల్లును ప్రవేశపెట్టాలని కూడా సన్నాహాలు చేస్తోంది. వాస్తవానికి ఈ చట్టానికి సవరణలు చేయాలని, మరి కొన్ని అంశాలు పొందుపరచాలని ఇటు కేంద్ర కార్మిక సంఘాలు, అటు యాజమాన్యాలు కూడా తమ స్వప్రయోజనాలకు అనుగుణంగా ప్రభుత్వాన్ని కోరుతున్నాయి. కానీ ఇప్పుడు ప్రభుత్వం ప్రతిపాదించిన సవరణలు తమకు నచ్చిన యూనియన్‌ను పెట్టుకునే కార్మికులకున్న హక్కును హరించి వేసి, యాజమాన్యాలకు అనుకూలం గా ఉండే యూనియన్లను గుర్తించే విధంగా ఉన్నాయి.




ఎ అజ శర్మ

కార్మిక సంఘాలకు గుర్తింపు ఇవ్వడంలోను, వాటికి అఖిల భారత, రాష్ట్ర స్థాయిలలో వివిధ కమిటీలలో ప్రాతినిధ్యం ఇవ్వడంలోనూ, కార్మిక సంఘాలకు ప్రస్తుతం కొద్దిపాటి పారదర్శక అవకాశాలు వున్నాయి. వాటిని తీసి వేసి ఆ స్థానంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ఏకపక్షంగా అధికారాలను కల్పిస్తూ చట్టంలోని సెక్షన్ 28, 29లను సవరిస్తూ నేటి సవరణలు ప్రతిపాదించబడ్డాయి. ప్రభుత్వ అనుకూల బిఎంఎస్ మినహా దేశంలోని పది కేంద్ర కార్మిక సంఘాలు దీనిపై తమ తీవ్ర వ్యతిరేకతను ప్రభుత్వానికి తెలపడంతో పాటు, మరికొన్ని సూచనలతో, ముఖ్యంగా కార్మిక సంఘాలను ప్రజాస్వామ్య పద్ధతులలో రహస్య బ్యాలెట్ ద్వారా ఎన్నుకునే నిబంధన చట్టంలో పొందుపరచాలని కోరాయి. కానీ ప్రభుత్వం కార్మిక సంఘాలు ప్రతిపాదించిన ఏ ఒక్క అంశాన్ని ఈ బిల్లులో పొందుపరచలేదు.

మన దేశంలో 1926లో నాటి బ్రిటిష్ కాలంలో ట్రేడ్ యూనియన్ చట్టం చేయబడింది. అప్పటికే దేశంలో ఎఐటియుసి (అఖిల భారత ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్) ఏర్పడి, కార్మిక హక్కులపై పోరాటాలు బలంగా సాగుతున్నాయి. ఆనాడు కార్మికులు ఎక్కడికక్కడ దేశంలోని అనేక ప్రాంతాలలో తమంతట తాముగా సమస్యల పరిష్కారానికి సమ్మెలు చేయడం బ్రిటిష్ ప్రభుత్వానికి పెద్ద సమస్యగా మారింది. దీనితో కార్మిక సంఘాలను క్రమబద్ధీకరించ డానికి, వాటి పనిపై కొన్ని నియమ నిబంధనలు రూపొందించాలన్న లక్ష్యంతో ఈ చట్టం చేసింది.

ఈ చట్టం ప్రకారం ఒక పరిశ్రమలో ఏడుగురు కార్మికులు యూనియన్ పెట్టుకోవాలని భావిస్తే లేబర్ కమిషనర్ వద్ద రిజిస్టర్ చేసుకోవచ్చు. అలా రిజిస్టర్ అయిన యూనియన్ కొన్ని నిబంధనలకు లోబడి యాజమాన్యాలతో సంప్రదింపులు, ఒప్పందాలు చేసుకునే హక్కులు ఉన్నాయి. అయితే ఒకటి కంటే ఎక్కువ యూనియన్లు ఒక సంస్థలో ఉన్నపుడు ఏ యూనియన్‌తో సంప్రదింపులు జరపాలి అన్నది కాని, అలాగే ఒకే యూనియన్ ఉన్నప్పుడు దానిని కచ్చితంగా యాజమాన్యం గుర్తించి తీరాలన్న నిబంధన కాని ఆ చట్టంలో లేదు. దీంతో యాజ మాన్యాలు చిన్నదైనా తమ అనుకుల యూనియన్లను గుర్తించి, సంఖ్య రీత్యా పెద్ద యూనియన్లను గుర్తించ నిరాకరించిన సంఘటనలు అనేకం ఉన్నాయి. వాస్తవానికి అత్యధిక కార్మికులు సభ్యులుగా ఉన్న సంఘాలకు పోటీగా తమ తొత్తు యూనియన్లను యాజమాన్యాలే పెట్టించి వాటినే గుర్తించడం యాజమాన్యాల ఎత్తుగడ. అనేక ప్రైవేటు రంగ సంస్థలలో యూనియన్ పెట్టుకున్నందుకే దానికి నాయకత్వం వహించిన కార్మికులను యాజమాన్యాలు పనిలో నుండి తీసివేయడంతో సహా అనేక రూపాలలో కక్ష సాధింపు చర్యలకు పాల్పడడం నేడు రివాజుగా మారింది. అటువంటి యాజమాన్యాలపై ఎటు వంటి చర్యలు తీసుకోనివ్వకుండా కార్మిక శాఖకు కోరలు తీసివేసి, ఆచరణలో యాజమాన్యాల శాఖగా ప్రభుత్వాలు మార్చివేసాయి.



అసలు ఆర్ఎస్ఎస్ విధానమే యాజమాన్యాలకు సేవ చేసి, కార్మికులను కట్టు బానిసలుగా చేయడం. దీని కనుగుణంగానే వాజ్‌పేయి నాయకత్వంలోని ఎన్‌డిఎ -1 ప్రభుత్వం 2001లో ట్రేడ్ యూనియన్లు పెట్టుకునే కార్మికుల హక్కును కఠినతరం చేస్తూ సవరణలు చేసింది. నేటి నరేంద్ర మోడీ ప్రభుత్వం మరింత దూకుడుగా అన్ని కార్మిక చట్టాలను సమూలంగా యాజమాన్యాలకు అనుకూలంగా సవరిం చేయాలని కుతూహలంగా ఉంది. ఎన్నికల ముందు కార్పొరేట్ శక్తులకు తన విధేయతను, స్వామి భక్తిని చాటుకోవడానికే నేటి ట్రేడ్ యూనియన్ చట్ట సవరణ.

చట్టంలో లేకపోయినా కార్మిక సంఘాల గుర్తింపుకై ఇప్పుడు అనుసరిస్తున్న విధానం ఒకటి ఉంది. అదేమిటంటే దేశంలో కేంద్ర కార్మిక సంఘాలు, ప్రభుత్వ కార్మిక మంత్రిత్వ శాఖ ఉమ్మడిగా చర్చించుకుని కార్మిక శాఖకు వాటి అనుబంధ యూనియన్లు ప్రతి సంవత్సరం సమర్పించే వార్షిక రాబడి ఆధారంగా వెరిఫికేషన్ పద్ధతిలో కేంద్ర స్థాయిలో కేంద్ర కార్మిక సంఘాలకు ప్రాతినిధ్యం కల్పించబడుతోంది. ఈ పద్ధతి గత మూడు దశాబ్దాలుగా అమలు చేయబడుతోంది. కానీ నేడు దీనిని పూర్తిగా తోసి రాజని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు కార్మిక సంఘాల గుర్తింపుపై విశేష అధికారాలను కేంద్ర ప్రభుత్వం ఈ సవరణల ద్వారా కల్పిస్తోంది. దీని వల్ల కార్మిక సంఘాలకు అసలైన ప్రాతినిధ్యం లభించకుండా ప్రభుత్వం జోక్యం చేసుకునే అవకాశం ఏర్పడుతుంది. 2016 లో అంతర్గత కారణాలతో ముగ్గురు నాయకులు వేరే సంస్థను ఏర్పాటు చేసుకుంటే, ఆ కారణం చూపి దేశంలోనే అతి పెద్ద కేంద్ర కార్మిక సంఘమైన ఐఎన్‌టియుసికి ఇండియన్ లేబర్ కాన్ఫరెన్స్‌తో సహా వివిధ త్రైపాక్షిక కమిటీలలో ప్రాతినిధ్యం లేకుండా చేసింది నరేంద్ర మోడీ ప్రభుత్వం. ఈ చర్యను అన్ని కేంద్ర కార్మిక సంఘాలు వ్యతిరేకించినా ప్రభుత్వం మాత్రం ఖాతరు చేయలేదు. యూనియన్లలోని అంతర్గత విషయాలలో చట్టబద్ధం గానే జోక్యం చేసుకునే హక్కు ఈ సవరణల ద్వారా ఇక ప్రభుత్వానికి సంక్రమిస్తుంది.


ఒక పరిశ్రమలో కార్మిక సంఘ గుర్తింపు ఇచ్చే పద్ధతి నేడు అన్ని రాష్ట్రాలలో ఒకేలా లేదు. కోడ్ ఆఫ్ డిసిప్లైన్ ఆధారంగా రహస్య బ్యాలెట్ ద్వారా కానీ, చెక్‌ఆఫ్ పద్ధతి ద్వారా కానీ కార్మిక సంఘాలకు గుర్తింపు ఇచ్చే పద్ధతి కొన్ని రాష్ట్రాలలో అమలవుతోంది. అయితే అనేక రాష్ట్రాలలోని పరిశ్రమలో ఒకే ఒక యూనియన్ ఉన్నా ఆ యూనియన్‌ను యాజమాన్యాలు, ముఖ్యంగా ప్రైవేటు రంగంలో గుర్తించడానికి నిరాకరిస్తున్నాయి. ఫలితంగా యూనియన్ పెట్టుకున్నందుకే యాజ మాన్యాలు నాయకులపై కక్ష సాధింపులకు పాల్పడు తున్న ఘటనలు అనేకం ఉన్నాయి. హర్యానా రాష్ట్రం మనేసర్ లోని మారుతి సుజుకి పరిశ్రమలోను, తాజాగా తమిళనాడు లోని యమహా కంపెనీలోను యాజమాన్యాలు కేవలం యూనియన్ ఏర్పాటు చేసుకున్నందుకే తీవ్ర నిర్బంధాన్ని ప్రయోగించి, కార్మికులపై అక్రమ కేసులు బనాయించి, జైళ్ళల్లో కూడా పెట్టించాయి. మహారాష్ట్ర, హర్యానా, రాజస్థాన్, కర్నాటక వంటి రాష్ట్రాలలో అనేక ప్రైవేటు యాజ మాన్యాలు యూనియన్లను గుర్తించ నిరాకరించడంతో ఈ సమస్యపై అనేక కార్మిక పోరాటాలు జరుగు తున్నాయి. యాజమాన్యాల ఇలాంటి ఘాతుకాలకు అడ్డుకట్ట వేసి, కార్మిక సంఘాన్ని యాజమాన్యాలు తప్పకుండా గుర్తించే విధంగా ట్రేడ్ యూనియన్ చట్టంలో నిబంధనలు విధించాలని కేంద్ర కార్మిక సంఘాలు కోరగా, ప్రభుత్వం మాత్రం వీటిని ఖాతరు చేయకుండా ఆచరణలో యూనియన్లు లేకుండా చేయాలనే దుర్బుద్ధితోనే ప్రస్తుత సవరణలకు శ్రీకారం చుట్టింది. నరేంద్ర మోడీ ప్రభుత్వం 2014లో అధికారంలోకి వచ్చినప్పటి నుండి యాజమాన్యాలకు అనుకూలంగా కార్మిక చట్టాలను మార్చాలని ఉవ్విళ్లూరుతోంది. 44 ప్రస్తుత కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్‌లుగా మార్చే కార్మిక చట్ట సంస్కరణలకు రంగం సిద్ధం చేసింది. అందులో భాగమే నేటి ట్రేడ్ యూనియన్ చట్ట సవరణ.

అసలు ఆర్ఎస్ఎస్ విధానమే యాజమాన్యాలకు సేవ చేసి, కార్మికులను కట్టు బానిసలుగా చేయడం. దీని కనుగుణంగానే వాజ్‌పేయి నాయకత్వంలోని ఎన్‌డిఎ -1 ప్రభుత్వం 2001లో ట్రేడ్ యూనియన్లు పెట్టుకునే కార్మికుల హక్కును కఠినతరం చేస్తూ సవరణలు చేసింది. ట్రేడ్ యూనియన్ చట్టం 1926లో అప్పటి వరకు ఏడుగురు కార్మికులు సంఘం పెట్టుకోవచ్చనే బ్రిటిష్ ప్రభుత్వం కల్పించిన వెసులు బాటును కూడా తీసి వేసి, మొత్తం కార్మికులలో 10 శాతం కార్మికులు సభ్యులుగా ఉంటేనే సంఘం రిజిస్టర్ చేయబడుతుందని చట్టంలోని సెక్షన్–4ను సవరించింది. నేటి నరేంద్ర మోడీ ప్రభుత్వం మరింత దూకుడుగా అన్ని కార్మిక చట్టాలను సమూలంగా యాజమాన్యాలకు అనుకూలంగా సవరిం చేయాలని కుతూహలంగా ఉంది. కార్మికుల ప్రతిఘట నలతో తాను అనుకున్న నాలుగు లేబర్ కోడ్‌లను ఇంకా చేయలేక పోయింది. నేడు ఎన్నికల ముందు ట్రేడ్ యూనియన్ కార్పొరేట్ శక్తులకు తన విధేయతను, స్వామి భక్తిని చాటుకోవడానికే నేటి చట్ట సవరణ. కార్మికులను యాజమాన్యాలకు బానిసలుగా మార్చే ఇటువంటి చర్యలను సహించేది లేదని కార్మికులు ముక్త కంఠంతో నినదించే సమయం ఆసన్నమైంది. జనవరి 8, 9 తేదీలలో జరిగే అఖిల భారత సమ్మెలో కోట్లాదిగా పాల్గొనడం ద్వారా కార్మికులు కూడా నరేంద్ర మోడీ ప్రభుత్వానికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపి, మరో నాలుగు నెలలలో తాము ఇచ్చే బహుమతిని స్వీకరించడానికి సిద్ధంగా ఉండమని తమ సంకల్పాన్ని చాటిచెప్పాలి.

(రచయిత సిఐటియు రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షులు)

విశ్లేషణ

మోడీ మౌనం మాటున ...



సీతారాం ఏచూరి


(నిన్నటి తరువాయి)

రిజర్వ్ బ్యాంక్

ఇటీవల పదవికి రాజీనామా చేసిన రిజర్వ్ బ్యాంక్ గవర్నర్ ఊర్జిత్ పటేల్ ఈ విషయాన్ని తన వద్ద ఆరేడు నెలల ముందే ప్రస్తావించారని ప్రధాని చెబుతున్నారు. రిజర్వ్ బ్యాంకు స్వేచ్ఛను, ఆర్థిక నియంత్రణా వ్యవస్థగా వున్న అధికారాన్ని గుర్తించని ప్రభుత్వంతో వ్యవహరించటం కష్టమని గుర్తించినందువల్లే మాజీ గవర్నర్ రఘురామ్ రాజన్ తన పదవి నుండి తప్పుకున్నారు. తరువాత ప్రధాని తనకు అనుకూలమైన వ్యక్తిని ఈ పదవిలో నియమించుకున్నారన్న విషయాన్ని ఆయన మాటలే రుజువు చేస్తున్నాయి. ప్రధాని, ఆయన నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం రిజర్వ్ బ్యాంకు వద్ద వున్న రిజర్వ్ నిధులపై కన్నేసి, వాటిని తమకు తరలించమని డిమాండ్ చేస్తోంది. పన్ను వసూళ్ల రాబడి తగ్గటంతో ప్రభుత్వానికి ఈ నిధుల అవసరం ఏర్పడింది. జిఎస్‌టి అమలు తరువాత బడ్జెటరీ ద్రవ్యలోటు లక్ష్యం ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి ఏడు నెలల కాలంలోనే మరింత పెరిగింది. దీనితో పాటు బ్యాంకులకు పెట్టుబడులు సమకూర్చటానికి కూడా మరింత డబ్బు కావాల్సి వస్తోంది. ఈ రెండు కారణాలతోనే రిజర్వ్ బ్యాంకు రిజర్వ్ నిధులపై కేంద్రం కన్నేసిందన్నది సుస్పష్టం. ఈ రిజర్వ్ నిధులు ప్రభుత్వ ఆధీనంలోకి వెళ్తే రిజర్వ్ బ్యాంకు తీవ్ర అస్థిరతకు గురవటంతో పాటు మన ఆర్థిక వ్యవస్థ మూలాలపై తీవ్ర ప్రభావం పడుతుంది. అంతేకాక ఇది ఆర్థిక మార్కెట్లపై తీవ్ర ప్రభావాన్ని చూపనుండటంతో దేశంలో కొత్త తరహా ఆర్థిక సంక్షోభం తలెత్తుతుంది.

పెరుగుతున్న మత చిచ్చు

అయోధ్య లోని వివాదాస్పద స్థలంలో రామ మందిరాన్ని నిర్మించే విషయంలో ప్రధాని ఒక పైశాచిక ప్రకటన చేశారు. సుప్రీంకోర్టు ఈ కేసులో తీర్పు వెలువరించిన తరువాత ప్రభుత్వం దీనిపై ఆర్డినెన్స్‌ను జారీ చేయటం లేదా చట్టాన్ని తేవటం వంటి ప్రతిపాదనలను పరిశీలిస్తుందన్నారు. అంటే ఇది సానుకూల తీర్పు కోసం కోర్టుపై ఒత్తిడి పెంచటమే అవుతుంది. ఒకవేళ వ్యతిరేక తీర్పు వెలువడితే దానిని పక్కన పెట్టేందుకు అవసరమైన చట్టపరమైన చర్యలను ప్రభుత్వం తీసుకుంటుందట. అంతే తప్ప తాము కోర్టు తీర్పునకు కట్టుబడి వుంటామని ప్రధాని ప్రకటించక పోవటం గమనార్హం. అంటే కోర్టు తీర్పు ఎలా వున్నా తాము రామ మందిర నిర్మాణాన్ని పూర్తి చేసి తీరుతామని ప్రకటించటమే అవుతుంది. వచ్చే ఎన్నికల్లో హిందూత్వ ఓటు బ్యాంకును సుస్థిరం చేసుకునేందుకు ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలకు ఈ మతోన్మాద ప్రచారం సహకరిస్తుందన్న వాదన దీనితో బలపడుతోంది. కొట్టి చంపే ఘటనలపై ప్రధాని చేసిన వ్యాఖ్యలు దీనిని మరింత బలపరుస్తున్నాయి. ఈ ఘటనలను ప్రధాని నోటి మాటగా ఖండించినప్పటికీ యు.పి వంటి బిజెపి పాలిత రాష్ట్రాలలో శాంతిభద్రతల యంత్రాంగం పని తీరుపై ఆయన పూర్తి మౌనం వహిస్తున్నారు. గోరక్షణ దళాలు, లేదా నైతిక పోలీసింగ్ పేరుతో ప్రైవేటు సైన్యాలను బిజెపి ప్రభుత్వాలు పెంచి పోషిస్తున్నాయి. ఈ ప్రైవేటు సైన్యాల చేతుల్లో ప్రాణాలు కోల్పోతున్న ముస్లింలు, దళితులపై ప్రధాని ఒక్క మాట కూడా మాట్లాడలేదు. దేశంలో అనేక ప్రాంతాలలో పెరుగుతున్న మూక హత్యలతో విస్తరిస్తున్న విద్వేష వాతావరణం, హింసపై కూడా ఆయన పెదవి విప్పటం లేదు. అలాగే మహిళలపై పెరుగుతున్న వేధింపులు, చిన్నారులపై సామూహిక అత్యాచారాలు, హత్యలపై కూడా ప్రధాని మౌనం కొనసాగిస్తున్నారు. దళితులు, ముస్లింలు, మహిళలపై పెరుగుతున్న ఈ దాడులకు పాల్పడుతున్న వారిపై నమోదు చేసిన కేసులను బిజెపి ప్రభుత్వాలు ఎందుకు ఉపసంహరించుకుంటున్నాయన్న దానిపై కూడా ప్రధాని నుండి మౌనమే సమాధానంగా లభిస్తోంది. బాధితులు మాత్రం ఈ కేసులతో వేధింపులకు గురవుతున్నారు.



ట్రిపుల్ తలాక్, శబరిమల

పార్లమెంట్‌లో తాము ప్రవేశపెట్టిన ట్రిపుల్ తలాక్ బిల్లు లింగ సమానత్వం, సామాజిక న్యాయ సాధనకు సంబంధించినదని, ముస్లిం మహిళలకు సమాన హక్కులు కల్పించేందుకే ఈ బిల్లు ప్రవేశపెట్టామని ప్రధాని చెప్పుకుంటున్నారు. అయితే అదే సమయంలో శబరిమల ఆలయం విషయంలో లింగ సమానత్వం ప్రస్తావనకు వచ్చినపుడు అదంతా భక్తి విశ్వాసాలకు సంబంధించిన విషయమని కప్పదాటు వేస్తున్నారు. ఈ రెండు నాల్కల ధోరణి బిజెపి మతోన్మాద అజెండాను పునరుద్ఘాటిస్తోంది. శబరిమల పేరుతో బిజెపి క్షేత్ర స్థాయిలో అశాంతిని, హింసను రెచ్చగొడుతోంది.

2019 ఎన్నికలు

రానున్న సార్వత్రిక ఎన్నికల ఫలితాలను దేశ ప్రజలే నిర్ణయిస్తారంటూ ప్రధాని పాత పాటనే పాడారు. అది నిజమే. వారు అన్ని ఎన్నికల్లోను అలానే వ్యవహరిస్తారు. కానీ ప్రస్తుత ప్రభుత్వం నుండి దేశ ప్రజలు మార్పును కోరుతున్న విషయం క్రమంగా స్పష్టతను సంతరించుకుంటోంది. ఎట్టి పరిస్థితుల్లోనూ తమకు ఈ ప్రభుత్వం నుండి విముక్తి కావాలని వారు కోరుకుంటున్నారు. ప్రజల నుండి పెరుగుతున్న ఈ ఒత్తిడి లౌకిక శక్తులన్నిటినీ ఏకతాటిపైకి తెచ్చి ఈ ప్రభుత్వాన్ని, బిజెపిని వచ్చే ఎన్నికల్లో ఎట్టి పరిస్థితుల్లోనూ ఓడించి తీరాలన్న ఒత్తిడి పెంచుతోంది. ముఖ్యంగా ప్రభుత్వ విధానాల పట్ల ప్రజల్లో పెరుగుతున్న అసంతృప్తి, ఇటీవలి కాలంలో ఊపందుకుంటున్న ప్రజా పోరాటాలు ఈ విషయాన్ని మరోసారి రుజువు చేస్తున్నాయి. ఈ నెల 8,9 తేదీల్లో జరుగనున్న అఖిల భారత సార్వత్రిక సమ్మె దేశంలోని కార్మికలోకం ఐక్యతను మరోసారి రుజువు చేయనుంది. మరికొద్ది రోజుల్లోనే రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల పిలుపు మేరకు జరుగనున్న గ్రామీణ భారత బంద్ మోడీ సర్కారును గద్దె దింపాలన్న ప్రజల కృతనిశ్చయాన్ని, ప్రజానుకూల విధానాల కోసం వారు చేస్తున్న డిమాండ్‌ను మరోసారి తెర పైకి తేనుంది. ఇప్పుడు దేశ ప్రజలు నేతలను కాదు. నీతి (విధానాల)ని కోరుతున్నారు. 2019 ఎన్నికలు ప్రధాని, ఆయన ప్రభుత్వానికి, దేశ ప్రజలకు మధ్య ప్రత్యక్ష పోటీ అని చెప్పవచ్చు. షేక్స్పియర్ చెప్పినట్లు 'అరేబియా నుండి వచ్చే అన్ని అత్తర్లూ మన చేతికున్న రక్తపు మరకలను తుడిచి వేయలేవు' ప్రధాని గారూ.


సమీక్ష


ఐసిడిఎస్ పరిరక్షణ-ఉద్యోగ భద్రతకు ఉద్యమం

అధికారంలోకి వచ్చే ముందు అంగన్‌వాడీ సెంటర్లను బలపరుస్తాం, వేతనాలు పెంచుతామని గొప్పలు చెప్పిన నరేంద్రమోడీ అధికారంలోకి వచ్చిన తరువాత ఐసిడిఎస్‌కు తూట్లు పొడిచారు. తల్లీ బిడ్డల సంక్షేమాన్ని గాలికొదిలేశారు. 8 కోట్ల మందికి సేవలు అందిస్తున్న 26 లక్షల మంది అంగన్‌వాడీలను ఇంటికి పంపించే పనిని వేగవంతం చేస్తున్నారు. అందుకే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ కార్మిక ప్రజా వ్యతిరేక విధానాలు ఆపాలని కేంద్ర కార్మిక సంఘాలు, అంగన్‌వాడీ ఫెడరేషన్‌తో పాటు మరో 40 స్వతంత్ర ఫెడరేషన్లు జనవరి 8, 9 తేదీల్లో 'మోడీ హఠావ్–దేశ్ బచావ్' అన్న నినాదంతో సమ్మె చేస్తున్నారు.

సమ్మె ఎందుకు?

మోడీ అధికారంలోకి వచ్చిన తరువాత ఐసిడిఎస్‌కు బడ్జెట్ కేటాయింపులు క్రమేణా తగ్గించారు. 2013–14లో రూ.18,240 కోట్ల నుండి 2014–15కు రూ.8,870 కోట్లకు తగ్గించారు. అంగన్‌వాడీలు దశల వారీ జరిపిన పోరాటాల ఫలితంగా ప్రస్తుతం రూ.16,334.88 కోట్లు కేటాయించారు. అయినా ఇది ఏమాత్రం సరిపోదు. ప్రణాళికా సంఘాన్ని రద్దు చేశారు. నీతి ఆయోగ్ ఏర్పడిన తరువాత రాష్ట్రాల వాటాను 90 : 10 నుండి 60 : 40కు తగ్గించారు. ప్రస్తుతం నీతి ఆయోగ్ 75 శాతం వాటాను రాష్ట్రం భరించాలని ప్రతిపాదన పంపింది. అయితే ఈ పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం మాత్రమే కొనసాగించడం అసాధ్యమని అనేక మంది ఆర్థికవేత్తలు తెలియజేశారు. వేదాంతకు 4 వేల సెంటర్లను అప్పగించారు. ఐసిడిఎస్ లక్ష్యానికి విరుద్ధంగా 0–6 నెలల నుండి 3 సంవత్సరాల్లోపు పిల్లలకు నగదు బదిలీని, 3–6 ఏళ్ల పిల్లలకు మిక్స్‌డ్‌ఫుడ్ ప్యాకెట్లను అమలు చేయాలని నిర్ణయించారు. ఈ విధానాన్ని బీహార్ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయడానికి తీర్మానం చేస్తే దానికి వ్యతిరేకంగా అంగన్ వాడీలు దీర్ఘకాలిక సమ్మెలో కొనసాగుతూ ఉన్నారు. 45వ భారత కార్మిక మహాసభ 2013లోనే స్కీం వర్కర్లను కార్మికులుగా గుర్తించాలని, కనీస వేతనం, పెన్షన్, పీఎఫ్, ఈఎస్ఐ అమలు చేయాలని నిర్ణయించినా ఇంత వరకు దాన్ని అమలు చేసే తీరిక మోడీ ప్రభుత్వానికి లేదు. అంగన్‌వాడీ ఫెడరేషన్ దశల వారీగా చేసిన పోరాటాల ఫలితంగా కేంద్ర ప్రభుత్వం 2018 సెప్టెంబర్ 11వ తేదీన అంగన్‌వాడీ వర్కర్‌కు రూ.1,500, హెల్పర్‌కు రూ.750, మినీలకు రూ.1250 వేతనాలు పెంచింది. దీపావళి కానుకగా ఇస్తామని ప్రకటన చేశారు. కానీ ఇంత వరకు దాని ఊసే లేదు.





కె సుబ్బరావమ్మ

పని భారం పెంచారు

అంగన్‌వాడీలకు తమ జాబ్‌చార్టులో లేని అనేక అదనపు పనులు అప్పగించటం వలన ఏ పని ఎప్పుడు చేయాలో అర్థం కాక ఆందోళన చెందుతున్నారు. పై అధికారుల వేధింపుల కారణంగా మానసిక ఒత్తిడితో ఇటీవల కాలంలో 10 మంది చనిపోయారు. ప్రతి నెలా వేతనాలు, బిల్లులు ఇవ్వకపోయినా వేల రూపాయలు పెట్టుబడి పెట్టి సెంటర్లను నడుపుతున్నారు. అయినా వారిని అవమానించేలా పర్యవేక్షణ కమిటీలు వేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. లబ్ధిదారులకు అనుబంధ పౌష్టికాహారం కోసం ప్రవేశపెట్టిన అమృత హస్తం, బాల సంజీవిని పథకం కాంట్రాక్టర్లకు అమృత హస్తంగా మారింది. వారు నాసిరకం ఆహారం సరఫరా చేస్తున్నారు. అంగన్‌వాడీ సెంటర్ల విలీనాన్ని వేగవంతం చేశారు. రోస్టర్ పేరుతో ఖాళీ పోస్టులను సంవత్సరాల తరబడి భర్తీ చేయటం లేదు. దీనివలన వర్కర్లు, హెల్పర్లకు అదనపు పని భారం పడుతోంది. ఏనాడూ నెల నెలా వేతనాలు, సెంటర్ అద్దెలు, టిఎ బిల్లు, గ్యాస్ బిల్లులు, అమృత హస్తం బిల్లులు ఇవ్వరు. వర్కర్లు వేల రూపాయలు పెట్టుబడి పెట్టి సెంటర్లు నడుపుతున్నారు. వాటికి తోడు జాతీయ పండుగల సందర్భంగా జన్మభూమి సభలో పిండి వంటల స్టాల్స్ పెట్టాలి. అన్న ప్రాసనలు, వారోత్సవాల్లో అదనంగా పెట్టుబడి పెట్టి అంగన్‌వాడీలు జరుపుతున్నారు. ప్రభుత్వం ఒక్క పైసా ఇవ్వటం లేదు. అలాగే వీటికి తోడు ఎన్నికల డ్యూటీ తప్పనిసరి చేయాలని జిల్లా కలెక్టర్, ఎమ్మార్వోల ఆర్డర్ అని అధికారులు వేధిస్తున్నారు. ఇన్ని ఇబ్బందులు పడి పెట్టుబడులు పెట్టి సెంటర్లను నడుపుతున్న అంగన్‌వాడీలను దొంగలుగా చూపిస్తూ విజిలెన్స్ దాడులు చేస్తున్నారు. ఈ పరిస్థితుల్లో లబ్ధిదారుల సహకారంతో ఐసిడిఎస్ పరిరక్షణకు ఉద్యోగ భద్రత కోసం అంగన్‌వాడీలు ఐక్యంగా ఉద్యమించాలి.

డిమాండ్లు

అంగన్‌వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి. కనీస వేతనం రూ.18 వేలు అమలు చేయాలి. పెన్షన్‌తో కూడిన రిటైర్మెంట్ బెనిఫిట్, పిఎఫ్, ఇఎస్ఐ, సదుపాయం కల్పించాలి. ఐసిడిఎస్‌కు నిధులు పెంచాలి. నగదు బదిలీ, ఫుడ్ ప్యాకెట్ల సరఫరా ఆపాలి. ప్రైవేటు స్వచ్ఛంద సంస్థలకు అప్పగించరాదు. మినీ వర్కర్లకు మెయిన్ వర్కర్లతో పాటు వేతనాలు ఇవ్వాలి. 400 జనాభా దాటిన మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్చాలి. జివో నెంబర్ 7 ప్రకారం అంగన్‌వాడీలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి. మహిళలపై దాడులను అరికట్టాలి. లైంగిక వేధింపులపై ఫిర్యాదు కమిటీలను ఏర్పాటు చేయాలి. కేంద్ర ప్రభుత్వం ఇటీవల అంగన్‌వాడీలకు పెంచిన గౌరవ వేతనాలను అమలు చేయాలి.

(రచయిత అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి)

జనవాక్యం

స.హ చట్టం పరిధిలో ఆలయాలు?

ప్రభుత్వం నుండి ఆర్థిక సహాయం పొందని దేవాలయాలు, చర్చిలు, మసీదుల్లాంటి మతపరమైన సంస్థలు స.హ చట్టం పరిధిలోకి రావని హైదరాబాదులోని హైకోర్టు తీర్పు ఇచ్చింది. అయితే ఆ సంస్థలు ప్రభుత్వేతర మార్గాల ద్వారా భారీ ఎత్తున విరాళాలు పొందుతున్నందున, చట్టంలో మార్పులు తీసుకురావాలని కోర్టు అభిప్రాయపడింది. కానీ తిరుపతి ఆలయం ఇందుకు భిన్నంగా వుంది. ప్రతి ఏటా ఇన్‌కంటాక్స్, మునిసిపల్ టాక్స్ మినహాయింపులతో పరోక్షంగా భారీ ఎత్తున ప్రభుత్వ సహాయం పొందుతోంది. ఈ ఆలయానికి ఏటా అందుతున్న ఆదాయం రూ.2,678 కోట్లని అంచనా. విరాళాలన్నీ అసంఖ్యాక యాత్రికులు సమర్పించే కానుకలే. అయితే టిటిడిలో పలుమార్లు వెలువడుతున్న అవినీతి, అక్రమాల దృష్ట్యా స.హ చట్టం సెక్షన్ 8 ప్రకారం ప్రజల విశాల ప్రయోజనాల కోసం టిటిడి యాజమాన్యం తన సమాచారాన్ని బహిర్గతం చేయాలి. భక్తులు కానుకల రూపంలో అతి విలువైన ఆభరణాలను సమర్పిస్తున్నందు వల్ల వాటి భద్రత గురించి వారికి ప్రశ్నించే హక్కు ఉండాలి.

జి రామకృష్ణయ్య, చిత్తూరు.



విభిన్న గీతాల గళ మాంత్రికుడు

గాయకులెవరైనా.. పాటలు పాడేటప్పుడు.. 'ఆ పాటలో లీనమవ్వాలి' అనే మాట తరచూ వింటుంటాం. అసలు లీనమవ్వడం అంటే ఏమిటి? అనే మాటకు చాలా అర్థాలే ఉంటాయి. చక్కగా నవ్వుతూ, పాటలోగల సాహిత్యాన్ని అర్థం చేసుకుంటూ, అనుభవిస్తూ పాడితే ఆ పాట రక్తికడుతుందనేది ఎస్పీ బాలు లాంటి పెద్దల మాట. అక్షరాలా నిజం. శ్రీకాంత్ పాట కూడా అలాంటిదే.

ఒకే గొంతులో.. అనేక గళాలు

పాటలో లీనమవ్వడంతోపాటు.. పరకాయ ప్రవేశం కూడా చేయడం శ్రీకాంత్‌కి బాగా తెలుసు. కళ్ళు మూసుకుని వింటే.. బాలు, జేసుదాసు, ఘంటసాల, శంకర మహదేవన్, హరిహరణ్, కుమార్‌సానూ, ఉదిత్ నారాయణ... ఇంకా అనేక గాయకుల్ని ఉన్నదున్నట్టుగా పాడేస్తాడు. అలాగని తనకు సొంత గొంతులేదా? అని అంటే మన మాటల్లో 'అపశృతి' దొర్లినట్టే. ఇదీ శ్రీకాంత్ పాట అని చెప్పుకునేలా బోల్డన్ని సినిమా పాటలు పాడాడు. అలా ప్లేబ్యాక్ సింగర్‌గా మూడొందలకుపైగా సినిమాలు, వేలాది పాటలు పాడిన అనుభవం ఇతడిది. ఇక ఇప్పటిదాకా పాడిన ప్రయివేటు ఆల్బమ్‌లకైతే లెక్కేలేదు.. అవి వేలల్లోనే. జానపదం, సందేశం, భక్తి, ప్రబోధం ఏ జానర్ అయినా.. శ్రీకాంత్‌కి కొట్టిన పిండే. ఇలా నిత్యం ఏదో ఒక కొత్త ఆల్బమ్‌కోసం పాడుతూనే ఉంటాడు శ్రీకాంత్. అంతేకాదు, నాటక ప్రదర్శనల్లో సన్నివేశపరంగా వచ్చే బ్యాక్‌గ్రౌండ్ పాటలు చాలానే పాడాడు. ఇలా పాదరసంలా ఇమిడిపోయే శ్రీకాంత్ గానం, అతడి సంగీత ప్రయాణం అంత నల్లేరుపై బండినడకలా సాగిపోలేదు. గాయకుడిగా నిలదొక్కుకోవడానికి ఏళ్ళతరబడి ఆర్కెస్ట్రా గాయకుడిగానూ పాటలు పాడాడు. సినిమాల్లో సరాసరి పాటలు పాడే అవకాశాలు రావట్లేదు అని కూర్చోకుండా.. అనుభవం కోసం ట్రాకులు, కోరస్‌లూ పాడాడు. అలా ఏడెనిమిదేళ్ళు కష్టపడితేగానీ వెండితెరపై గాయకుడిగా తన పేరు చూసుకునే ఛాన్స్ రాలేదు. కానీ, ఆర్కెస్ట్రాల్లో, రికార్డింగ్స్‌లో పాడటం కూడా ప్లేబ్యాక్ సింగింగ్ కెరీర్‌కి ఎంతో సహాయపడిందంటూ..ఇప్పటికీ తొలినాటి రోజుల్ని గుర్తు చేసుకుంటాడు శ్రీకాంత్. దశాబ్దంన్నర కాలానికిపైగా ప్లేబ్యాక్ సింగర్‌గా వందలాది సినిమాల్లో అనేక పాటలు పాడిన శ్రీకాంత్ కొన్ని సినిమాలకు సంగీత దర్శకుడిగానూ వ్యవహరించాడు.

సీమలో పుట్టి ...

చాలామంది గాయనీ గాయకుల్లాగానే.. శ్రీకాంత్‌కీ చిన్నప్పటి నుంచి పాటలంటే ఇష్టం. అందుకు కారణమూ ఉంది. ఇంట్లో అమ్మ విజయభారతి మంచి గాయని. శాస్త్రీయ, లలిత గీతాలు బాగా పాడతారు. ఆమాటకొస్తే.. పత్రికారంగంలో జర్నలిస్ట్‌గా పనిచేసిన నాన్న విఆర్ ద్వారకానాథ్ కూడా మంచి గాయకులే. అలా ఇంటి నుంచి అలవడ్డ సంగీతాభిరుచి, స్ఫూర్తి శ్రీకాంత్‌నీ సంగీతరంగంలోకి అడుగుపెట్టేలా ప్రేరేపించాయి. స్కూల్‌స్థాయికొచ్చేసరికి.. ఎక్కడ ఏ సంగీత పోటీలు జరిగినా.. అక్కడ శ్రీకాంత్ పాట మారుమోగేది. బహుమతులూ వచ్చేవి. అలా స్కూల్, ఇంటర్మీడియట్, డిగ్రీ చదవంతా పుట్టిపెరిగిన కడప పట్టణంలోనే కొనసాగింది. అయితే, కుటుంబంలో అందరూ ఇతర రంగాల్లో స్థిరపడ్డవారే. దీంతో పాట తన గుండెల్లో ఉన్నాగానీ.. డిగ్రీ అవ్వగానే ఉద్యోగ వేటలో పడ్డాడు. 'జీవితంలో స్థిరపడాలంటే మరి.. ఏదో ఒక చిన్న ఉద్యోగం చేసుకోవాలిగా' అని సగటు యువకుడు అనుకున్నట్టుగానే మధ్య తరగతి కుటుంబానికి చెందిన శ్రీకాంత్ కూడా బెంగళూర్లో ఓ ప్రయివేటు కంపెనీలో చేరాడు. కానీ.. గాయకుడిగా ఎక్కడో రాసిపెట్టుందేమో.. ఉద్యోగం చేస్తుండగానే శ్రీకాంత్ 'పాట' కోసం అనుకోకుండా హైదరాబాద్ రావడం జరిగింది. ఇదే.. శ్రీకాంత్ జీవితంలో ఓ సంగీత మలుపుకు కారణం అయ్యింది.

నాపాట.. అంత్యాక్షరీ

బెంగళూర్లో ఉద్యోగం చేస్తున్న సమయంలోనూ చిన్నప్పటి నుంచీ తన వెంట వచ్చిన పాటను ఏమాత్రం అశ్రద్ధ చేయలేదు శ్రీకాంత్. తనలోని సంగీతాభిరుచి మరింత సానబెట్టే క్రమంలో.. అక్కడే రెండుమూడేళ్ళపాటు గురుముఖతా శాస్త్రీయ సంగీతాన్ని అభ్యసించాడు. అ క్రమంలోనే ఈటీవిలో నిర్వహిస్తున్న 'అంత్యాక్షరి' సంగీత కార్యక్రమంలో పాల్గొనే అవకాశం వచ్చింది. అలా వచ్చిన తర్వాత అప్పటికే బెంగళూరులో చేస్తున్న ఉద్యోగం మానుకుని హైదరాబాద్‌లోనే ఉండేందుకు అనుకూలమైన సంగీతదారులు కనిపించాయి. అలా కొన్ని టీవీల్లో 'మ్యూజికల్ షో'లు చేస్తుండగా.. స్థానికంగా సంగీతరంగానికి చెందినవారు కొందరు పరిచయం కావడం, వారి ద్వారా పాటలు పాడే అవకాశాలు రావడంతో శ్రీకాంత్ గాయక ప్రస్థానం మెల్లగా మొదలైంది. అనక నిత్య సవ్వడుల ప్రయాణంగా మారింది.

స్టూడియోలో.. కర్త, క్రియ

ఒకపక్క గాయకుడిగా, స్వరకర్తగా కొనసాగుతూనే 'డాల్ఫీడ్రమ్స్' పేరుతో హైదరాబాద్ మధురానగర్‌లో సొంతంగా రికార్డింగ్ స్టూడియో నిర్వహిస్తున్నాడు శ్రీకాంత్. విశేషమేమంటే.. రికార్డింగ్ స్టూడియోకి కీలకమయ్యే 'ఆడియో ఎడిటింగ్' పనులూ తానే ఎంతో చాకచక్యంగా చేస్తుంటాడు శ్రీకాంత్. 'చెప్తే.. విడ్డూరంగా అనిపించినా.. నాకు సంగీతమే ఇల్లు, వాకిలి. అందులోనే ఆనందం పొందుతుంటాను. నేను పాటలు పాడేటప్పుడే కాదు, మిగితా సమయమూ సంగీతంతోనే గడపాలనే స్వార్థంతో సొంతంగా స్టూడియో ఏర్పాటు చేసుకున్నా. దీనివల్ల నాచుట్టూ ఉన్న సంగీత ప్రపంచం మరింత పెద్దదవుతుంది. చాలాసార్లు నాపాటకు నేనే బాణీలు కట్టుకుంటా. నేనే ఆర్కెస్ట్రా కంపోజ్ చేసుకుంటా. ఫైనల్‌గా నేనే ఆడియో ఎడిటింగ్ చేసుకుంటా..' అని ఎంతో సంబరపడుతూ చెప్పే శ్రీకాంత్ ఔత్సాహికుల కోసం 'టాలీవుడ్ స్కూల్ ఆఫ్ ప్లేబ్యాక్ సింగింగ్' అనే శిక్షణా సంస్థనూ నిర్వహిస్తున్నాడు. గాయకుడిగా నచ్చినదారిని ఎంచుకోవడానికి కుటుంబంలోని తల్లితండ్రులు, అత్తమామలు, తోబుట్టువుల సహకారంతోపాటు భార్య, పిల్లల ప్రోత్సాహమూ వెలకట్టలేదంటారు శ్రీకాంత్. సహచరి అనురాధ, పిల్లలు అమిత్, అక్షజ్‌కీ సంగీతమంటే ఇష్టమే!

సంగీతాన్ని ప్రేమించగలిగితే.. కెరీర్లో ఇంకా ఎంతో పెద్ద బ్రేక్‌రావాలి.. అని ఎదురుచూడక్కరలేదు. ఉన్నచోటనో సంగీతంలో లీనమవ్వొచ్చు. అందులోనే మలయసమీరంలాంటి సంగీత ప్రపంచాన్ని చూడొచ్చు, అనే సాయిశ్రీకాంత్.. సంగీతరంగాన మరిన్ని విజయాలు అందుకోవాలని కోరుకుందాం!!

-గంగాధర్ వీర్ల


సాయిశ్రీకాంత్.. అలియాస్ సింగర్ శ్రీకాంత్ అని చెప్తే.. పరిచయం అతిసామాన్యంగానే ఉండొచ్చేమో? కానీ, 'మాయదారి మైసమ్మ' శ్రీకాంత్ అంటే మాత్రం టక్కున గుర్తుపట్టేస్తారంతా. ప్లేబ్యాక్ సింగర్‌గా.. అంతకుముందు చాలా పాటలే పాడినా.. మైసమ్మ పాటతో.. తనకంటూ ఓ బ్రాండ్ ఇమేజ్ ఏర్పడింది. తెలంగాణా ప్రాంతంలో 'మాయదారి మైసమ్మ' అనే పాట అప్పటికే జనాల్లో ఉన్నా.. సినిమా పాటగా శ్రీకాంత్ కొత్తగా, అంతే ఉత్సాహంగా పాడటంతో.. తెలుగునాట మరింత పాపులర్ అయ్యింది. ఇప్పటికీ ఎక్కడ ఏ సంతోషకరమైన సందర్భం వచ్చినా.. కుర్రకారు ఆపాటతో కదం తొక్కాల్సిందే. ఎక్కడో సీమవాకిట పుట్టిపెరిగిన కుర్రాడు.. తెలంగాణా యాసగల పాటతో దద్దరిల్లడమంటే.. తనలో ఏదో ప్రత్యేకత ఉండనే ఉండాలి. అతడి గొంతు అలాంటిది. ఎలాంటి పాటైనా అవలీలగా పాడేస్తాడు. అందుకే 'అబ్బ సొత్తు కాదురా.. టాలెంటూ.. ఎవడబ్బా సొత్తు కాదురా టాలెంటూ' అంటూ తనదైన శైలిలో రంజింపచేస్తాడు. నిజజీవితంలో మాత్రం ఎప్పుడూ నవ్వుతూ.. నవ్విస్తూ.. కనిపిస్తాడు. అంతకుతగ్గట్టుగానే 'నేలమ్మా.. నేలమ్మా.. నేలమ్మా.. నీకు వేలవేల వందనాలమ్మా' అంటూ సంగీత సముద్రంలో ఓ నీటిబొట్టులా వొదిగి ఉంటాడు. దటీజ్ శ్రీకాంత్. ఇంకా అతడ్ని పలకరిస్తే.. వినసొంపైన 'జీవన' సవ్వడులు చాలానే వినిపిస్తాయి.







పాటొక పరవశం



సినిమా పాటలు వల్ల కీర్తిప్రతిష్టలు రావొచ్చు. ఆర్థికంగానూ ఉన్నతి స్థితికి చేరుకోవచ్చు. అయితే అంతకుమించి.. సంగీతంలో ఏదో ఉంది. అది అనుభవిస్తూనే తెలుస్తుంది. అది మాటల్లో చెప్పలేని హృదయపరవశమది. గాయకుడిగా, స్వరకర్తగా, స్టూడియో అధిపతిగా.. ఏ పనిచేసినా.. ఆ సమయం సంగీతభరితంగా ఉల్లాసంగా ఉండాలనే కోరుకుంటా. ఇప్పుడు సంగీతరంగంలో చాలా మార్పులు వస్తున్నాయి. ఎవరిదగ్గర ఏ చిన్నపాటి ప్రతిభ ఉన్నా.. ప్రదర్శించుకోగల మాధ్యమాలూ వచ్చాయి. సంగీతంపట్ల అనురక్తి ప్యాసన్‌తోపాటు శాస్త్రీయ, సాంకేతిక అధ్యయనం, సాధనా అవసరం.

- సాయిశ్రీకాంత్, ప్లేబ్యాక్ సింగర్, సంగీత దర్శకుడు
ఫోన్ : 9391008818

జీవన చిత్రం

ఫొటో : టి.వి. రమణ





ఎన్.మంజు, చీమకుర్తి, ప్రకాశం జిల్లా.

పండిన టొమాటో గుజ్జుని ముఖానికీ, మెడకీ పట్టించి పావుగంట తర్వాత కడిగేస్తే ముఖం కాంతివంతంగా తయారవుతుంది.



జీవన సౌరభం

ఎంత చదివాం అన్నది ముఖ్యం కాదు. చదువు వల్ల మన సంస్కారం ఏ స్థాయికి చేరిందన్నదే ముఖ్యం.



ఆర్.పూజ, సి.జి పల్లి, చిత్తూరు.

బహుమతి పొందిన ముగ్గు



13 చుక్కలు
7 వచ్చేవరకు
మధ్యచుక్క



20 చుక్కలు
2 వరుసలు
2 వచ్చేవరకు (నేరుచుక్క)

లక్ష్యాన్ని చేరని జిఎస్‌టి వసూళ్లు..

న్యూఢిల్లీ : కేంద్ర ప్రభుత్వం నిర్దేశించుకున్న జిఎస్‌టి వసూళ్ల లక్ష్యాన్ని చేరుకోలేకపోయింది. 2018-19లో రూ.13,48,000 కోట్లు వసూళ్లు చేయాలని బడ్జెట్‌లో నిర్దేశించుకుంది. దీంతో నెలకు సగటున రూ.1.12 లక్షల కోట్లు వసూళ్లు కావాల్సి ఉంది. అయితే ఇప్పటి వరకు ఏ ఒక్క నెలలో కూడా ఈ లక్ష్యాన్ని చేరలేదు. కేవలం రెండు నెలల్లో మాత్రం రూ.1లక్ష కోట్ల మార్క్‌ను నమోదు చేసింది. తమ లక్ష్యానికి, వాస్తవ రాబడికి ఎందుకు ఇంత వ్యత్యాసం వచ్చిందో కేంద్ర ప్రభుత్వానికి ఇప్పటికీ అర్థం కావడం లేదు. దీంతో కేంద్ర ప్రభుత్వ పన్ను అధికారుల సామర్థ్యాన్ని ఓ సారి సమీక్షించాల్సి ఉందని కేంద్ర ఆర్థిక కార్యదర్శి హష్ముక్ అధియా పేర్కొన్నారు.

ఫోర్బ్స్ డిజైన్ అవార్డులు

ఫోర్బ్స్ ఇండియా, స్టోనెక్స్ ఇండియాలు సంయుక్తంగా 2019 ఫోర్బ్స్ ఇండియా డిజైన్ అవార్డుల కోసం జనవరి 30వ తేదీ వరకు నామినేషన్లు స్వీకరిస్తున్నట్లు ఫోర్బ్స్ ఇండియా ఎడిటర్ బ్రియాన్ కార్వాల్హో తెలిపారు. ఉత్తమ డిజైనర్లు, ఆర్కిటెక్ నిపుణులకు ఈ అవార్డులు అందించనున్నామని నెట్వర్క్ 18 రియల్ ఎస్టేట్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ గ్రూప్ ఎడిటర్ మనీశా నటరాజన్ పేర్కొన్నారు.



మాంద్యంలో మ్యానుఫాక్చరింగ్

వాషింగ్టన్ : అమెరికాలో తయారీ రంగం కార్యకలాపాలు రెండేళ్ళ కాలంలో ఎన్నడూ లేనంత దిగువ స్థాయికి పడిపోయాయి. కొత్త ఆర్డర్లు పడిపోవడం, ఫ్యాక్టరీల్లో ఉపాధి తగ్గడంతో ఈ పరిస్థితి నెలకొంది. చైనా, యూరప్‌ల్లో మందగిస్తున్న వృద్ధిరేటుకు అమెరికా ఆర్థిక వ్యవస్థ ఏమీ మినహాయింపు కాదని ఇది రుజువు చేసింది. తయారీరంగం అంచనాలు అంత ఆశాజనకంగా లేవని ఇనిస్టిట్యూట్ ఫర్ సప్లై మేనేజ్‌మెంట్ (ఐఎస్‌ఎం) సర్వే వెల్లడించింది. దాదాపు అన్ని విభాగాలు డిసెంబరులో క్షీణించడం ఆరంభించాయి. కార్మిక మార్కెట్ పటిష్టంగానే కొనసాగుతున్నప్పటికీ ఆర్థిక వ్యవస్థకు సంబంధించిన ఆందోళనలు మాత్రం పెరుగుతూనే వస్తున్నాయి. కొనుగోలు శక్తుల నివేదికను విశ్వసించినట్లైతే 2019లో సగటు స్థాయికన్నా దిగువకే వృద్ధి రేటు వుంటుందని భావించాల్సి వస్తోందని న్యూయార్క్‌కు చెందిన ప్రముఖ ఆర్థికవేత్త చిరిస్ రూప్కే వ్యాఖ్యానించారు. కొత్తగావచ్చే ఆర్డర్లు ఏమీ లేవు, దీని ప్రభావం కొత్త ఏడాదిలో వ్యాపార పెట్టుబడులపై, వృద్ధిరేటుపై పడుతుందని అన్నారు. 2008 అక్టోబరులో తలెత్తిన ఆర్థిక మాంద్యం తర్వాత ఇంత తీవ్ర స్థాయిలో తయారీ రంగం క్షీణించడం ఇదే మొదలు. ఒక పక్క ఉత్పత్తి, ఉపాధి అవకాశాలు పెరుగుతుండటంతో వినిమయం కూడా పెరుగుతోందని, అయినప్పటికీ గతంతో పోలిస్తే ప్రస్తుత వృద్ధి రేటు తక్కువగానే వుందని ఐఎస్‌ఎం పేర్కొంది.

కొలంబియాలో చమురు కనుగొన్న ఒవిఎల్

న్యూఢిల్లీ : దక్షిణ అమెరికా సమీపంలోని కొలంబియా దేశంలో భారత్‌కు చెందిన ఒఎన్‌జిసి విదేశ్ లిమిటెడ్ (ఒవిఎల్) చమురు నిల్వలను కనుకున్నట్లు ఆ సంస్థ ఒక ప్రకటనలో వెల్లడించింది. ఒఎన్‌జిసికి చెందిన ఈ విదేశీ వ్యాపారాల సంస్థ కొలంబియాలోని సిపిఒ-5లో 284 అడుగుల లోతులో చమురు నిల్వలను కనుగొంది. గతేడాది మారిపోస-1లోనూ వాణిజ్య చమురును గుర్తించింది. ఇది ఇండికో-1కు 6.5 కిలోమీటర్ల దూరంలో ఉంది. మరిన్ని చమురు బ్లాక్‌లపై దృష్టి పెట్టనున్నట్లు ఒవిఎల్ తెలిపింది. కొలంబియాలోని ఆరు బ్లాక్‌ల్లో చమురు వెలికి తీయడానికి ఆసక్తితో ఉంది. ఇందుకోసం అక్కడి సంస్థలతో కలిసి పని చేస్తుంది.

హెచ్‌పిసిఎల్‌తో ఐషర్ భాగస్వామ్యం

హైదరాబాద్ : ఇంధన పొదుపును ప్రోత్సాహించేందుకుగాను ఐషర్ ట్రక్స్ అండ్ బసెస్ తన వినియోగదారులకు ఐషర్ మైల్ ఎడ్జ్ ఫ్యూయల్ కార్డ్‌ను బహుమతిగా అందిస్తున్నట్లు ఒక ప్రకటనలో తెలిపింది. ఈ కార్డును హిందుస్తాన్ పెట్రోలియం కార్పోరేషన్ లిమిటెడ్ (హెచ్‌పిసిఎల్) భాగస్వామ్యంతో అందిస్తున్నామని విఇ కమర్షియల్ వెహికల్స్ సిఇఒ, ఎండి వినోద్ అగర్వాల్ పేర్కొన్నారు. ఐషర్ బస్సులు మరియు ట్రక్కులకు చెందిన అన్ని శ్రేణులకు చెందిన వాహనాలపై కంపెనీ ఈ ఆఫర్‌ను అందిస్తుందన్నారు. ఈ ఫ్యూయల్ కార్డ్‌తో ఐషర్ వాహన యజమానులు తమ యొక్క వాహన డ్రైవర్ మరియు హెల్పర్‌లు ఆసుపత్రి పాలైనప్పుడు వారికి నగదు రహిత లావాదేవీతో కూడుకున్న ఇన్సూరెన్స్‌ను అందించడం వంటి పలు ప్రయోజనాలను అందిస్తుందన్నారు.

30 కోట్లకు మొబైల్ హ్యాండ్‌సెట్ పరిశ్రమ

న్యూఢిల్లీ : ప్రస్తుత ఏడాదిలో భారత్‌లో భారత మొబైల్ హ్యాండ్‌సెట్ పరిశ్రమ 30 కోట్లకు చేరనుందని అంచనా. తొలిసారి 2019లో 30 మిలియన్ల మార్క్‌కు చేరనుందని టెక్‌ఆర్‌సి ఒక రిపోర్టులో వెల్లడించింది. ప్రపంచంలోనే చైనా 40 కోట్ల హ్యాండ్‌సెట్ల తయారీతో అగ్రస్థానంలో ఉంటుందని తెలిపింది. గ్లోబల్ మొబైల్ హ్యాండ్‌సెట్ల పెరుగుదలలో భారత్ తర్వాత స్థానంలో నిలుస్తుందని పేర్కొంది. 2012 నుంచి 2018 కాలంలోని ఏడేళ్లలో భారత్‌లో ఈ పరిశ్రమ రెండంకెల వృద్ధిని నమోదు చేసిందని వెల్లడించింది. కాగా 2019లో ఈ వృద్ధి 3.4 శాతం వృద్ధికే పరిమితం కావచ్చని విశ్లేషించింది.

కునారిల్లిన కొత్త పెట్టుబడులు

- 14 ఏళ్ల కనిష్టానికి పతనం
- డిసెంబర్ త్రైమాసికంలో 53% క్షీణత
- రుణ భారం, విధాన లోపాల ప్రభావం
- ఆయోమయంలో కార్పొరేట్లు




న్యూఢిల్లీ : దేశం వృద్ధి పథంలో దూసుకు పోతోందని, పెట్టుబడులు భారీగా వస్తున్నాయని మోడీ సర్కారు పదేపదే ప్రకటనలు చేస్తున్నప్పటికీ.. క్షేత్ర స్థాయిలో వాస్తవ పరిస్థితులు మాత్రం ఇందుకు భిన్నంగా కనిపిస్తున్నాయి. మరోవైపు సులభ వ్యాపారంలో భారత ర్యాంకింగ్ చాలా మెరుగు పడిందని ఆర్థిక మంత్రిత్వ శాఖ నివేదికలకు భిన్నంగా దేశంలో పెట్టుబడులు చోటు చేసుకుంటున్నాయి. తాజాగా డిసెంబరుతో ముగిసిన త్రైమాసికంలో దేశంలో పెట్టుబడులు 14 ఏళ్ల కనిష్టానికి పడిపోయాయని 'సెంటర్ ఫర్ మోనిటరింగ్ ఇండియన్ ఎకానమి' (సిఎంఐఇ) ఒక రిపోర్టులో వెల్లడించింది. దేశంలో కొత్త ప్రాజెక్టులు అందుబాటులోకి రావడం వాటి పనితీరును సిఎంఐఇ అధ్యయనం చేసి విశ్లేషిస్తుంది. ఈ సంస్థ తాజా సమాచారం మేరకు క్రితం అక్టోబరు-డిసెంబరు మధ్య కాలంలో భారత కంపెనీలు కేవలం రూ.లక్ష కోట్ల విలువైన పెట్టుబడులు మాత్రమే ప్రకటించాయి. ఇది అంతకు ముందు సెప్టెంబరు త్రైమాసికంలో అందుబాటులోకి వచ్చిన పెట్టుబడుల కన్నా కూడా 53 శాతం తక్కువని సిఎంఐఇ విశ్లేషించింది. అంతకు ముందు ఏడాది డిసెంబరు త్రైమాసికంతో పోలిస్తే ఇది దాదాపు 55 శాతం తక్కువని ఈ సంస్థ అధ్యయనంలో తేలింది. రుణ భారం, ఎన్నికల ముందు విధానపరమైన నిర్ణయాలలో అనిశ్చితి, వివిధ ఇతర కారణల వల్ల నిలిచిపోయిన ప్రాజెక్టులను తిరిగి పట్టాలెక్కించేలా తగిన చర్యలు లేకపోవడంతో కొత్త పెట్టుబడులలో మందగమన పరిస్థితులు కనిపిస్తున్నాయని సిఎంఐఇ విశ్లేషించింది.

ప్రయివేటు పెట్టుబడుల్లో 62శాతం క్షీణత..

కొత్త పెట్టుబడుల ప్రకటనలో జాప్యం కారణంగా నూతన ప్రాజెక్టులు కూడా అమలు పరిచేందుకు పెట్టుబడిదారులు ముందుకు రావడం లేదు. ప్రయివేటు రంగంలో కొత్త ప్రాజెక్టుల ప్రకటన డిసెంబరు త్రైమాసికంలో 62 శాతం మేర కుంగింది. అంతకు ముందు సెప్టెంబరు మాసంలో కూడా ఈ విభాగంలో 64 శాతం క్షీణత కనిపించింది. మరోవైపు ప్రభుత్వ రంగ పెట్టుబడులు కూడా సెప్టెంబరు త్రైమాసికంతో (41%) పోలిస్తే డిసెంబరు త్రైమాసకంలో మరింతగా క్షీణించి 37శాతంగా నమోదయ్యింది. ఈ విభాగంలో పెట్టుబడులు కనిష్టంగా నమోదు కావడం డిసెంబరు 2004 తర్వాత ఇదే తొలిసారి. నిర్మాణ రంగం తప్పించి దాదాపు అన్ని ప్రధాన రంగాల్లో పెట్టుబడుల క్షీణత కనిపించింది. మరోవైపు వివిధ కారణాల వల్ల నిలిచిపోయిన ప్రాజెక్టుల విలువ కూడా గత డిసెంబరు మాసంలో మరింతగా పెరిగింది. ఇదే సమయంలో ప్రయివేటు రంగంలో నిలిచిన ప్రాజెక్టుల రేటు 24శాతంగా నమోదయ్యింది. ఎక్కువగా విద్యుత్తు, తయారీ పరిశ్రమలు నిలిచిన ప్రాజెక్టుల మూలంగా బలంగా దెబ్బతిన్నాయి. నిధుల లేమి, చమురు ధరలు, ముడి సరుకులు భారంగా మారడం, ప్రతికూల మార్కెట్ పరిస్థితులు తదితరాల మూలంగా ఎక్కువ ప్రాజెక్టులు నిలిచిపోయినట్టుగా అధ్యయనంలో తేలింది.

ఆ ప్రాజెక్టులతో ఇబ్బందులు..

మరోవైపు వివిధ కారణాల వల్ల నిలిచిపోయిన ప్రాజెక్టుల వ్యయ విలువ కూడా గత డిసెంబరు మాసంలో మరింతగా పెరిగింది. ఇదే సమయంలో ప్రయివేటు రంగంలో నిలిచిన ప్రాజెక్టుల రేటు 24 శాతంగా నమోదయ్యింది. ఎక్కువగా విద్యుత్తు, తయారీ పరిశ్రమలు నిలిచిన ప్రాజెక్టుల మూలంగా బలంగా దెబ్బతిన్నాయి. నిధుల లేమి, చమురు ధరలు, ముడి సరుకులు భారంగా మారడం, ప్రతికూల మార్కెట్ పరిస్థితులు తదితరాల మూలంగా ఎక్కువగా ప్రాజెక్టులు నిలిచిపోయినట్టుగా అధ్యయనంలో తేలింది. అధిక మొత్తంలో ప్రాజెక్టులు నిలిచిపోవడం, కొత్త పెట్టుబడుల్లో పెరుగుదల నమోదు కాకపోవడం తదితర పరిస్థితులు ఆర్థిక వ్యవస్థకు మంచి పరిణామం కాదని మార్కెట్ విశ్లేషకులు చెబుతున్నారు. విధానపరమైన లోపం కారణంగా నిలిచిపోయిన పెట్టుబడుల చక్రాన్ని.. కొత్త విధానాలతో మళ్లీ పరుగులు పెట్టించేలా చర్యలు తీసుకుంటామంటూ అధికారంలోకి వచ్చిన మోడీ ప్రభుత్వం.. ఇప్పుడు పెట్టుబడులు తాజాగా 14 సంవత్సరాల కనిష్టానికి పడిపోవడాన్ని గమనించాలని సూచిస్తున్నారు. ఎన్నికల నేపథ్యంలో రానున్న రోజుల్లో వేచిచూసే ధోరణి కారణంగా పెట్టుబడుల రాక మరింతగా క్షీణించే అవకాశం ఉందని హెచ్చరిస్తున్నారు.




ఎల్ఐసికి రూ.26వేల కోట్ల లాభాలు

న్యూఢిల్లీ : దేశంలోనే అతిపెద్ద బీమా కంపెనీ లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ (ఎల్ఐసి) 2017-18 ఆర్థిక సంవత్సరంలో రూ.26,147.52 కోట్ల నికర లాభాలు సాధించింది. ఇంతక్రితం ఏడాది రూ.20,269.47 కోట్ల లాభాలు నమోదు చేసింది. దీంతో పోలిస్తే క్రితం మార్చితో ముగిసిన ఏడాదిలో 29 శాతం వద్ధిని కనబర్చిందని కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి శివ్ ప్రతాప్ శుక్లా లోకసభకు తెలిపారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.48,444 కోట్ల మిగులు నిధులు ఉండటంతో గడిచిన ఆర్థిక సంవత్సరానికి గాను రూ.2,430 కోట్ల డివిడెండ్‌ను కేంద్ర ప్రభుత్వానికి చెల్లించిందన్నారు. అదే విధంగా ఆర్థిక సంక్షోభంలో చిక్కుకున్న ఐడిబిఐ బ్యాంకులో దాదాపుగా రూ.20వేల కోట్ల పెట్టుబడులు పెట్టడానికి ముందుకు వచ్చిందన్నారు.

పెట్టుబడులకు దుబాయ్ అనుకూలం : డాన్యూబ్

హైదరాబాద్ : నిర్మాణ రంగంలో పెట్టుబడులు పెట్టాలని భావించే ప్రపంచ ఇన్వెస్టర్లకు దుబాయ్ అనుకూలమని డాన్యూబ్ ఛైర్మన్ రిజ్వార్ సాజన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇక్కడ ప్రతీ ఏడాది 8 నుంచి 10 శాతం రాబడి నమోదవుతుందన్నారు. అభివృద్ధి చెందుతున్న ప్రాంతాలపై ఇన్వెస్టర్లు దృష్టి సారించాలన్నారు. గత 10 ఏళ్లుగా దుబాయ్ వేగంగా విస్తరిస్తోందన్నారు.

గ్రూప్-3 పంచాయతీ కార్యదర్శుల ప్రత్యేకం





కె.ఎస్ లక్ష్మణరావు,
శాసనమండలి మాజీ సభ్యులు.
సెల్ : 9440262072

ఖాళీలు 1,051

ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ సబార్డినేట్ సర్వీస్‌లో పంచాయతీ కార్యదర్శి గ్రేడ్-4 ఉద్యోగాలను భర్తీ చేయనున్నారు. ఈ పోస్టులన్నీ గ్రూప్-3 కేటగిరీ కిందికి వస్తాయి. ఎంపికయిన వారికి రూ.16,400 -49,870 శ్రేణిలో వేతనం అందుతుంది. ఇందులో 1,051 ఖాళీలు ఉన్నాయి. జిల్లా యూనిట్‌గా భర్తీ చేస్తారు. జిల్లాల వారీగా ఖాళీలు..

శ్రీకాకుళం - 114
విజయనగరం - 120
విశాఖపట్నం - 107
తూర్పు గోదావరి - 104
పశ్చిమగోదావరి - 25
కృష్ణా - 22
ప్రకాశం - 172
చిత్తూరు - 141
కర్నూలు - 90
కడప - 2 (క్యారీ ఫార్వర్డ్)

అర్హత : ఏదైనా డిగ్రీ
వయస్సు : 18 - 42 ఏళ్లు (జులై 1, 2018 నాటికి)
ఎంపిక విధానం : రాత పరీక్ష ఆధారంగా ఎంపిక ఉంటుంది. రెండు దశలుగా రాత పరీక్షను నిర్వహిస్తారు. ఇందులో భాగంగా మొదటి దశలో స్క్రీనింగ్ టెస్ట్ ఉంటుంది. స్క్రీనింగ్ టెస్ట్‌లో నిర్దేశించిన విధంగా అర్హత సాధించిన అభ్యర్థులు మాత్రమే మెయిన్స్ పరీక్షకు హాజరు కావాలి.

రెండు భాగాల స్క్రీనింగ్

స్క్రీనింగ్ పరీక్షను ఆబ్జెక్టివ్ పద్ధతిలో నిర్వహిస్తారు. దరఖాస్తుల సంఖ్య 25 వేల కంటే ఎక్కువగా ఉంటే స్క్రీనింగ్ టెస్ట్ ఆఫ్‌లైన్‌లో నిర్వహిస్తారు. సమాధానాలను గుర్తించడానికి 150 నిమిషాల (రెండున్నర గంటలు) సమయం ఇస్తారు. ఇందులో నెగెటివ్ మార్కులు కూడా ఉన్నాయి. ప్రతి తప్పుకు 1/3 మార్కు కోత విధిస్తారు. స్క్రీనింగ్ టెస్ట్‌లో పార్-ఎ, పార్ట్-బి అనే రెండు భాగాలు ఉన్నాయి. ఈ పరీక్షకు మొత్తంమీద 150 మార్కులకు కేటాయించారు. ఇందులో అడిగే ప్రశ్నలు క్లిష్టత డిగ్రీ స్థాయిలో ఉంటుంది.

ప్రశ్నలు మార్కుల విభజన ఇలా...

విభాగం	ప్రశ్నలు	మార్కులు
పార్ట్-ఎ		
జనరల్ స్టడీస్ అండ్ మెంటల్ ఎబిలిటీ	75	75
పార్ట్ -బి		
గ్రామీణాభివృద్ధి, గ్రామీణ ప్రాంత సమస్యలు (ఏపీ నేపథ్యం)	75	75

ఆన్‌లైన్... మెయిన్స్...

మెయిన్స్ పరీక్షను ఆన్‌లైన్‌లో కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ (సీబీటీ)గా ఆబ్జెక్టివ్ పద్ధతిలో నిర్వహిస్తారు. ఇందులో అడిగే ప్రశ్నలు క్లిష్టత డిగ్రీ స్థాయిలో ఉంటుంది. సీబీటీ పద్ధతిపై అవగాహన కోసం ఏపీపీఎస్సీ వెబ్‌సైట్‌లో మాక్ టెస్ట్‌ను పరిశీలించవచ్చు. స్క్రీనింగ్ టెస్ట్‌లో నిర్దేశించిన విధంగా అర్హత సాధించినవారికి మాత్రమే మెయిన్స్‌కు హాజరయ్యే అవకాశం లభిస్తుంది. ఇందులో రెండు పేపర్లు ఉంటాయి. రెండు పేపర్లకు కలిపి మొత్తం మార్కులు 300. వీటిలో ప్రతి పేపర్ నుంచి 150 ప్రశ్నలు అడుగుతారు. సమాధానాలను గుర్తించడానికి ప్రతి పేపర్‌కు 150 నిమిషాల సమయం కేటాయిస్తారు. ఇందులో నెగెటివ్ మార్కులు కూడా ఉన్నాయి. ప్రతి తప్పుకు 1/3 మార్కు కోత విధిస్తారు.

ప్రశ్నల మార్కుల విభజన ఇలా...


విభాగం	ప్రశ్నలు	మార్కులు
పేపర్-1		
జనరల్ స్టడీస్ మెంటల్ ఎబిలిటీ	150	150
పేపర్ -2		
గ్రామీణ ప్రాంత సమస్యలు ఆంధ్రప్రదేశ్ నేపథ్యంగా	150	150

కనీస అర్హత మార్కులు

రాత పరీక్షల్లో కనీస అర్హత మార్కులను నిర్దేశించారు. ఈ క్రమంలో ఓసీ అభ్యర్థులు 40 శాతం. బీసీ అభ్యర్థులు 35 శాతం, ఎస్సీ/ ఎస్టీ/ వికలాంగుల కేటగిరీ వారు 30 శాతం మార్కులను సాధించాల్సి ఉంటుంది.

ఇలా చదవాలి...

- జనరల్ స్టడీస్ - మెంటల్ ఎబిలిటీ : అత్యంత కీలకమైన విభాగం. ఎక్కువ స్కోర్ చేసేందుకు అవకాశం ఉన్న విభాగం కూడా ఇందులో పట్టు సాధిస్తే స్క్రీనింగ్ తోపాటు మెయిన్స్‌కు కూడా ఉపయోగకరంగా ఉంటుంది. కాబట్టి ఈ అంశాన్ని దృష్టిలో పెట్టుకుని సమగ్రంగా ప్రిపరేషన్ సాగించాలి. స్క్రీనింగ్, మెయిన్స్ సిలబస్ ఒకటే కావడం అభ్యర్థులకు కలిసొచ్చే అంశం. కాకపోతే పరీక్షలను బట్టి ప్రశ్నల క్లిష్టతలో తేడా ఉంటుంది. ఇందులో జనరల్ సైన్స్, ఇండియన్ హిస్టరీ, ఇండియా, వరల్డ్ జాగ్రఫీ, కరెంట్ అఫైర్స్, ఎకానమీ, డిజాస్టర్ మేనేజ్‌మెంట్, ఇండియన్ పాలిటీ, డేటా అనాలసిస్, మెంటల్ ఎబిలిటీ-రీజనింగ్, సస్టయినబులిటీ అండ్ ఎన్విరాన్‌మెంట్ వంటి అంశాల నుంచి ప్రశ్నలు వస్తాయి. ముఖ్యంగా అభ్యర్థులు ఆంధ్రప్రదేశ్ విభజన చట్టం, ప్రత్యేక హోదా, రాష్ట్ర విభజన సందర్భంగా కేంద్రం చేసిన హామీలు, ఇప్పుడు వాటి పరిస్థితి వీటిని సాధించడానికి ఏపీ ప్రభుత్వం సాగిస్తున్న పోరాటం, పోలవరం ప్రాజెక్టు, విభజనతో ముడిపడిన అంశాలపై సమగ్రంగా అవగాహన కలిగి ఉండాలి. అదేవిధంగా సంక్షేమ రంగంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన పథకాలు.. నీటి పారుదల సంబంధించి కొత్తగా ప్రారంభించిన, శంకుస్థాపన చేసిన ప్రాజెక్టులు, కొత్త మొదలుపెట్టిన పరిశ్రమలు, పెట్టుబడుల కోసం ప్రభుత్వం చేస్తున్న కృషి వంటి అన్ని విషయాల గురించి సవివరంగా తెలిసి ఉండాలి. రోజూ దినపత్రికలను చదవడం ద్వారా ఈ విషయాలను తెలుసుకోవచ్చు. ఏపీపీఎస్సీ గత ప్రశ్నాపత్రాలను పరిశీలిస్తే ప్రశ్నల సరళి అవగాహనకు వస్తుంది. డిజాస్టర్ మేనేజ్‌మెంట్ కోసం సీబీఎస్‌ఈ పుస్తకం ఉపయోగకరం. డేటా అనాలసిస్, మెంటల్ ఎబిలిటీ-రీజనింగ్‌కు ఆర్‌ఎస్ అగర్వాల్ పుస్తకాలు ఉపయుక్తం. ★



ముఖ్య సమాచారం
ధరఖాస్తు విధానం : ఆన్‌లైన్..
ఫీజు : అప్లికేషన్ ప్రాసెసింగ్ ఫీజు రూ.250, ఎగ్జామినేషన్ ఫీజు రూ.80
దరఖాస్తుకు చివరి తేదీ : జనవరి 19, 2019
స్క్రీనింగ్ పరీక్ష తేదీ : ఏప్రిల్ 21, 2019
మెయిన్స్ పరీక్ష తేదీ : ఆగస్టు 2, 2019
వెబ్‌సైట్ : http://psc.ap.gov.in./

గ్రామీణాభివృద్ధి, గ్రామీణ ప్రాంత సమస్యలు

ఎంపికైన అభ్యర్థులు పూర్తిగా గ్రామాలు, గ్రామీణ ప్రాంతాల్లో విధులు నిర్వహించాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో అక్కడి వాతావరణం, పరిసరాలు, సమస్యలు, ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాల గురించి అవగాహన ఉండటం తప్పనిసరి. కాబట్టి ఈ అంశాన్ని పరీక్షలో చేర్చారు. ఇందులో పంచాయితీరాజ్ వ్యవస్థ పుట్టుకు నేపథ్యం, ఆంధ్రప్రదేశ్‌లో పంచాయితీరాజ్ వ్యవస్థ ఆవిర్భావం, పంచాయితీ సెక్రెటరీ విధులు, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చేపడుతున్న గ్రామీణాభివృద్ధి కార్యక్రమాలు, పేదరికాన్ని తొలగించేందుకు అమలు చేస్తున్న పథకాలు, ఆంధ్రప్రదేశ్ పంచాయితీరాజ్ డిపార్ట్‌మెంట్ ప్రధాన పథకాలు, ఏపీ గ్రామీణ ఆర్థిక వ్యవస్థ (వ్యవసాయం, భూములు, కుటీర పరిశ్రమలు తదితరాలు). గ్రామీణులకు రుణాల మంజూరులో బ్యాంకులు, కోఆపరేటివ్ సంస్థల పాత్ర, మహిళా సంక్షేమం కోసం చేపట్టే కార్యక్రమాలు, స్వయం సహాయక సంఘాలు,



స్థానిక సంఘాల ఆదాయం, వ్యయం వివిధ పథకాలకు వచ్చిన నిధులు, చేసిన ఖర్చు, సామాజిక అభివృద్ధి పథకాలు - సంబంధిత సంస్థలు వంటి అంశాల నుంచి ప్రశ్నలు వస్తాయి.

ఏపీపీఎస్సీ గ్రూప్-3 సిలబస్

గ్రూప్-3: పంచాయతీ సెక్రటరీ (గ్రేడ్-4)

పేపర్-1 జనరల్ స్టడీస్

1. జాతీయ అంతర్జాతీయ ప్రాధాన్యం కలిగిన సంఘటనలు
2. అంతర్జాతీయ, జాతీయ, ప్రాంతీయ వర్తమాన వ్యవహారాలు
3. సామాన్య శాస్త్రం, దైనందిన జీవితంలో సామాన్యశాస్త్రం వినియోగం, శాస్త్ర సాంకేతిక రంగాలు, సమాచార సాంకేతికతలో సమకాలీన అభివృద్ధి
4. భారత జాతీయోద్యమానికి ప్రాధాన్యతనిస్తూ ఆధునిక భారతదేశ చరిత్ర
5. స్వాతంత్ర్యానంతరం భారతదేశ ఆర్థికాభివృద్ధి
6. తార్కిక విశ్లేషణా సామర్థ్యం, దత్తాంశ అనువర్తన, దత్తాంశ విశదీకరణ (Logical reasoning, analytical ability and data interpretation)
7. విపత్తు నిర్వహణ ప్రాథమిక భావనలు (సీబీఎస్‌ఈ 8, 9వ తరగతి స్థాయి)
8. భారతదేశ భూగోళశాస్త్రం - భౌతిక, సాంస్కృతిక, జనాభా, ఆర్థిక, సాంఘిక మరియు మౌలిక అంశాల దృష్ట్యా ఆంధ్రప్రదేశ్ భూగోళశాస్త్రం
9. భారత రాజ్యాంగం, రాజకీయ వ్యవస్థ
10. సుస్థిరాభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ
11. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విభజన, ఆ కారణంగా రాష్ట్రం ఎదుర్కొంటున్న పరిపాలన, ఆర్థిక, సాంఘిక, సాంస్కృతిక, రాజకీయ మరియు న్యాయపరమైన చిక్కులు, సమస్యలు. వీటితోపాటు
   - ఎ) రాజధాని నగరాన్ని కోల్పోవడం, నూతన రాజధాని నిర్మాణంలో ఎదురయ్యే ఆర్థిక సవాళ్లు, చిక్కులు
   - బి) ఉమ్మడి సంస్థల విభజన, పునర్నిర్మాణం
   - సి) ఉద్యోగుల విభజన, వారి పునస్థాపన, స్థానికత సమస్యలు
   - డి) వాణిజ్యం, వ్యవస్థాపకులపై విభజన ప్రభావం
   - ఇ) రాష్ట్ర ప్రభుత్వ ఆర్థిక వనరులకు సంబంధించిన సమస్యలు
   - ఎఫ్) విభజనానంతరం అవస్థాపన సౌకర్యాల అభివృద్ధి, పెట్టుబడుల అవకాశాలు
   - జి) సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక, జనాభాపరమైన (Demographical) అంశాలపై విభజన ప్రభావం
   - హెచ్) నదీజలాల పంపిణీ, సంబంధిత పరిణామాలపై విభజన ప్రభావం
   - ఐ) ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం - 2014, దానిలోని అహేతుక అంశాలు

పేపర్-2

1. 1956 నుంచి ఆంధ్రప్రదేశ్‌లో పంచాయతీరాజ్ వ్యవస్థ పరిణామం
2. పంచాయతీ కార్యదర్శి, విధులు, బాధ్యతలు
3. గ్రామీణ సమాజం : గ్రామీణ పేదల అభవృద్ధి కొరకు ప్రవేశపెట్టిన పథకాల చరిత్ర, పరిణామ క్రమం
4. కేంద్రరాష్ట్ర గ్రామీణాభివృద్ధి శాఖలు - ప్రధాన గ్రామీణాభివృద్ధి పథకాలు
5. పంచాయతీ రాజ్ శాఖ ముఖ్య పథకాలు
6. ఆంధ్రప్రదేశ్ గ్రామీణ ఆర్థిక వ్యవస్థ - వ్యవసాయం, చిన్నతరహా పరిశ్రమలు
7. ఆంధ్రప్రదేశ్ గ్రామీణ పరపతి విధానం (Rural Credit Scenario) - బ్యాంకులు, సహకార సంఘాలు, సూక్ష్మవిత్త సంస్థల పాత్ర
8. సమాజ ఆధారిత సంస్థలు, సంక్షేమ పథకాల కేంద్రీకరణ
9. స్వయం సహాయక బృందాల ద్వారా మహిళా సాధికారత, ఆర్థికాభివృద్ధి
10. స్థానిక సంస్థల ఆదాయ వ్యయాల నిర్వహణ
11. వివిధ పథకాల నిధులు, గ్రాంట్ల నిర్వహణ.

★

ప్రజలే నాకు రక్షణ : అఖిలప్రియ

బందోబస్తు లేకుండా పర్యటన

ప్రజాశక్తి-ఆళ్ళగడ్డ

పోలీసులు తమ పార్టీకి చెందిన వారి ఇళ్లపై దాడులు చేసి వారిని ఇబ్బందులకు గురిచేయడం సరికాదని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి భూమా అఖిల ప్రియ అన్నారు. కార్యకర్తలకు రక్షణ లేనప్పుడు నాకు రక్షణ వద్దని పోలీసులను వెనుక్కు పంపానన్నారు. గత రెండు రోజులుగా బందోబస్తు లేకుండానే జన్మభూమి- మా ఊరు సభలకు ఆమె హాజరవుతున్నారు. ఆమె మాట్లాడుతూ ఎన్నికల్లో కోడ్ అమలు ఉన్న సమయంలో లేదా రౌడీ షీట్ ఉన్నవారిపైనో లేదా కేసులు ఉన్నవారి ఇళ్ళపైనో దాడులు చేస్తే తమకు ఎలాంటి అభ్యంతరం లేదని అన్నారు. పోలీసుల రక్షణ లేకున్నా తమకు గ్రామాలలో ప్రజలే రక్షణగా ఉంటారన్నారు. కార్యక్రమంలో ఆళ్ళగడ్డ మార్కెట్ యార్డు చైర్మెన్ బివిరామిరెడ్డి, పుట్టాలమ్మదేవస్థానం చైర్మెన్ అంబటి మహేశ్వరెడ్డి ఉన్నారు.

పుస్తక మహోత్సవం



పుస్తక మహోత్సవంలో మాట్లాడుతున్న సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ జాస్తి చలమేశ్వర్

సమాజాన్ని ఉత్తేజపరచే రచనలు అవసరం

కందుకూరి శత వర్ధంతి సభలో జస్టిస్ జాస్తి చలమేశ్వర్

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్

నేటి సమాజానికి ఉత్తేజపరచే రచనలు ఎంతో అవసరమని సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ జాస్తి చలమేశ్వర్ అన్నారు. విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ ఆధ్వర్యంలో నగరంలోని స్వరాజ్య మైదాన్‌లో జరుగుతున్న 30వ పుస్తక మహోత్సవంలో శనివారం సాయంత్రం 'కందుకూరి శత వర్ధంతి సభ' జరిగింది. ఈ కార్యక్రమకంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న చలమేశ్వర్ మాట్లాడుతూ ఆనాడు తన రచనల ద్వారా ప్రజలను ఉత్తేజపరచిన వ్యక్తి కందుకూరి వీరేశలింగమని కొనియాడారు. ఆయన రచనల్లో చక్కని సందేశం ఉండేదని, అటువంటి సందేశం, మంచి మాటలు చెప్పేవారు నేడు కరువయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. గురజాడ, కందుకూరి, శ్రీశ్రీ వంటి వారి తరువాత ఎవరనే దానిపై వెతుక్కోవాల్సి వస్తోందన్నారు. సమాజానికి మార్గదర్శనం చేసే వ్యక్తులు కావాలన్నారు. పిడిఎఫ్ శాసనమండలి సభ్యులు విఠపు బాలసుబ్రహ్మణ్యం మాట్లాడుతూ వీరేశలింగం తెలుగువాడు కావడం మన అదృష్టమన్నారు. తెలుగులో మొదటి సైన్సు పుస్తకం జీవశాస్త్రాన్ని రచించిన వ్యక్తి కందుకూరి అన్నారు. విద్యకు వీరేశలింగం అత్యధిక ప్రాధాన్యత ఇచ్చేవారన్నారు. ఆయన సాహిత్యాన్ని ప్రజలకు అందించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. జీవిత చరమాంకంలో ఆయన జీవనం దయనీయంగా సాగిందన్నారు. ఆయన గొప్ప భావాలను నేడు ప్రతి ఒక్కరూ నేర్చుకోవాలన్నారు. డిఆర్‌డిఒ చైర్మన్ డాక్టర్ సతీష్ రెడ్డి మాట్లాడుతూ ఆనాటి గ్రాంథిక భాష నుండి అధునాతన భాషలోకి సైన్సు పుస్తకాలను మలచారని తెలిపారు. అటువంటి గొప్ప వ్యక్తి శత వర్ధంతి సభ విజయవాడ పుస్తక మహోత్సవంలో నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమానికి సాహితీ స్రవంతి రాష్ట్ర అధ్యక్షులు వొర ప్రసాద్ అధ్యక్షత వహించారు. కందుకూరి సాహిత్యంపై సాహితీ విమర్శకులు డాక్టర్ రాచపాళెం చంద్రశేఖరెడ్డి, కందుకూరి సంఘ సంస్కరణోద్యమం గురించి సాహితీ విమర్శకులు డాక్టర్ కనుపర్తి విజభక్ష వివరించారు.

సంస్కరణలతో వ్యవసాయం చిన్నాభిన్నం

- కౌలు రైతులు లేకపోతే సాగు ప్రశ్నార్థకం
- ప్రకృతి సాగు వెనుక కార్పొరేట్ లాభాలు
- ఆర్థిక సంస్కరణలు-వ్యవసాయరంగంపై ప్రభావం సదస్సులో శ్రీనివాసరావు



సదస్సులో మాట్లాడుతున్న వి.శ్రీనివాసరావు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

సంస్కరణల అమలుతో తొలిదెబ్బ వ్యవసాయంపైనే పడిందని, సబ్సిడీలు ఎత్తేసి, ఎరువుల ధరలు అమాంతంగా పెంచడంతో రైతులు రక్తం చిందించాల్సిన పరిస్థితి ఏర్పడిందని రైతు సంఘం జాతీయ నాయకులు వి.శ్రీనివాసరావు తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న వ్యవసాయ విధానాల ఫలితంగా గ్రామీణ పేదలు, రైతుల జీవితాలు చిన్నాభిన్నమయ్యాయని విమర్శించారు. పశ్చిమగోదావరి జిల్లా ఏలూరు పవరుపేటలో అన్నే భవనం వద్ద రైతు, వ్యవసాయ కార్మిక నేత, అమరజీవి అన్నే వెంకటేశ్వరరావు 15వ వర్ధంతి సభ సందర్భంగా 'ఆర్థిక సంస్కరణలు-వ్యవసాయ రంగంపై ప్రభావం' అంశంపై సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు చింతకాయల బాబూరావు అధ్యక్షతన శనివారం సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ 25 సంవత్సరాల నూతన ఆర్థిక విధానాల వల్ల వ్యవసాయ రంగం తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయిందని తెలిపారు. వ్యవసాయ కార్మికులు, పేద రైతులు ఉపాధి కోల్పోయి వలస పోవాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. భూ యజమానులు పూర్తిగా వ్యవసాయ సాగు నుంచి తప్పుకున్నారని చెప్పారు. కౌలు రైతులే లేకపోతే వ్యవసాయ సాగులేదని, వారిని ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సంస్కరణల ఫలితంగా అభివృద్ధి ఫలాలు కొందరికే చేరుతున్నాయని, పేదలు మరింత పేదలుగా మారారని చెప్పారు. అభివృద్ధి అంటే సిమెంట్ రోడ్లు, భవనాలు గురించి మాట్లాడుతున్నారని, మనిషి అభివృద్ధి గురించి మాట్లాడడం లేదని పేర్కొన్నారు. పెట్టుబడి ఖర్చులు పెరిగి వ్యవసాయంలో నష్టాలొచ్చి కౌలురైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని చెప్పారు. గిట్టుబాటు ధరలేక, కష్టపడి పండించిన పంటలు అమ్ముకునే పరిస్థితి లేక రైతుకు అప్పులే మిగులుతున్నాయని ఆవేధన వ్యక్తం చేశారు. వ్యవసాయ కార్మికులకు ఒకప్పుడు వరి వ్యవసాయంలో సంవత్సరానికి 70 నుండి 80 రోజులు పని దొరికితే, ఇప్పుడు 20 నుండి 25 పని దినాలకు పడిపోయాయని ఆందోళన వ్యక్తం చేశారు. జీరో బడ్జెట్‌తో ప్రకృతి సేద్యం అంటున్నారని, అందులో నిజం లేదని చెప్పారు. ఆవుపేడ, పంచామృతంతో ఎకరా, అరెకరా సాగు చేయొచ్చని, నాలుగు, పది ఎకరాలు సాగుచేసే రైతుకు ఎక్కడి నుంచి వస్తాయని ప్రశ్నించారు. వాటి సరఫరాకు కార్పొరేట్లు కంపెనీలు స్థాపించి దోచుకుంటారన్నారు. ముఖ్యమంత్రి అమెరికా వెళ్లి ప్రకృతి సేద్యంలో పెట్టుబడులు పెట్టాలని చెబుతున్నారన్నారు. ఆర్థిక సంస్కరణలకు వ్యతిరేకంగా వ్యవసాయ కార్మికులు, రైతులు, చేతివృత్తిదారులు, కార్మికులు ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు.

ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర పూర్వ నాయకులు మంతెన సీతారాం మాట్లాడుతూ అన్నే వెంకటేశ్వరరావు 13 ఏళ్ల వయసులోనే స్వాతంత్రోద్యమంలో పాల్గొని అరెస్టు అవ్వడంతో ప్రారంభించిన ప్రజా జీవితం 2003 వరకూ సమాజ మార్పు కోసం అంకితం చేశారని తెలిపారు. ఆయన సతీమణి అనసూయ పోరాటాలలో, ఉద్యమాలలో చేదోడు వాదోడుగా పనిచేశారని చెప్పారు. సదస్సులో ఎపి వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు, పూర్వ రాష్ట్ర కార్యదర్శి పి.మురళీకృష్ణ, ఎపి రైతు సంఘం పూర్వ రాష్ట్ర అధ్యక్షులు బి.బలరాం, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు చింతకాయల బాబూరావు పాల్గొన్నారు. అన్నే అనసూయ, వెంకటేశ్వరరావు పేరుతో ఏలూరులో ఎవిఆర్ విజ్ఞాన కేంద్రాన్ని పవరుపేటలోని అన్నే భవనంలో శ్రీనివాసరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా విజ్ఞాన కేంద్రాల రాష్ట్ర సమన్వయకర్త పి.మురళీకృష్ణ మాట్లాడారు.



దీక్షలో మాట్లాడుతున్న సిఐటియు రాష్ట్ర కార్యదర్శి కె.ధనలక్ష్మి

ప్రభుత్వం స్పందించే వరకూ పోరాడాలి

పిఎసిఎస్ ఉద్యోగుల దీక్షలో సిఐటియు రాష్ట్ర కార్యదర్శి ధనలక్ష్మి

ప్రజాశక్తి-యంత్రాంగం

టిడిపి ప్రభుత్వం ఓటు బ్యాంకు ఆధారంగానే వేతనాలను పెంచుతోందని సిఐటియు రాష్ట్ర కార్యదర్శి కె ధనలక్ష్మి అన్నారు. సహకార సంఘాల ఉద్యోగుల పట్ల ప్రభుత్వ నిరంకుశ విధానాలను నిరసిస్తూ విజయవాడ ధర్నా చౌక్‌లో అగ్రికల్చర్ కో-ఆపరేటివ్ సొసైటీ ఎంప్లాయీస్ యూనియన్ చేపట్టిన దీక్షల్లో శనివారం ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ రంగ సంస్థల్లోని సిబ్బందికి కనీస వేతనాలు పెంచాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. పిఎసిఎస్ సిబ్బంది వేతన సమస్యలపై ప్రభుత్వం స్పందించే వరకూ పోరాడాలని, సమస్యను పరిష్కరించకపోతే చంద్రబాబును ఇంటికి పంపాలని పిలుపునిచ్చారు. ఎమ్మెల్యేలు, మంత్రుల జీతాలు పెరిగాయే తప్ప సిబ్బంది జీతాలు పెరగడం లేదన్నారు. విభజన తరువాత కార్మికులు, ఉద్యోగుల్ని పూర్తిగా పక్కన పెట్టారని, 2014లో చేయాల్సిన వేతన సవరణ ఇప్పటి వరకూ చేయకుండా, ఇప్పుడు కమిటీల పేరుతో కాలయాపన చేస్తున్నారని మండిపడ్డారు. ఈ నెల 8,9న జరిగే సార్వత్రిక సమ్మెలో కూడా పిఎసిఎస్ ఉద్యోగులు పాల్గొనాలన్నారు. సహకార సంఘాలను నిర్లక్ష్యం చేయడం వల్ల రైతాంగం ఎలా నష్టపోతారో రైతుల్లో అవగాహన కల్పించాలని, ప్రభుత్వంలో భయం తీసుకురావాలని కోరారు. అవసరమైతే విజయవాడలో రోడ్లు దిగ్బంధం చేసి ప్రభుత్వం దిగివచ్చేలా చేయాలని, ఆత్మ విశ్వాసం కోల్పోకుండా ఉద్యోగులంతా ఏకతాటిపై నిలబడి పోరాడాలని సూచించారు. యూనియన్ గౌరవాధ్యక్షులు పి అజయ్‌కుమార్ మాట్లాడుతూ కమిటీ సిఫారసుల్లో మార్పులు చేసి జీవో విడుదల చేయాలని డిమాండ్ చేశారు. 10 శాతం వేతనం పెంపును వ్యతిరేకిస్తున్నామని, గ్రాట్యుటీ కూడా భిక్షగా ఉందని అన్నారు. గ్రాట్యుటీ చట్టం ప్రకారం చూసినా కనీసం రూ.5 లక్షలు రావాల్సి ఉందన్నారు. సుదీర్ఘ పోరాటం చేస్తే ఏదైనా సాధించుకోగలమన్నారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షులు పివి సత్యనారాయణ రాజు, ప్రధాన కార్యదర్శి పి సత్యనారాయణ పాల్గొన్నారు. గుంటూరు, కృష్ణా, తూర్పుగోదావరి, శ్రీకాకుళం జిల్లాల్లో ప్రాథమిక వ్యవసాయ సహకార ఉద్యోగుల సంఘం ఆధ్వర్యాన పిఎసిఎస్ ఉద్యోగుల నిరవధిక సమ్మె శనివారమూ కొనసాగింది. గుంటూరు జిల్లాలో సమ్మెకు మద్దతిస్తున్నట్లు సిపిఎం గుంటూరు తూర్పు జిల్లా కార్యదర్శి పాశం రామారావు ప్రకటించారు. తామూ సమ్మెలో పాల్గొంటున్నట్లు ఎపి మెడికల్ అండ్ సేల్స్ రిప్రెజెంటేటివ్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి సిహెచ్.కుమార్ ప్రకటించారు. కృష్ణాజిల్లా తిరువూరు, ఉంగుటూరు, తోట్లవల్లూరులో సమ్మె కొనసాగింది. తిరువూరులో సిఐటియు, ఎఐటియుసి ఆధ్వర్యంలో మధిర రోడ్డు నుంచి బస్టాండ్ వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. శ్రీకాకుళంలో డిసిసిబి కార్యాలయం వద్ద సమ్మె శిబిరం కొనసాగుతోంది. తూర్పుగోదావరి జిల్లా పెద్దాపురం డిసిసిబి కార్యాలయం వద్ద చేపట్టిన సమ్మె శిబిరాన్ని సిపిఎం నాయకులు నీలపాల సూరిబాబు, సిరపరపు శ్రీనివాస్, కూనిరెడ్డి అప్పన్న, యాసలపు రమేష్ సందర్శించి మద్దతు తెలిపారు. అలాగే రామచంద్రపురం, కాట్రేనికోనలోని డిసిసిబి కార్యాలయాల వద్ద నిరసన తెలిపారు.

విద్యుత్ ఉద్యోగులను పట్టించుకోని సర్కార్

కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

ప్రజాశక్తి-కార్పొరేషన్ (గుంటూరు)

రాష్ట్రంలో 24 గంటలు విద్యుత్ ఇస్తున్నామని జన్మభూమి సభల్లో ఊదరగొడుతున్న సిఎం చంద్రబాబుకు విద్యుత్ కార్మికులు పడుతున్న బాధలు పట్టవా? అని ఎపి ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.బాలకాశి ప్రశ్నించారు. విద్యుత్ కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా చంద్రబాబు మోసం చేశారని మండిపడ్డారు. గుంటూరులోని జాషువ విజ్ఞాన కేంద్రంలో యూనియన్ రాష్ట్ర కమిటీ సమావేశానికి శనివారం హాజరైన ఆయన విలేకర్లతో మాట్లాడారు. విద్యుత్ రంగంలో 30 వేలమందికి పైగా పని చేస్తున్నారని, వీరిలో అధికశాతం 20 ఏళ్ల నుండి పని చేస్తున్నారని, ఇప్పటికీ కనీస వేతనం, ఉద్యోగ భద్రత లేవని ఆవేదన వ్యక్తం చేశారు. గత ఎన్నికల్లో టిడిపి మేనిఫెస్టోలో కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల రెగ్యులరైజేషన్ హామీని విస్మరించారని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలనే తీర్పును సైతం గౌరవించడం లేదని విమర్శించారు. విద్యుత్ సంస్థల్లో పని చేస్తున్న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని నాలుగు నెలల కిందట ఉమ్మడి హైకోర్టు ఇచ్చిన తీర్పునూ అమలు చేయడం లేదన్నారు. హుదూద్, తిత్లీ తుపాన్ల సందర్భంలోనూ విద్యుత్ ఉద్యోగులు ప్రాణాలను ఫణంగా పెట్టి విద్యుత్ పునరుద్ధరించారని గుర్తు చేశారు. ఇప్పటికైనా ముఖ్యమంత్రి ఉద్యోగుల సమస్యలు పరిష్కరించకుంటే రానున్న ఎన్నికల్లో తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. సమావేశంలో ఎస్.జాన్‌కుమార్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ప్రధాని దిష్టిబొమ్మ దహనం

ప్రజాశక్తి-అరకు రూరల్ (విశాఖపట్నం)

పార్లమెంట్‌లో టిడిపి ఎంపీలపై అనుచిత వ్యాఖ్యలు చేయడంతో పాటు సస్పెన్షన్‌కు గురి చేసిన కేంద్ర ప్రభుత్వం వైఖరి, ప్రధాని మోడీ వ్యవహారశైలిని నిరసిస్తూ విశాఖ జిల్లా అరకులో నియోజకవర్గం కేంద్రంలో టిడిపి నేతలు ఆందోళన చేపట్టారు. ప్రధాని మోడీ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా టిడిపి జిల్లా అధికార ప్రతినిధి శెట్టి అప్పాలు మాట్లాడుతూ విభజన హామీలు ఏ ఒక్కటీ అమలు చేయకుండా కాలయాపన చేయడమే కాకుండా, టిడిపి ప్రభుత్వంపై నిందలు మోపుతూ కుట్రపూరితంగా వ్యవహరించడం సరికాదన్నారు. ప్రత్యేక ప్యాకేజీ ఇస్తామని హామీలు గుప్పించిన కేంద్ర ప్రభుత్వం అదనపు నిధులు ఇవ్వకపోగా, ఇచ్చిన నిధులను వెనక్కి తీసుకోడాన్ని దేశ ప్రజలు గమనిస్తున్నారని పేర్కొన్నారు. రానున్న ఎన్నికల్లో ప్రజలు తగిన గుణపాఠం చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు.

ప్రజ్ఞ

జవాబులు

1. భారత్
2. జియో ఫోన్
3. చాంగ్ ఈ-4
4. ఆంధ్రప్రదేశ్
5. స్వీడన్

సార్వత్రిక సమ్మెకు సమాయత్తం

- రాష్ట్రంలో పలుచోట్ల బైకు ర్యాలీలు
- పోస్టర్ల ఆవిష్కరణ-విస్తృత ప్రచారం



కర్నూలులో బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న సిఐటియు, ఎఐటియుసి నాయకులు

ప్రజాశక్తి- యంత్రాంగం

ఈ నెల 8, 9 తేదీల్లో జరిగే సార్వత్రిక సమ్మెపై శనివారం విస్తృత ప్రచారం జరిగింది. రాష్ట్రంలోని పలు జిల్లాల్లో బైక్ ర్యాలీలు నిర్వహించారు. ముఖ్యంగా పారిశ్రామిక ప్రాంతాలపై కేంద్రీకరించారు. సమ్మె పోస్టర్లను ఆవిష్కరించారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ అఖిలపక్ష కార్మిక సంఘాల ఆధ్వర్యాన శనివారం ప్లాంట్ పరిపాలనా భవనం వద్ద మానవహారం నిర్వహించారు. సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్.నర్సింగరావు పాల్గొని ప్రసగించారు. గాజువాక, ఆనందపురం, పద్మనాభం, భీమిలిలో బైక్ ర్యాలీలు జరిగాయి. గొలుగొండ, అనకాపల్లిలో సిఐటియు ఆధ్వర్యంలో జీపుజాతా నిర్వహించారు. నర్సీపట్నంలో సిఐటియు, ఉద్యోగ సంఘాల నాయకులు ఆధ్వర్యంలో, పాడేరులో సిఐటియు, గిరిజన సంఘం ఆధ్వర్యాన బైక్ ర్యాలీ జరిగింది. సమ్మెలో తామూ పాల్గొంటున్నట్లు ఎపి మెడికల్ అండ్ సేల్స్ రిప్రెజెంటేటివ్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి సిహెచ్.కుమార్ ప్రకటించారు. ఈ మేరకు గుంటూరులోని సిఐటియు కార్యాలయంలో సమ్మె పోస్టర్‌ను ఆవిష్కరించారు. సమ్మె విజయవంతానికి తెనాలిలో టెలిఫోన్ ఎక్స్ఛేంజ్ వద్ద ఉద్యోగులు సమావేశమయ్యారు. కృష్ణా జిల్లా తిరువూరులో సిఐటియు, ఎఐటియుసి ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ జరిగింది. ఉంగుటూరులో భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు సమ్మె పోస్టర్‌ను ఆవిష్కరించారు. తాము సమ్మెలో పాల్గొంటున్నట్లు తోట్లవల్లూరు మండలం యాకనూరులోని సుధీర్ టింబర్ డిపో కార్మికులు సిఐటియు ఆధ్వర్యంలో యజమాన్యానికి నోటీసు అందజేశారు. శ్రీకాకుళం జిల్లాలోని పారిశ్రామిక ప్రాంతాలను కవర్ చేస్తూ సిఐటియు ఆధ్వర్యాన బైక్ ర్యాలీ జరిగింది. ఎచ్చెర్ల మండలం అరిణాం అక్కివలసలోని శ్యామ్‌పిస్టన్స్ ప్లాంట్-3 పరిశ్రమ వద్ద ప్రారంభమైన ఈ ర్యాలీ కుశాలపురంలోని ఇండస్ట్రియల్ ఎస్టేట్ వరకూ కొనసాగింది. పాలకొండ సిఐటియు కార్యాలయంలో సమ్మె పోస్టర్‌ను ఆవిష్కరించారు. విజయనగరం సమీపంలోని ఎఎస్ జ్యూట్‌మిల్లు వద్ద సిఐటియు ఆధ్వర్యాన గేటు మీటింగ్ జరిగింది. సార్వత్రిక సమ్మెలో పాల్గొంటామంటూ విజయనగరంలోని బేవరేజ్ కార్మికులు ఆ సంస్థ మేనేజర్‌కు ఎపి బెవరేజ్ హమాలీ కార్మిక సంఘం ఆధ్వర్యాన నోటీసు అందజేశారు. సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని కోరుతూ సిఐటియు, ఎఐటియుసి, టిఎన్‌టియుసి ఆధ్వర్యాన విజయనగరంలో బైక్ ర్యాలీ జరిగింది. తూర్పుగోదావరి జిల్లా ఏలేశ్వరంలో ఎఐటియుసి ఆధ్వర్యాన ప్రచారం నిర్వహించారు. పశ్చిమగోదావరి జిల్లా వేలేరుపాడు మండలంలో సిఐటియు ఆధ్వర్యాన ప్రచార జీపుయాత్ర పర్యటించింది. భీమడోలులో ఆటో వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యాన సర్వసభ్య సమావేశం జరిగింది. పెనుమంట్రలోని బ్రాహ్మణ చెరువు సివిల్ సప్లయిస్ గొడౌన్ వద్ద సిఐటియు ఆధ్వర్యాన ప్రచారయాత్ర నిర్వహించారు. నిడమర్రులో భవన నిర్మాణ కార్మిక సంఘం ఆధ్వర్యాన వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు.

కర్నూలులో సిఐటియు, ఎఐటియుసి ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ, సమావేశం జరిగింది. సిఐటియు, ఎఐటియుసి చేపట్టిన జీపుజాతా చిత్తూరుకు చేరుకుంది. సమ్మెను జయప్రదరం చేయాలని కోరుతూ అనంతపురం జిల్లాలోని పలు ప్రాంతాల్లో వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. పామిడిలో సిఐటియు ఆధ్వర్యాన సమావేశం జరిగింది. ప్రకాశం జిల్లా ఒంగోలులో సిఐటియు ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ, చీరాల ఐటిసి వద్ద కార్మికులు ప్రదర్శన నిర్వహించారు. నెల్లూరులో కార్మిక సంఘాల ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ జరిగింది.

ప్రత్యేకం

దెబ్బతిన్న 'రాజ్‌మా'

- రూ.32.85 కోట్ల నష్టం
- గిరిజన రైతులకు అందని సహకారం



విశాఖ జిల్లా రాజుపాకలలో దెబ్బతిన్న రాజ్‌మా పంట

ప్రజాశక్తి-విశాఖపట్నం ప్రతినిధి

విశాఖ ఏజెన్సీలోని అరకు నియోజకవర్గం పరిధి అనంతగిరి మండలం, ఇదే పంచాయతీలోని రాజుపాకలకు చెందిన డి.లచ్చు ఈ ఏడాది ఎకరా మెట్ట భూమిలో రాజ్‌మా వేశారు. ఈ ఎకరా భూమిలో గతేడాది 300 కేజీలు రాజ్‌మా పంట దిగుబడి రాగా, ఈ ఏడాది వర్షాల్లేకపోవడంతో కేవలం 25 కేజీలు మాత్రమే దిగుబడి వచ్చింది. గతేడాది రాజ్‌మా కిలో ధర రూ.35 ఉండగా, 300 కేజీలకు రూ.10,500 ఆదాయం వచ్చింది. ఈ ఏడాది కిలో ధర రూ.50 పలికినా పంట దిగుబడి లేక రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఈ ఏడాది పండిన 25 కేజీల దిగుబడిలో 20 కేజీలు విత్తనాలకు కేటాయిస్తే మిగిలిన 5 కేజీలకు కిలో రూ.50 చొప్పున రూ.250 మాత్రమే ఆదాయం వచ్చింది.

ఏజెన్సీలోని రాజ్‌మా పండించిన ప్రతి గిరిజన రైతుకూ ఈ ఏడాది ఇటువంటి చేదు అనుభవం ఎదురైంది. సంతలోవున్న ప్రస్తుత ధర 50 రూపాయల ప్రకారం ఎకరాకు 300 కేజీలు దిగుబడివస్తే 15వేల రూపాయల ఆదాయం రావాల్సిన రైతుకు పంట పోవడంతో వెయ్యి రూపాయలు కూడా రాలేదు. పల్లపు పొలాల్లో పండించే వరి సహా మెట్ట పంటైన రాజ్‌మా దెబ్బతినడంతో గిరిజనులు తీవ్రంగా నష్టపోయారు. ఏజెన్సీలోని 11 మండలాల్లో వర్షాభావం వల్ల రాజ్‌మా నష్టం రూ.32.85 కోట్లు ఉంటుందని అంచనా. చింతపల్లి, జికె.వీధి, కొయ్యూరు, అరకులోయ, అనంతగిరి, డుంబ్రిగుడ, హుకుంపేట, పాడేరు, ముంచంగిపుట్టు, జి.మాడుగుల, పెదబయలు మండలాల్లో 26,160 ఎకరాల్లో గిరిజనులు రాజ్‌మా పండించారు. దీంట్లో 21,902.5 ఎకరాల్లో పంట దెబ్బతిన్నట్లు వ్యవసాయశాఖ నిర్ధారించింది. పంట నష్టం విలువ దాదాపు రూ.32.85 కోట్లువుందని భావిస్తున్నారు. 11 మండలాల్లో డుంబ్రిగుడ మినహా మిగిలిన పది మండలాల్లో భారీగా పంట నష్టం జరిగింది. ఇంత పెద్దమొత్తంలో పంటపోయినా ప్రభుత్వం నుంచి ఏ రకమైన ఆర్థిక సహకారం గిరిజనులకు అందలేదు.

మండలం	రాజ్‌మాపంట	దెబ్బతిన్నది (ఎకరాల్లో)
1.చింతపల్లి	7,162.5	7,010
2.జికె వీధి	6,710	6,620
3.కొయ్యూరు	552.5	285
4.అరకులోయ	1,700	1,090
5.అనంతగిరి	965	660
6.డుంబ్రిగుడ	2,252.5	-
7.హుకుంపేట	950	892.5
8.పాడేరు	1,157.5	927.5
9.ముంచంగిపుట్	3,477.5	3,445
10.జి.మాడుగుల	737.5	660
11.పెదబయలు	495	312.5
మొత్తం	26,160	21,902.5

ట్రిపుల్ తలాక్ బిల్లుకు ఎంటిఎఫ్ వ్యతిరేకం

ప్రజాశక్తి - సత్యనారాయణపురం (విజయవాడ)

ముస్లిం మహిళలకు తీవ్ర అన్యాయం చేసే ట్రిపుల్ తలాక్ బిల్లును ముస్లిం ఆలోచనాపరుల వేదిక (ఎంటిఎఫ్) తీవ్రంగా ఖండిస్తోందని వేదిక కన్వీనర్ ఎఎం యజ్దాని తెలిపారు. విజయవాడ గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ట్రిపుల్ తలాక్ బిల్లు చట్టం కాకుండా రాజ్యసభలో అడ్డుకున్న విపక్ష పార్టీలు అన్నింటికీ ఎంటిఎఫ్ తరపున అభినందనలు తెలిపారు. సుప్రీం కోర్టు ఇన్ స్టాంట్ ట్రిపుల్ తలాక్ మీద 2017 ఆగస్టులో ఇచ్చిన తీర్పును ముస్లిం సమాజం సంపూర్ణంగా ఆమోదిస్తోందన్నారు. ఇప్పుడు ఎన్‌డిఎ ప్రభుత్వం తీసుకురావాలని ప్రయత్నించిన చట్టం దురుద్దేశాలతో కూడుకుందని చెప్పారు. దీని పేరు ముస్లిం మహిళ రక్షణ చట్టం అయినప్పటికీ ఇది నిజానికి ముస్లిం కుటుంబ భక్షణ చట్టం అని ఎద్దేవా చేశారు. విడాకులు పొందిన మహిళలు దేశంలో ప్రస్తుతం దాదాపు పదిన్నర లక్షల మంది వున్నారని వీరిలో రెండు లక్షల మంది ముస్లిం మహిళలున్నారని తెలిపారు. కుల మత బేధాలు లేకుండా పది లక్షల మంది ఒంటరి స్త్రీలకు రూ. 5 లక్షల చొప్పున చేయూతనిచ్చేలా కేంద్ర ప్రభుత్వం ఒక పథకాన్ని చేపట్టాలని ముస్లిం ఆలోచనాపరుల వేదిక డిమాండ్ చేస్తుందన్నారు. సమావేశంలో వేదిక గౌరవాధ్యక్షులు డాక్టర్ ఎంఎ రహమాన్, రాజకీయ విశ్లేషకులు సయ్యద్ రఫీ పాల్గొన్నారు.

మావోయిస్టు దంపతులు లొంగుబాటు

ప్రజాశక్తి-విశాఖపట్నం ప్రతినిధి

మావోయిస్టు పార్టీకి చెందిన డివిజనల్ కమిటీ సభ్యులు (డిసిఎం) చేవ్వ లక్ష్మీనారాయణరెడ్డి అలియాస్ అశోక్, ఏరియా కమిటీ సభ్యులు శ్రావణం దుర్గాదేవి అలియాస్ ఇరిమీ శనివారం విశాఖ జిల్లా ఎస్‌పి అట్టాడ బాబూజీ ఎదుట లొంగిపోయారు. వీరిద్దరు భార్య, భర్తలు. జిల్లా పోలీసు కార్యాలయం విడుదల చేసిన ప్రకటన ప్రకారం... కడప జిల్లా లింగాల మండలం దొండ్లవాగుకు చెందిన లక్ష్మీనారాయణరెడ్డి 1994 నుంచి 2000 వరకు రాడికల్ స్టూడెంట్ యూనియన్‌లో వివిధ హోదాల్లోనూ, మావోయిస్టు పార్టీ సభ్యునిగానూ పని చేశారు. 2005 సెప్టెంబర్‌లో దళ సభ్యులైన దుర్గాదేవిని వివాహం చేసుకున్నారు. విజయవాడలోని రాజీవ్‌నగర్‌కు చెందిన శ్రావణం దుర్గాదేవి 2000 సంవత్సరంలో చైతన్య మహిళా సంఘం సభలకు వెళ్లి ఆకర్షితురాలైంది. కొంతకాలంగా డెన్‌కీపర్‌గా పనిచేస్తూ పార్టీకి రహస్యంగా మందుగుండు సామగ్రి చేరవేసింది. అనారోగ్య కారణాలలో వారిద్దరూ లొంగిపోయారు. వీరికి ఒక పాప ఉంది.

కన్నా ఇంటి ఎదుట టిడిపి ధర్నా

ప్రజాశక్తి-గుంటూరు సిటీ ప్రతినిధి

కాకినాడలో జన్మభూమి-మాఊరు కార్యక్రమానికి వెళ్తున్న సిఎం చంద్రబాబు కాన్వాయ్‌ను బిజెపి మహిళా కార్పొరేటర్ సాలగ్రామ లక్ష్మీప్రసన్న అడ్డుకోవడంపై కృష్ణాజిల్లా టిడిపి లీగల్ సెల్‌కు చెందిన 30 మంది బిజెపి రాష్ట్ర అధ్యక్షులు కన్నా లక్ష్మీనారాయణ ఇంటిని ముట్టడించారు. కొద్దిసేపటికే బిజెపి కార్యకర్తలు సైతం కన్నా ఇంటి వద్దకు రావడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. సమాచారం అందుకున్న నగరంపాలెం సిఐ వెంకటరెడ్డి తన సిబ్బందితో అక్కడికొచ్చి ఇరు పార్టీల శ్రేణులకూ నచ్చజెప్పిన అందర్నీ అక్కడి నుండి పంపించారు. కన్నా ఇంటికి సమీపంలోని ప్రధాన రహదారిపై టిడిపి కార్యకర్తలు బైఠాయించి, కన్నాకు వ్యతిరేకంగా నినాదాలిచ్చారు. దీంతో వారిపై బిజెపి శ్రేణులు భౌతిక దాడికి దిగడంతో టిడిపి శ్రేణులు పరారయ్యారు. సాయంత్రం బిజెపి ఆధ్వర్యంలో కన్నా ఇంటి నుండి నగరంపాలెం పోలీస్‌స్టేషన్ వరకు నిరసన ర్యాలీ నిర్వహించారు. పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినానంతరం అక్కడ నుంచి మార్కెట్ సెంటర్‌కు ర్యాలీగా వెళ్లి గాంధీ విగ్రహానికి వినతిపత్రం ఇచ్చారు. మరోవైపు బిజెపి దాడికి నిరసనగా తెలుగు యువత ఆధ్వర్యంలో శంకర్‌విలాస్ సెంటర్‌లో ధర్నా చేశారు.

నాపై హత్యాయత్నం : కన్నా

ఈ ఘటనపై కన్నా లక్ష్మీనారాయణ తన నివాసంలో మీడియాతో మాట్లాడారు. గతంలో అమిత్‌షా, జగన్, పవన్‌లపై హత్యాయత్నం చేసిన టిడిపి ఇప్పుడు తనపై హత్యాయత్నానికి పాల్పడిందన్నారు. ఇది సిఎం చంద్రబాబు, లోకేశ్ ఆదేశాల మేరకే జరిగిందని ఆరోపించారు. రాష్ట్రంలో ప్రజాస్వామ్యాన్ని టిడిపి కాలరాస్తోందని, అన్ని వ్యవస్థలనూ భ్రష్టుపట్టించిందని విమర్శించారు. బిజెపి వారిని అంతమొందిస్తానని సిఎం చంద్రబాబు బహిరంగంగా ప్రకటించారని తెలిపారు. తనపై హత్యాయత్నం చేసినందుకు గాను రాష్ట్ర గవర్నర్, కేంద్ర హోం శాఖకు టిడిపిపై ఫిర్యాదు చేస్తానని చెప్పారు. రాష్ట్రంలో క్షీణించిన శాంతి భద్రతలను కాపాడాల్సిన బాధ్యత గవర్నర్‌పై ఉందన్నారు.

మన్మోహన్‌సింగ్ ‘ సక్సెస్‌ఫుల్’ ప్రధాని

శివసేన కితాబు

ముంబయి : మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్‌ను ‘సక్సెస్‌ఫుల్’ ప్రధానిగానే భావిస్తామని బిజెపి మిత్రపక్షమైన శివసేన నేత సంజయ్ రౌత్ వ్యాఖ్యానించారు. ఇటీవల విడుదలైన మన్‌మోహన్ సింగ్ బయోపిక్ ‘యాక్సిడెంటల్ ప్రైమ్ మినిస్టర్’ ట్రైలర్ వివాదాస్పదమైన సంగతి తెలిసిందే. పదేళ్లపాటు దేశాన్ని పాలించి, ప్రజలు గౌరవిస్తున్న ఆయనను ‘యాక్సిడెంటల్’ ప్రధానిగా చూడలేమని అన్నారు. పివి. నరసింహారావు అనంతరం మంచి పరిపాలనను అందించిన ప్రధాని మన్మోహన్ సింగ్ అని, ఆయన్ని ‘యాక్సిడెంటల్’ ప్రధానిగా కంటే ‘సక్సెస్‌ఫుల్’ ప్రధానిగానే చూస్తానని సంజయ్ పేర్కొన్నారు. కాగా, అనుపమ్‌ఖేర్ ప్రధాన పాత్రలో నటించిన ‘యాక్సిడెంటల్ ప్రైమ్ మినిస్టర్’ సినిమాలో పలువురు నేతలను కించపరిచే విధంగా రూపొందించారని ఇటీవల పిటిషన్ దాఖలైంది. కాగా, పదేళ్లపాటు ఒక కుటుంబం దేశాన్ని ఎలా పాలించిందో ఈ ట్రైలర్‌లో చూడండి అంటూ బిజెపి వ్యాఖ్యానించింది

అవార్డులు

జర్నలిస్టులకు రామ్‌నాథ్ గోయంకా అవార్డులు అందజేసే కార్యక్రమం శుక్రవారం న్యూఢిల్లీలో జరిగింది. ఈ కార్యక్రమంలో కేంద్ర హోంమంత్రి రాజ్‌నాథ్ సింగ్ పాల్గొన్నారు.



‘పారిపోయిన ఆర్థిక నేరగాడు విజయ్ మాల్యా

ప్రకటించిన పిఎంఎల్‌ఎ కోర్టు

ముంబయి : దేశంలోని బ్యాంకులకు సుమారు రూ.9వేల కోట్ల రుణాలు ఎగవేసి లండన్‌లో తలదాచుకుంటున్న విజయ్ మాల్యాను ‘పారిపోయిన ఆర్థిక నేరగాడి’గా శనివారం పిఎంఎల్‌ఎ ప్రత్యేక న్యాయస్థానం తీర్పు ఇచ్చింది. ‘పలాయనంలో ఉన్న ఆర్థిక నేరగాళ్ల చట్టం 2018’ ప్రకారం మాల్యాకు పారిపోయిన ఆర్థిక నేరగాడిగా కోర్టు తీర్పు ఇచ్చింది. ఈ చట్టం కింద ‘పారిపోయిన ఆర్థిక నేరగాడు’ గా రికార్డుల కెక్కిన తొలి నిందితుడు మాల్యానే కావడం విశేషం. శనివారం తీర్పుతో మాల్యాకు సంబంధించిన ఆస్తులను జప్తు చేసేందుకు ప్రభుత్వానికి అధికారం లభిస్తుంది. విజయ్ మాల్యా ఆస్తులు సుమారు రూ.12 వేల కోట్లు ఉంటాయని అంచనా. కాగా, అప్పీల్ చేసుకోవడానికి మరికొంత సమయం ఇవ్వాలని మాల్యా చేసిన విజ్ఞప్తిని కోర్టు తిరస్కరించింది. నూతన చట్టం కింద మాల్యాను ‘పారిపోయిన ఆర్థిక నేరగాడి’గా ప్రకటించాలని పిఎంఎల్‌ఎ ప్రత్యేక న్యాయస్థానంలో 2018 జూన్ 22న ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ పిటిషన్ వేసింది. ఈ పిటిషన్ విచారించిన న్యాయస్థానం ఈడీకి అనుకూలంగా తీర్పునిచ్చింది. దీంతో పాటు ఈడీ అభ్యర్థనపై స్టే విధించాల్సిందిగా మాల్యా పిటిషన్‌ను కోర్టు తోసిపుచ్చింది. పలాయనంలో ఉన్న ఆర్థిక నేరగాళ్ల చట్టం 2018ను ఆగస్టులో రాష్ట్రపతి ఆమోదించారు. ఇటీవల కాలంలో అధికంగా ఉన్న దేశం నుంచి పారిపోతున్న ఆర్థిక నేరస్తులపై చట్టపరమైన చర్యలు తీసుకోవడానికి ఈ చట్టాన్ని తీసుకుని వచ్చారు. ఈ చట్ట ప్రకారం వీరిపై అరెస్టు వారెంట్ జారీ చేయవచ్చు.

మేఘాలయ ప్రభుత్వానికి రూ. వంద కోట్ల జరిమానా : ఎన్‌జిటి

న్యూఢిల్లీ : న్యూఢిల్లీ : గనుల త్రవ్వకాలలో అక్రమాలను నిరోధించడంలో విఫలమైన మేఘాలయ ప్రభుత్వంపై జాతీయ హరిత ట్రిబ్యునల్ (ఎన్‌జిటి)..రాష్ట్ర ప్రభుత్వానికి రూ.వంద కోట్ల జరిమానా విధించింది. రూ. 100 కోట్లను రెండు నెలల్లోగా కేంద్ర కాలుష్య నియంత్రణ బోర్డు(సిపిసిబి)కు చెల్లించాల్సిందిగా ఎన్‌జిటి ఛైర్మన్ ఆదర్శ్‌కుమార్ గోయల్‌తో కూడిన ధర్మాసనం తీర్పునిచ్చింది. ‘గత ఏడాది ఆగస్టులో ఏర్పాటు చేసిన స్వతంత్ర్య కమిటీ మైనింగ్ పరిస్థితులపై ఇచ్చిన నివేదికను పరిశీలించిన ధర్మాసనం 2014 నాటి ఆదేశాలను ఉల్లంఘిస్తున్నట్లు స్పష్టమౌతుందని పేర్కొంది. పర్యావరణానికి కలిగిన నష్టాన్ని అంచనా వేసి ఈ జరిమానా విధించారు’ అని అడ్వకేట్ రాజ్ పన్వాని వెల్లడించారు. అలాగే ఆప్రాంతంలో అక్రమ తవ్వకాల నిమిత్తం నిలిపిన క్రేన్‌లను, 2,700 ట్రక్కులను స్వాధీనం చేసుకోవాలని ఎన్‌జిటి ఆదేశించింది. గనిలో మైనింగ్ కార్యకలాపాలను అరికట్టేందుకు ఈ జరిమానాను విధించినట్లు పన్వాని తెలిపారు. గౌహతి హైకోర్టు మాజీ న్యాయమూర్తి నేతృత్వంలో ఏర్పాటు చేసిన కమిటీనే ఈ అంశంపై సుప్రీం తీర్పు ఇచ్చేంత వరకు కొనసాగుతుందని తెలిపారు. గత నెలలో రాష్ట్రంలోని జయంతియా హిల్స్ జిల్లాలో అక్రమంగా నిర్వహిస్తున్న బొగ్గుగనుల్లో వరదలు సంభవించడంతో 15మంది మైనర్లు అందులో చిక్కుకుపోయిన సంగతి తెలిసిందే.

బెంగళూరు సెంట్రల్ నుంచి ప్రకాశ్‌రాజ్

స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తానంటూ ట్వీట్

బెంగళూరు : దక్షిణాది ప్రముఖ నటుడు ప్రకాశ్‌రాజ్ తాను పోటీ చేయబోయే లోక్‌సభ స్థానంపై స్పష్టతనిచ్చాడు. కర్నాటకలోని బెంగళూరు సెంట్రల్ నియోజకవర్గం నుంచి ఇండిపెండెంట్ అభ్యర్థిగా పోటీచేస్తానని శనివారం ట్వీట్ చేశారు. తన రాజకీయరంగ ప్రవేశంపై సానుకూలంగా స్పందిస్తూ ప్రోత్సహిస్తున్న ప్రజలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. పోటీపై మరికొన్ని రోజుల్లో పూర్తి వివరాలను వెల్లడిస్తానని తెలిపారు. బెంగళూరు సెంట్రల్ పార్లమెంటు పరిధిలో వచ్చే ఎనిమిది నియోజకవర్గాలతో పాటు ఆయన ఫోటోను ప్రకాశ్ ట్విట్టర్‌లో పోస్ట్ చేశారు. చివరగా ‘సిటిజెన్స్ వాయిస్ ఇన్ పార్లమెంట్’ అనే హాష్‌ట్యాగ్‌తో ట్వీట్‌ను ముగించారు. ప్రస్తుతం బెంగళూరు సెంట్రల్ ఎంపీగా బీజేపీకి చెందిన పిసి మోహన్ ఉన్నారు.

లావాదేవీలన్నీ సక్రమమేనట ..!

అవినీతి నిరోధక కోర్టుకు వెల్లడించిన నీరవ్‌మోడీ

న్యూఢిల్లీ : పంజాబ్ నేషనల్ బ్యాంక్‌తో చేసిన లావాదేవీలన్నీ కూడా సక్రమైనవేనని ఆర్థిక నేరగాడు నీరవ్‌మోడీ వ్యాఖ్యానిస్తున్నారు. పంజాబ్ బ్యాంకుకు రూ. 13వేలకోట్లు ఎగవేసి విదేశాలకు పారిపోయిన నీరవ్‌ను పలాయన ఆర్థిక నేరస్తుల చట్టం, 2018 కింద పారిపోయిన ఆర్థిక నేరస్తుడిగా పేర్కొంటూ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ పిటిషన్ దాఖలు చేసిన సంగతి తెలిసిందే. కాగా, ఈ కేసుపై విచారణ చేపట్టిన అవినీతి నిరోధక కోర్టుకు నీరవ్‌మోడీ ఒక ప్రకటన ద్వారా శనివారం సమాధానమిచ్చారు. తాను ఎటువంటి తప్పులు చేయలేదని, తనపై కుంభకోణంగా ఆరోపించినది సక్రమమైన లావాదేవీలేనని పేర్కొన్నారు. భద్రతా కారణాల వల్ల భారత్‌కు రావడంలేదని అన్నారు. విదేశాలకు పారిపోయిన నీరవ్‌మోడీ, ఆయన మేనమామ మెహుల్ ఛోక్సీలకు సిబిఐ, ఇడి ఎన్ని సమన్లు పంపినా వారు భారత్‌కు తిరిగి రాలేదు. కాగా, ప్రస్తుతం మోడీ లండన్‌లో, ఛోక్సీ ఆంటిగ్వాలో నివాసమున్నారు. ఇటీవల ఇంటర్‌పోల్ కూడా ఛోక్సీకి రెడ్ కార్నర్ నోటీస్ జారీ చేసింది. రుణ రికవరీ ట్రిబ్యునల్ గత నెలలో నీరవ్‌మోడీ, అతని కుటుంబసభ్యులకు చెందిన రూ. ఏడువేల కోట్ల విలువైన వాటాలను బకాయిల కింద స్వాధీనం చేసుకుంది.

ఇసుక అక్రమ తవ్వకాల కేసు

ఢిల్లీ, యుపి ఉన్నతాధికారుల ఇళ్లల్లో సిబిఐ సోదాలు

న్యూఢిల్లీ : అక్రమ ఇసుక తవ్వకాల కేసులో సంబంధం ఉన్న పలువురు అధికారుల నివాసాల్లో కేంద్ర దర్యాప్తు సంస్థ సోదాలు నిర్వహించింది. ఉత్తరప్రదేశ్, ఢిల్లీలోని 12 ప్రాంతాల్లో ఈ దాడులు చేపట్టినట్లు అధికారులు శనివారం తెలిపారు. ఈ కేసుతో సంబంధం ఉన్న తెలంగాణా రాష్ట్రానికి చెందిన ఐఎఎస్ అధికారి బి.చంద్రకళ(అవినీతి పాల్పడిన అధికారులను నిలదీస్తూ సోషల్ మీడియాలో పేరుపొందారు)తో పాటు పలువురు ఉన్నతాధికారుల నివాసాల్లో 15 సభ్యుల సిబిఐ బృందం సోదాలు నిర్వహించిందని వెల్లడించారు. 2008లో సమాజ్‌వాదీ పార్టీ నేతృత్వంలోని అఖిలేష్ ప్రభుత్వం అధికారంలో ఉండగా ఆమె ఐఎఎస్ అధికారిగా వచ్చారు. చంద్రకళపై కూడా ఎఫ్‌ఐఆర్ నమోదు చేయడంతోనే లక్నోలోని ఆమె నివాసంలో దాడులు నిర్వహించారు. 2016లో అలహాబాద్ హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వుల మేరకు ఈ కేసును సిబిఐ దర్యాప్తు చేస్తోంది. ఉత్తరప్రదేశ్‌లోని జలౌన్, హమీర్‌పూర్, లక్నో, పలు జిల్లాలతో పాటు దేశ రాజధానిలో ఈ దాడులు చేపట్టామన్నారు.

అక్రమ ఇసుక మైనింగ్‌లో అఖిలేష్ పాత్రపై దర్యాప్తు : సిబిఐ

న్యూఢిల్లీ : అక్రమ ఇసుక మైనింగ్ కేసులో ఉత్తర ప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి అఖిలేష్ యాదవ్ పాత్రను పరిశీలించాల్సి ఉందని సిబిఐ శనివారం తెలిపింది. ఉత్తర ప్రదేశ్, ఢిల్లీలలో సోదాలు జరిపిన కొద్ది గంటల లోనే అఖిలేష్ పాత్రను పరిశీలిస్తామని సిబిఐ పేర్కొంది. అలహాబాద్ హై కోర్టు ఆదేశాల మేరకు సిబిఐ ఈ కేసు తీసుకుంది. అంతకుముందు శనివారం ఉదయం ఈ కేసుకు సంబంధించి ఐఎఎస్ ఆధికారి బి.చంద్రకళతో సహా పలువురు సీనియర్ అధికారుల నివాసాలలో సిబిఐ సోదాలు జరిపింది. జలౌన్, హమిర్‌పూర్, లక్నో, ఢిల్లీతో పాటు పలు జిల్లాలలో సిబిఐ సోదాలు జరిపింది. అక్రమ ఇసుక మైనింగ్ కేసులో అదిల్ ఖాన్, బి. చంద్రకళ, అప్పటి మైనింగ్ అధికారి మొయినుద్దీన్, సమాజ్‌వాది పార్టీ ఎమ్మెల్సీ రమేష్ మిశ్రా, ఆయన సోదరుడు, మైనింగ్ క్లర్క్ రామ్ ఆశ్రయ్ ప్రజాపతి, అంబికా తివారి (హమిర్‌పూర్), మైనింగ్ క్లర్క్ రామ్ అవతార్ సింగ్, ఆయన బంధువులు, సంజయ్ దీక్షిత్ అక్రమ మైనింగ్ కేసులో నిందితులు. ఈ కేసులో 2012-13 సంవత్సరంలో మంత్రులుగా ఉన్న వారి పాత్రను కూడా పరిశీలించనున్నట్లు సిబిఐ తెలిపింది.

మరోసారి కూటమి దిశగా కాంగ్రెస్, ఎన్‌సిపి

ముంబయి : మహారాష్ట్రలో వచ్చే లోక్‌సభ ఎన్నికలలో కాంగ్రెస్, నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (ఎన్‌సిపి)లు తిరిగి కూటమిగా ఏర్పడనున్నాయి. బిజెపి, శివసేన, ఎంఎన్‌ఎస్‌లను ఓడించడమే ప్రధాన అజెండాగా ప్రకటిస్తున్నాయి. రాష్ట్రంలోని 48 స్థానాలలో కాంగ్రెస్, ఎన్‌సిపిలు చెరో 20 స్థానాల నుండి పోటీ చేస్తామని, మిగిలిన ఎనిమిది స్థానాలను మిత్రపక్షాలకు కేటాయిస్తామని ఎన్‌సిపి నేత ప్రఫుల్ పటేల్ వెల్లడించారు. కాగా, 15 ఏళ్ల కూటమికి స్వస్తి పలికి 2014లో రెండు పార్టీలు విడిగా కాంగ్రెస్ 26 స్థానాలకు, ఎన్‌సిపి 21 స్థానాలలో పోటీ చేశాయి. మిగిలిన ఒక్క స్థానాన్ని మిత్రపక్షానికి కేటాయించాయి.

లోక్‌సభ ఎన్నికలు మందిరం చుట్టూ తిరగవు

రాహుల్ గాంధీ

న్యూఢిల్లీ : రానున్న లోక్‌సభ ఎన్నికలు రామ మందిరం నిర్మాణం చుట్టూ తిరగవని, ఉద్యోగాలు, రైతు సమస్యలు, రాఫెల్ ఒప్పందంలో అవినీతి తదితర సమస్యల చుట్టూ తిరుగుతాయని రాహుల్ గాంధీ అన్నారు. “2019 ఎన్నికల ఇతివృత్తం చాలా సాధారణమైనది. అది యువతకు ఉపాధి కల్పించడం. యువతకు ఉపాధి కల్పిస్తే అది మోడీ చేసిన ఆర్థిక విధ్వంసాన్ని సరిచేస్తుంది.” అని రాహుల్ గాంధీ అన్నారు. ఎన్నికల రెండో ఇతివృత్తం ప్రజలకు విద్య, ఆరోగ్య సంరక్షణలు అందించడమని ఆయన చెప్పారు. ఇక చివరిది పెద్ద ఎత్తున చోటు చేసుకున్న అవినీతి. రాఫెల్ ఒప్పందంలో రూ30 వేల కోట్ల దేశ ప్రజల సొమ్మును మోడీ తన మిత్రుడికి అప్పగించాడని రాహుల్ విమర్శించారు. ఆలయ నిర్మాణ అంశం రానున్న ఎన్నికలపై ప్రభావం చూపనున్నదా? అని అడిగిన ప్రశ్నకు రాహుల్ పైవిధంగా సమాధానం చెప్పారు.

రాఫెల్‌పై ప్రతి పౌరుడూ ప్రశ్నించాలి



రాఫెల్ ఒప్పందంలో జరిగిన అక్రమాలపై పార్లమెంట్‌లో తాను సంధించిన ప్రశ్నలనే ప్రధానిని, ఆయన మంత్రులను అడగాలని ప్రజలను కోరారు. రాఫెల్ ఒప్పందంలో జరిగిన అవినీతిపై రాహుల్ గాంధీ మోడీ ప్రభుత్వంపై తన దాడిని మరింత తీవ్రతరం చేశారు. “రాఫెల్ యుద్ధ విమానాల ఒప్పందంపై దాదాపు రెండు గంటల పాటు పార్లమెంట్‌లో మాట్లాడిన రక్షణ మంత్రి నిర్మలా సీతారామన్ నేను అడిగిన రెండు చిన్న ప్రశ్నలకు కూడా సమాధానం చెప్పలేక పోయారు” అని రాహుల్ గాంధీ ట్వీట్ చేశారు. రక్షణ మంత్రిని అడిగిన రెండు ప్రశ్నలతో కూడిన వీడియోను ఆయన పోస్ట్ చేశారు. రాఫెల్ యుద్ధ విమానాల కాంట్రాక్టును అనిల్ అంబానీకి ఎవరు ఇచ్చారు? ఈ ఒప్పందాన్ని మోడీ పక్కదోవ పట్టిస్తుంటే రక్షణ మంత్రిత్వ శాఖ అధికారులు అభ్యంతరాలు వ్యక్తం చేశారా? అని ఆయన ప్రశ్నించారు. ఈ ప్రశ్నలకు అవును, కాదు అని మాత్రమే సమాధానమివ్వాలని సీతారామన్‌ను కోరుతూ రాహుల్ ఆ వీడియోను ట్విట్టర్‌లో పోస్ట్ చేశారు.

“ఈ వీడియో చూసి అందరికి షేర్ చేయండి. ప్రధానిని, అతని మంత్రి వర్గ సభ్యులను ప్రతి పౌరుడూ ఈ ప్రశ్నలను అడిగేలా చేయండి” అని ఆ ట్వీట్‌లో రాహుల్ పేర్కొన్నారు. కాగా రాఫెల్ ఒప్పందంపై కాంగ్రెస్ తప్పుడు ప్రచారం చేస్తుందని రక్షణ మంత్రి నిర్మలా సీతారామన్ శుక్రవారం ఆరోపించారు.

కేరళలో బిజెపి, ఆరెస్సెస్ విధ్వంసం

- శబరిమలపై బిజెపి ద్వంద వైఖరి
- సిపిఐ జాతీయ కార్యదర్శి నారాయణ

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

కేరళలో బిజెపి, ఆరెస్సెస్‌లు కలిసి విధ్వంసం సృష్టిస్తున్నాయని సిపిఐ జాతీయ కార్యదర్శి నారాయణ విమర్శించారు. సమాన హక్కుల కోసం పోరాడే వారిపై దాడులు చేస్తున్నారన్నారు. శబరిమల విషయంలో సుప్రీం కోర్టు తీర్పును తమ పార్టీ స్వాగతిస్తోందని, ట్రిపుల్ తలాక్ విషయంలోనూ సుప్రీం తీర్పును ఆహ్వానిస్తోందని శనివారం నాడిక్కడ మీడియా సమావేశంలో అన్నారు. శబరిమలలో సమానత్వం కోసమే మహిళలు రోడ్డెక్కారన్నారు. శబరిమల ఆలయం విషయంలో కేంద్రం, బిజెపి ద్వంద్వ ప్రమాణాలు పాటిస్తోందని విమర్శించారు. కేరళలో ఆరెస్సెస్, బిజెపి, విశ్వహిందూ పరిషత్ కలిసి అరాచకం, అల్లర్లు సృష్టిస్తున్నాయని, దేశంలో బిజెపి వ్యతిరేక శక్తులన్నీ ఏకం కావాలని నారాయణ పిలుపు నిచ్చారు. రాఫెల్ ఒప్పందంలో ప్రధాని మోడినే బ్రోకర్ అని విమర్శించారు. రాఫెల్ అంశంపై జెపిసి వేయడానికి బిజెపికున్న అభ్యంతరం ఏంటని ప్రశ్నించారు. ప్రధాని మోడీ దేశంలోని అన్ని వ్యవస్థలను ధ్వంసం చేస్తున్నారని దుయ్యబట్టారు. కాంగ్రెస్‌ది రిటైల్ అవినీతి అయితే, బిజెపిది హోల్‌సేల్ అవినీతని నారాయణ దుయ్యబట్టారు. ఏపిలో చంద్రబాబును వ్యతిరేకిస్తున్నా, తెలంగాణలో మాత్రం టిడిపితో కలిసి పోరాటం చేస్తామని తెలిపారు. ప్రధాన మంత్రి అభ్యర్థి ఎవరన్నది అప్రస్తుతం అని పేర్కొన్నారు. బిజెపి విధానాలను నిరసిస్తూ కూటమి ఏర్పాటుకు కసరత్తులు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

వంద స్థానాల్లో గెలుస్తాం

ప్రజాశాంతి పార్టీ నేత కెఎ పాల్

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

రాష్ట్రంలో వంద స్థానాల్లో గెలుస్తామని, దేవుడి ఆశీర్వాదం తమకు ఉందని ప్రజాశాంతి పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు కెఎ పాల్ అన్నారు. శనివారం నాడిక్కడ ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ..అప్పుల రాష్ట్రాన్ని సంపన్న రాష్ట్రంగా మారుస్తామని, ఏడు లక్షల కోట్ల బడ్జెట్‌తో అందరికీ సంక్షేమాన్ని అందిస్తామని తెలిపారు. ఏపి అభివృద్ధి ప్రజాశాంతి పార్టీతోనే సాధ్యమన్నారు. అధికారంలోకి వచ్చిన మొదటి రోజే రైతులకు 50శాతం రుణమాఫీ చేస్తామని, చంద్రబాబు పరిపాలనలో విఫలమయ్యారన్నారు. 13 జిల్లాల్లో కార్యవర్గ సభ్యులతో జనవరి ఏడు నుంచి 12 వరకు సమావేశాలు నిర్వహిస్తామని తెలిపారు. అన్ని జిల్లాల్లో పార్టీ కార్యాలయాలు ప్రారంభించిన తరువాత, ఫిబ్రవరి నుంచి ప్రజా సభలు నిర్వహిస్తామన్నారు.

గల్ఫ్ దేశాల్లో భారత కార్మికుల భద్రత ప్రశ్నార్థకం

ఐదేళ్లలో 28వేల మందికిపైగా మృతి

ఢిల్లీ : గల్ఫ్ దేశాల్లో భారత కార్మికుల భద్రత ప్రశ్నార్థకంగా మారుతోంది. కేంద్రంలో బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే అధికారంలోకి వచ్చిన తర్వాత వారికి రక్షణ కల్పించడంలో మోడీ ప్రభుత్వం విఫలమైంది. 2014 నుంచి 2018 మధ్య గల్ఫ్ దేశాలైన బహ్రైన్, కువైట్, ఒమన్, కతర్, సౌదీ అరేబియా, యునైటెడ్ అరబ్ ఎమిరెట్స్(యూఏఈ)లలో 28,523 మంది భారత కార్మికులు మృతి చెందారని కేంద్ర విదేశీ వ్యవహారాల మంత్రిత్వశాఖ వెల్లడించింది. పాటియాల ఎంపీ ధరమ్‌వీరా గాంధీ అడిగిన ప్రశ్నకు ఆ శాఖ సహాయ మంత్రి వికె సింగ్ సమాధానమిచ్చారు. ఆయా దేశాల్లోని భారత ఎంబసీల వద్ద ఉన్న లెక్కల ప్రకారం.. భారత కార్మికులు అధికంగా మృతి చెందిన గల్ఫ్ దేశాల్లో సౌదీఅరేబియా ఉంది. ఇక్కడ 2014-18 మధ్య 12,828 మంది కార్మికులు మృతి చెందారు. ఆ తర్వాతి స్థానంలో యూఏఈ(7,877 మంది) ఉన్నది.

బిఎస్‌పి, ఎస్‌పి పొత్తు!

యుపిలో కాంగ్రెస్ ఒంటరి పోటీ

లక్నో : రానున్న సార్వత్రిక ఎన్నికల్లో బిజెపిని గద్దె దించేందుకు ఉత్తరప్రదేశ్‌లోని ప్రధాన ప్రతిపక్షాలైన సమాజ్‌వాదీ పార్టీ, బహుజన్ సమాజ్ పార్టీ పొత్తుకు సిద్ధమయ్యాయి. మహా కూటమికి ఏర్పాటుకై సమాజ్‌వాదీ పార్టీ నేత అఖిలేష్ యాదవ్, బహుజన్ సమాజ్ పార్టీ అధినేత్రి మాయావతి ఢిల్లీలో శుక్రవారం భేటీ అయ్యారు. కాంగ్రెస్ వైఖరితో విసిగిన రెండు పార్టీలు, తమ కూటమిలో ఆ పార్టీకి స్థానం కల్పించకూడదని యోచిస్తున్నట్లు సమాచారం. ఈ కూటమిలో చిన్న పార్టీలకు స్థానం కల్పించనున్నట్లు తెలుస్తోంది. సీట్ల సర్దుబాటుపై ఈ నెల 15 అనంతరం తుది నిర్ణయాన్ని తీసుకోనున్నారని సంబంధిత వర్గాలు తెలిపాయి. అజిత్‌సింగ్ నేతృత్వంలోని రాష్ట్రీయ లోక్ దళ్(ఆర్‌ఎల్‌డి)కు మూడు లోక్‌సభ స్థానాలకు కేటాయించ నున్నట్లు సమాచారం. కాగా కాంగ్రెస్‌కు మంచి పట్టున్న అమేథీ, రాయబరేలీలో మాత్రం తమ కూటమి అభ్యర్థులను పోటీకి నిలబెట్ట కూడదని ఇద్దరు నేతలు నిర్ణయం తీసుకున్నట్లు ఊహాగానాలు వినిపిస్తున్నాయి. కాగా, ఈ వార్తలు వస్తున్న నేపథ్యంలో తాము ఒంటరిగానే లోక్‌సభ ఎన్నికల్లో పోటీచేయాలని కాంగ్రెస్ భావిస్తోంది. పొత్తు లేకుండానే అభ్యర్థులు ఎన్నికల బరిలో దిగనున్నట్లు కాంగ్రెస్ రాజ్యసభ సభ్యుడు ఆర్‌ఎల్ పునియా వెల్లడించారు. ‘సంకీర్ణం ముఖ్యం కాదు. తమ పార్టీ కార్యకర్తలు సిద్ధంగా ఉన్నారు. కూటమిపై ఇప్పటి వరకు ఎవరితో చర్చించలేదు’ అని అన్నారు.



జ్యుడిషియల్ కస్టడీకి మైఖేల్ అప్పగింత

న్యూఢిల్లీ : అగస్టావెస్ట్‌ల్యాండ్ వివిఐపి హెలికాప్టర్ల కుంభకోణం కేసులో మధ్యవర్తిగా వ్యవహరించిన క్రిస్టియన్ మైఖేల్‌ను ఢిల్లీహైకోర్టు శనివారం జ్యుడిషియల్ కస్టడీకి అప్పగించింది. మనీలాండరింగ్ కేసులో మైఖేల్‌ను ప్రత్యేక న్యాయమూర్తి అరవింద్ కుమార్ ముందు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ హాజరుపరిచింది. ఈ కేసు విచారణ నిమిత్తం ఆయనను జ్యుడిషియల్ కస్టడీకి అప్పగించాలని ఇడి కోరింది. దీంతో ఆయనను వచ్చే నెల 26 వరకు జ్యుడిషియల్ కస్టడీకి అప్పగిస్తూ తీర్పునిచ్చింది. అదేవిధంగా సిబిఐ దాఖలు చేసిన మరో కేసులో వచ్చే నెల 27 వరకు న్యాయ విచారణకు అప్పగించింది. అగస్టా హెలికాప్టర్ల కొనుగోలు ఒప్పందంలో భాగంగా మధ్యవర్తిగా వ్యవహరించిన మైఖేల్ ముడుపులు తీసుకున్నారన్న ఆరోపణలపై ఇడి మనీలాండరింగ్ కేసు దాఖలు చేసింది. ఈ ఆరో పణలపై దుబాయి ప్రభుత్వం ఆయనను భారత్ కు అప్పగించగా గత నెల 22న ఇడి అరెస్టు చేసిన సంగతి తెలిసిందే. అనంతరం ఇడీ కస్టడీకి మైఖేల్‌ను ఢిల్లీ హైకోర్టు అప్పగించింది. అంతక ముందు సిబిఐ దాఖలు చేసిన మరో కేసులో ఆయనను తీహార్ జైలులో ఉంచారు.

నిందితులను కావాలనే వదిలేశం

బీహార్ పోలీసుల ప్రకటన

పాట్నా : బీహార్‌లోని అరారియా జిల్లాలో మూకదాడిలో మృతి చెందిన వ్యక్తిపై క్రిమినల్ రికార్డు ఉన్నందువలనే దాడి నిందితులను అరెస్ట్ చేయలేదని పోలీసులు తెలిపారు. గతవారం పశువులను దొంగిలిస్తున్నారనే ఆరోపణలతో ఒక వ్యక్తి (55)పై సుమారు 300 మందితో కూడిన గుంపు పాశవికంగా దాడి చేయడంతో మృతి చెందిన సంగతి తెలిసిందే. అయితే ఆ వ్యక్తిపై నేపాల్‌లో 16 కేసులు పెండింగ్‌లో ఉన్నందువల్లే ఇప్పటివరకు నిందితులను అరెస్టు చేయలేదని వారం అనంతరం పోలీసులు ప్రకటించడం గమనార్హం. కాగా, కాబూల్ మియాన్ (మృతి చెందిన వ్యక్తి)పై 1981లో ఒక కేసు నమోదైందని, ఇటీవలే అతని నివాసం నుండి ఒక నేపాల్ రైఫిల్‌ను కూడా స్వాధీనం చేసుకున్నట్లు అదనపు డైరెక్టర్ జనరల్ తెలిపారు.

అయితే అతనిపై 16 కేసులు ఉన్నా ఒక్కసారి కూడా ఎందుకు అరెస్ట్ చేయలేదన్న ప్రశ్నకు ఆ అధికారి స్పందించలేదు. కాగా, రాష్ట్ర ముఖ్యమంత్రి నితీష్‌కుమార్ ప్రభుత్వంలో శాంతి భద్రతలు క్షీణించాయని ఆర్‌జెడి నేత తేజస్వి యాదవ్ వ్యాఖ్యానించారు. ‘బీహార్‌ను నితీష్‌కుమార్ ‘దాడి- విహార్’గా మారుస్తున్నారని ఆయన విమర్శించారు. అలాగే నితీష్ ప్రభుత్వం నేరస్తులకు రక్షణగా పనిచేస్తుందని, జెడియును నిందితుల ఆశ్రయంగా మార్చారని మరో ట్వీట్‌లో పేర్కొన్నారు.

ప్రత్యేకం

రాజ్యాంగ విలువలకు పొంచివున్న ముప్పు

సివిల్ సర్వీసెస్ మాజీల ఆందోళన



న్యూఢిల్లీ : దేశంలో ప్రస్తుతం కొనసాగుతున్న మత చిచ్చు, చెలరేగుతున్న హింసాకాండ, దైనందిన కార్యక్రమంగా మారిన కొట్టిచంపుతున్న ఘటనల వంటి అంశాలతో రాజ్యాంగ విలువలకు పెను ముప్పుపొంచి వున్నదనిసివిల్ సర్వీసుకు చెందిన పలువురు మాజీ అధికారులు ఆందోళన వ్యక్తం చేశారు. రాజ్యాంగ విరుద్ధంగా వ్యవహరిస్తున్న యుపి ముఖ్యమంత్రి రాజీనామా చేయాలని వారు డిమాండ్ చేశారు. సుదీర్ఘకాలం రాజ్యాంగ పరిధిలో ప్రజలకు సేవలందించిన తాము ప్రభుత్వ పాలన, విధానాలు రాజ్యాంగ సూత్రాలకు విలువలకు లోబడి వుండాలన్న తమ భావనను వెల్లడించేందుకు ఇప్పుడు మీడియాకెక్కుతున్నామని వారు ఒక ప్రకటనలో వివరించారు. రాజ్యాంగ విలువలకు తూట్లు పొడుస్తున్నారని, ప్రజల సమస్యలపై తమ వాణిని వినిపించేందుకు చేస్తున్న ప్రయత్నాలను అణచివేస్తు న్నారన్న విషయాన్ని చెప్పేందుకు 2017 నుండి తాము పలుమార్లు మీడియా ముందుకు వచ్చామన్నారు. తమకు రాజ్యాంగ విలువల పరిరక్షణా లక్ష్యం తప్ప ఏ రాజకీయ పార్టీతోనూ సంబంధం లేదని, ఎటువంటి సిద్ధాంతాలను తాము బలపర్చటం లేదని వారు తమ ప్రకటనలో స్పష్టం చేశారు. ఇటీవలి కాలంలో రాజ్యాంగ విలువలకు వేగంగా తూట్లు పడుతున్న నేపథ్యంలో గడచిన 18 నెలల కాలంలో తాము తొమ్మిది సార్లు తమ భావాలను వినిపించటానికి ప్రయత్నించామని ఈ మాజీ అధికారులు వివరించారు. రాజ్యాంగానికి తూట్లు పొడవటానికి వేస్తున్న ప్రతి అడుగూ తమను అశాంతి వైపుకు నెడుతోందన్నారు. యుపిలోని బులంద్‌షహర్‌లో గత నెల 3వ తేదీన జరిగిన హింసాకాండ ఒక పోలీసు అధికారి దారుణ హత్యకు దారి తీసిందని వారు గుర్తు చేశారు. అల్లరి మూకలను నిలువరించేందుకు ఒంటరిగా ధైర్యంతో ముందడుగు వేసిన ఆ పోలీసు అధికారి హత్య ఇటీవలి కాలంలో రాజకీయాలు తీసుకుంటున్న ప్రమాదకరమైన మలుపులను కళ్లకు కడుతున్నాయన్నారు. దేశంలో అత్యధిక జనాభా వున్న యుపి రాష్ట్రంలో రాజ్యాంగ, నైతిక విలువలు, మానవీయ, సామాజిక క్రమం అపసవ్యంగా మారిపోయాయని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి మెజార్టీ పక్ష మూఢ విశ్వాసాల అజెండాకు ప్రధాన పూజారిగా మారిపోయారని, ఇప్పుడు ప్రతి అంశాన్నీ ఈ అజెండాతో ముడిపెడుతున్నారని వారు తెలిపారు. మత ఉద్రిక్తతలను ఉద్దేశపూర్వకంగా రెచ్చగొట్టే పరిస్థితులు కల్పించటం ఇదే తొలిసారి కాదని, యుపి చరిత్రలో ఇటువంటి సందర్భాలు పలుమార్లు పునరావృతమయ్యాయని వారు వివరించారు. అల్లరి మూక చేతుల్లో ఒక పోలీసు అధికారి మృత్యువాత పడటం ఇదే తొలిసారి కాదని, ముస్లిం వర్గాన్ని ఏకాకులను చేసేందుకు గోరక్షణ రాజకీయాలను ఉపయోగించటం కూడా ఇదే మొదటి సారి కాదని వారు గుర్తు చేశారు. ఈ ధోరణి సామాజిక వైరుధ్యాలను మరింత విస్తరిస్తోందని వారు స్పష్టం చేశారు. తాము ఇంతకు ముందు కూడా ఇటువంటి పరిస్థితులను చూశామని, అయితే ఒక రాజకీయ పార్టీ తన సొంత మెజార్టీతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసినపుడు తన రాజకీయ అజెండాను పక్కన పెట్టి రాజకీయంగా అందరికీ ఆమోదయోగ్యమైన పాలనను అందిస్తూ, బాధ్యతయుతంగా వ్యవహరించాల్సిన అవసరం వుందని వారు గుర్తుచేశారు. అయితే బులంద్‌షహర్ ఉదంతంలో చోటు చేసుకున్న ఘటనలను పరిశీలిస్తే అక్కడి యోగి ఆదిత్యనాథ్ సర్కారులో దౌర్జన్యాలు, బందిపోటు వాతావరణం ప్రధాన స్రవంతిలోకి వచ్చి మైనార్టీలను బెదిరించటానికి మాత్రమే కాక, తమను అడ్డుకునే పోలీసులు, అధికారులు ఎవరికైనా సరే తాము గుణపాఠం చెబుతామని హెచ్చరిస్తున్నాయన్నారు. ఈ ఉదంతంలో ఇన్స్‌పెక్టర్ సుబోధ్‌కుమార్ సింగ్ హత్యపై దర్యాప్తు ముగియక ముందే తుది నిర్ణయానికి రావటం తొందరపాటే అయినప్పటికీ, ఈ హత్యకు దారి తీసిన హింసాకాండ ముందస్తు ప్రణాళిక ప్రకారం, రాజకీయ శక్తుల ఉద్దేశపూర్వక జోక్యంతోనే చోటు చేసుకున్నదని చెప్పటానికి ఎటువంటి సందేహం అవసరం లేదని వారు స్పష్టం చేశారు. మెజార్టీ వర్గం కండబలం చూపి ఈ ప్రాంతంలో నివశిస్తున్న ముస్లిం మైనార్టీ వర్గాలను భయభ్రాంతులకు గురి చేస్తామన్న సందేశాన్ని పంపటమే ఈ ప్రయత్నం యొక్క ముఖ్య లక్ష్యమని తాము భావిస్తున్నామన్నారు. మైనార్టీ వర్గ ప్రజలు మెజార్టీ వర్గ బానిసలుగా వుండాలని, తమ సాంస్కృతిక నియంతృత్వాన్ని అంగీకరించాలని ఈ శక్తులు ఒత్తిడి పెంచుతున్నాయని వారు తమ ప్రకటనలో పేర్కొన్నారు. విధి నిర్వహణలో స్వేచ్ఛగా, స్వతంత్రంగా వ్యవహరించే అధికారిగా సింగ్ పేరుతెచ్చుకోవటం, అక్రమంగా గోహత్య జరిగిందంటూ అందిన ఫిర్యాదుపై స్పందించేందుకు ఆయన నిరాకరించటం వంటి అంశాలు మెజార్టీ వర్గ ఆదేశాలను ధిక్కరించినందుకే ఈ హత్య జరిగిందన్న విషయాన్ని నిర్ధారిస్తున్నాయని ఈ మాజీ అధికారులు తమ ప్రకటనలో పేర్కొన్నారు. స్థానిక బిజెపి, సంఘ్‌పరివార్ శక్తులు ఈ అధికారి హిందు వ్యతిరేక ధోరణితో వ్యవహరిస్తున్నారని, ఆయన్ను బదిలీ చేయాలని ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారని వారు వివరించారు. వీరి మతోన్మాద కుట్రలు తెలిసినప్పటికీ ఆయన ముందడుగు వేయాల్సిన పరిస్థితిలో చిక్కుకుపోయి ప్రాణాలు కోల్పోయాడన్నారు. ఈ హింసాకాండనంతటినీ కేవలం ఒక సాధారణ ఘటనగా అభివర్ణిస్తూ ప్రజలను తప్పుదారి పట్టించేందుకు ప్రయిత్నించిన ముఖ్యమంత్రి పోలీసు అధికారి హత్య అనాలోచితంగా జరిగిందంటు న్నారని, వాస్తవానికి ఇది విచారణను తప్పుదారి పట్టించటమేనని వారు స్పష్టం చేశారు. హింసాకాండకు బాధ్యులను అరెస్ట్ చేయాలని ఆదేశించటానికి బదులు ఆయన గోహత్యకు పాల్పడిన వారిని అరెస్ట్ చేయాలని ఆదేశించారని గుర్తు చేశారు. అయితే ఈ రెండు నేరాలను కలిపి దర్యాప్తు చేస్తే తప్ప నిజానిజాలు బయటపడవని ప్రకటించటం ద్వారా పోలీసు అధికారులు పోలీసు అధికారి హత్యను, ఒక ఆవును చంపటాన్ని సమానంగా పరిగణిస్తు న్నారని స్పష్టమవుతున్నదని వారు చెప్పారు. మన దేశ చరిత్రలో గతంలో ఎన్నడూ లేని రీతిలో విద్వేషం, వెలి, విభజన రాజకీయాలు ప్రజల మధ్య కొనసాగుతున్న సామరస్య వాతావరణాన్ని కలుషితం చేస్తున్నాయన్నారు. అంతేకాక గతంలో ఎన్నడూ లేని రీతిలో ఇప్పుడు మైనార్టీ వర్గ ప్రజలపై అధికారంలో వున్న శక్తులు విద్వేష దాడులకు పాల్పడుతున్నాయని వారు తమ ప్రకటనలో పేర్కొన్నారు. హింసకు రాజకీయ, సామాజిక అనుమతి లభిస్తుండటంతో హింసకు పాల్పడుతున్న కుట్రదారులకు రాచమర్యాదలు, బాధితులకు వేధింపులు, శిక్షలు లభిస్తున్నాయని వారు వివరించారు. ఈ కీలక పరిస్థితుల్లో తాము మౌనంగా వుండలేమన్న మాజీ అధికారులు విద్వేష, విభజన రాజకీయాలపై ఐక్యంగా తిరగబడాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ ప్రకటనపై సివిల్ సర్వీసుల మాజీ అధికారులు ఎస్‌పి ఆంబ్రోస్, జెజె బజాజ్, ఎన్ బాల భాస్కర్, విప్పల బాలచంద్రన్, గోపాలన్ బాలగోపాల్, చంద్రశేఖర్ బాలకృష్ణన్, మీరన్ సి బోర్వాన్కర్, రవి బుద్ధిరాజా వంటి మొత్తం 75 మంది సంతకాలు చేశారు.

చిలీలో కార్చిచ్చు 8 మంది మృతి

శాంటియాగో : దక్షిణ అమెరికా దేశమైన చిలీలో కార్చిచ్చు దావానలంలా వ్యాపిస్తున్నది. మంటల్లో చిక్కుకొని 8 మంది మృతిచెందగా, వందలాది మంది గల్లంతయ్యారు. వందలాది ఇండ్లు అగ్నికి ఆహుతయ్యాయి. వేలాది మంది నిరాశ్రయులయ్యారు. కార్చిచ్చు చెలరేగిన ప్రాంతంలో నివసిస్తున్న ప్రజలు తక్షణమే సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లాలని అధికారులు ఆదేశాలు జారీ చేశారు. వోల్పారైసో ప్రాంతంలో భారీ ఆస్తినష్టం సంభవించిందన్నారు. లిమాచే నగర మేయర్ కార్చిచ్చు వ్యాపించిన ప్రాంతాల్లో పర్యటించారు. మృతుల కుటుంబాలను ప్రగాఢ సానుభూతి తెలిపారు. బాధిత కుటుంబాలను ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. ఓ హిగ్గిన్స్ దక్షిణ ప్రాంతంలోని 2600 హెక్టార్ల అటవీ ప్రాంతం అగ్నికి ఆహుతైందని అన్నారు. అగ్నిమాపక బృందాలు మంటలను ఆర్పేందుకు ప్రయత్నిస్తున్నాయని చెప్పారు. మంటలు దట్టంగా వ్యాపించడంతో సహాయక చర్యలకు అంతరాయం ఏర్పడిందన్నారు.



కాల్పులు

కాలిఫోర్నియా లోని బౌలింగ్ అలై ప్రాంతంలో రెండు గ్రూపుల మధ్య తలెత్తిన ఘర్షణ కాల్పులకు దారి తీసింది. ఈ ఘటనలో ముగ్గురు చనిపోయారు. మరో నలుగురు గాయపడ్డారు. క్షతగాత్రులను ఆసుపత్రికి తరలిస్తున్న దృశ్యం.

కాలిఫోర్నియాలో కాల్పులు

ముగ్గురు మృతి, నలుగురికి గాయాలు

కాలిఫోర్నియా : శుక్రవారం అర్ధ రాత్రి కాలిఫోర్నియా లోని బౌలింగ్ అలై ప్రాంతంలో రెండు గ్రూపుల మధ్య తలెత్తిన ఘర్షణ కాల్పులకు దారి తీసింది. ఈ ఘటనలో ముగ్గురు చనిపోయారు. మరో నలుగురు గాయపడ్డారు. టారెన్స్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం బౌలింగ్ వంటి ఆటలు ఆడుకునే గాబెల్ హౌస్ బౌల్ వద్ద రెండు పెద్ద గ్రూపుల మధ్య తలెత్తిన ఘర్షణ చిలికిచిలికి గాలి వాన అయినట్లు కాల్పులకు దారి తీసిందని పోలీసులు తెలిపారు. సంఘటనా స్థలంలో ముగ్గురి మృతదేహాలు కనిపించాయని, మరో నలుగురు గాయపడ్డారని పోలీసులు తెలిపారు. కోస్తా తీర ప్రాంత నగరమైన టారెన్స్ లాస్‌ఏంజెల్స్‌కు 30కిలోమీటర్ల దూరంలో వుంది.కాల్పులకు దారి తీసిన పరిస్థితులేంటనేది ఇదమిత్థంగా తెలియరాలేదు.



ద్వైపాక్షిక సంబంధాలు మరింత బలోపేతం

చైనా, ఇథియోపియా నిర్ణయం

అడిస్ అబాబా (ఇథియోపియా) : ఇరుదేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలను మరింత పటిష్టపరుచుకోవాలని చైనా, ఇథియోపియాలు నిర్ణయించాయి. ఇథియోపియా అధ్యక్షురాలు సాహ్లే జెవ్డా ఇక్కడ చైనా స్టేట్ కౌన్సిలర్, విదేశాంగ మంత్రి వాంగ్ యితో భేటీ అయ్యారు. చైనాతో అన్ని రంగాల్లో సహకారాన్ని మరింత పటిష్టపరుచుకునేందుకు ఇథియోపియా ప్రభుత్వం కట్టుబడి వుందని ఇథియోపియా అధ్యక్ష భవనంలో జరిగిన సమావేశంలో సాహ్లే చెప్పారు. బెల్ట్ అండ్ రోడ్ ఇనీషియేటివ్ ప్రాజెక్టు కింద సహకారం విస్తరించేందుకు, క్రియాశీలంగా మద్దతు ఇచ్చేందుకు ఇథియోపియా సిద్ధంగా వుందని ఆమె స్పష్టం చేశారు. ఏకపక్షవాదం వంటి చర్యల వల్ల కలిగే పరిణామాల నుండి ప్రపంచ దేశాలను కాపాడడంలో ఇథియోపియా, చైనాలకు ఏకాభిప్రాయం, ఉమ్మడి ప్రయోజనాలు వున్నాయని అన్నారు. ఐక్యరాజ్య సమితిలో, ఇతర అంతర్జాతీయ వేదికలపై సహకారం, సమన్వయం పెంపు కోసం ఇరు దేశాలు కృషి చేస్తాయన్నారు. అనంతరం వాంగ్ మాట్లాడుతూ, ఈ రెండు దేశాల అభివృద్ధి మొత్తంగా అభివృద్ధి చెందుతున్న దేశాలను బలోపేతం చేస్తుందని అన్నారు. ప్రపంచ శాంతి, సుస్థిరతలను పరిరక్షించే సామర్థ్యాన్ని పటిష్టపరుస్తుం దన్నారు. ఇథియోపియాకు దీర్ఘకాల, విశ్వసనీయ భాగస్వామిగా చైనా వుంటుందని వాంగ్ చెప్పారు.

పోరుకు సన్నద్ధంగా ఉండాలి

సాయుధ బలగాలకు జిన్‌పింగ్ ఆదేశం



బీజింగ్ : సాయుధ బలగాలు పోరుకు సదా సిద్ధంగా ఉండాలని చైనా అధ్యక్షుడు, సెంట్రల్ మిలిటరీ కమిషన్ చైర్మన్ అయిన సీ జిన్‌పింగ్ ఆదేశించారు. శుక్రవారం సైనికాధికారుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఎలాంటి పరిస్థితినైనా తిప్పికొట్టేందుకు సైన్యం సిద్ధంగా ఉండాలన్నారు. దక్షిణ చైనా సముద్రంలో ప్రాదేశిక వివాదాలు, తైవాన్ హోదా, వాణిజ్యం వంటి అంశాల్లో విభేదాలు నెలకొన్న నేపథ్యంలో చైనా సాయుధ బలగాలు నిరంతరం అప్రమత్తంగా వుండాల్సిన అవసరముందన్నారు. పెను మార్పులు, అనూహ్యమైన ముప్పులు పొంచివున్న నేటి పరిస్థితుల్లో సాయుధబలగాల సన్నద్ధత చాలా కీలకమని జిన్‌పింగ్ చెప్పారు. ప్రపంచంలో శర వేగంగా మార్పులు చోటుచేసుకుంటున్నాయని, చైనా ఇప్పటికీ అభివృద్ధికి సంబంధించి వ్యూహాత్మకంగా కీలకమైన దశలో వుందని ఆయన అన్నారు. దేశ భద్రత, అభివృద్ధి గురించి సైన్యం పూర్తి అవగాహనతో వుండాలని ఆయన కోరారు. పీపుల్స్ లిబరేషన్ ఆర్మీ, సాయుధ పోలీస్ దళాల పోరాట పటిమను పెంచేందుకు, వాటి పోరాట సన్నద్ధతను పెంపొందించుకోవాలన్నారు.

7, 8 తేదీల్లో అమెరికాతో వాణిజ్య చర్చలు

ఈ నెల 7, 8 తేదీల్లో బీజింగ్‌లో అమెరికాతో చర్చలు ప్రారంభమవుతాయన్న వార్తలను చైనా నిర్ధారించింది. ఇరు దేశాల మధ్య నెలకొన్న ఆర్థిక, వాణిజ్య వివాదాలకు పరస్పరం ఆమోదయోగ్యమైన పరిష్కారాలను కనుగొనేందుకు ఈ చర్చలు ఉద్దేశించబడ్డాయి. ఉప మంత్రుల స్థాయిలో జరగనున్న ఈ సమావేశం తేదీ, స్థలం, లక్ష్యాలను ఇరుపక్షాలు నిర్ధారించుకున్నాయని వాణిజ్య మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. అమెరికా ప్రతినిధి బృందానికి డిప్యూటీ వాణిజ్య ప్రతినిధి జెఫరీ గెరిస్ నాయకత్వం వహించనున్నారు. అర్జెంటీనాలో జి-7 సమావేశాల సందర్భంగా ట్రంప్, జిన్‌పింగ్ మధ్య కుదిరిన అంగీకారం మేరకు ఇరు దేశాల ప్రతినిధులతో ఈ నిర్మాణాత్మక చర్చలు జరగనున్నాయి.

బోగస్ బ్యాలెట్లు, బూటకపు ఎన్నికలు

బంగ్లాదేశ్ కమ్యూనిస్టు పార్టీ విమర్శ

ఢాకా : ఇటీవల బంగ్లాదేశ్‌లో జరిగిన పదకొండవ పార్లమెంటరీ ఎన్నికలను ఫార్స్ అని బంగ్లాదేశ్ కమ్యూనిస్టు పార్టీ (సిపిబి)విమర్శించింది. "బోగస్ బ్యాలెట్లతో జరిగిన బూటకపు ఎన్నికలు" ఇవి అని అది వ్యాఖ్యానించింది. ముందుగానే నిర్ధారించిన ఈ ఎన్నికల ఫలితాలను ప్రజలు తిరస్కరించాలని సిపిబి కోరింది.

సిపిబి అధ్యక్షుడు ముజాహిదుల్ ఇస్లామ్ సలేమ్, ప్రధాన కార్యదర్శి షా ఆలమ్ డిసెంబరు 30న జరిగిన పత్రికా గోష్టిలో మాట్లాడుతూ, తప్పుడు మార్గంలో విజయం సాధించేందుకు ప్రభుత్వం ఒక పథకం ప్రకారం అక్రమాలకు పాల్పడిందని విమర్శించారు. ఈ ఎన్నికలతో ప్రజాస్వామ్య పునాదులను ధ్వంసం చేశారని వ్యాఖ్యానించారు. ఇవి బూటకపు ఎన్నికలని, ఎంపీలుగా ఎన్నికైనవారు బూటకపు ప్రతినిధులని పేర్కొన్నారు. ప్రతిపక్ష అభ్యర్థులపై హింసాత్మకంగా దాడులు జరిపించడం, వారిని అడ్డగించడం వంటి చర్యలతో ప్రభుత్వం ముందుగానే ప్రజల్లో ఒక రకమైన భయాన్ని కల్పించిందన్నారు. ఏకపక్షంగా ఎన్నికలు నిర్వహించేందుకు ఎన్నికల కమిషన్‌ను, ప్రభుత్వ యంత్రాంగాన్ని పావులుగా వాడుకుందని విమర్శించారు. పలు పోలింగ్ కేంద్రాల్లో ముందు రోజు రాత్రే ఓట్లు వేసేశారని, పోలింగ్ ప్రారంభమైన గంట తర్వాత ఈ సమాచారం వెలుగుచూసిందని వెల్లడించారు. ప్రతిపక్షాల పోలింగ్ ఏజెంట్లను బలవంతంగా అక్కడ నుండి పంపించేశారని చెప్పారు. ఈ బూటకపు ఎన్నికలను రద్దు చేసి, ఆపద్ధర్మ ప్రభుత్వం కింద తిరిగి తాజాగా ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు.

'షట్‌డౌన్' పరిష్కారానికి ఏళ్లు పట్టొచ్చు : ట్రంప్



వాషింగ్టన్ : అమెరికా ప్రభుత్వ'షట్‌డౌన్' పరిష్కారానికి నెలలు, ఏళ్లు పట్టవచ్చని అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ బెదిరించారు. మెక్సికో సరిహద్దుల్లో నిర్మించదలచిన గోడకు అవసరమైన 560 కోట్ల డాలర్ల నిధులు కేటాయించక పోతే జాతీయ అత్యవసర పరిస్థితిని ప్రకటించి అయినా సరే ప్రతినిధుల సభ ఆమోదంతో పనిలేకుండానే గోడను నిర్మిస్తానని అన్నారు. వైట్‌హౌస్‌లోని సిట్యుయేషన్ రూమ్‌లో దాదాపు రెండు గంటల పాటు ట్రంప్, డెమోక్రాట్ల నేతలు సమావేశమయ్యారు. రెండు వారాలుగా కొనసాగుతున్న ప్రతిష్టంభనను తొలగించేందుకు ఎలాంటి అంగీకారం కుదరకుండానే సమావేశం ముగిసింది. ట్రంప్ వైఖరి వల్ల చర్చలు విఫలమయ్యాయని డెమోక్రాట్లు, ఫలవంతంగానే సాగాయని రిపబ్లికన్ నేతలు పరస్పర విరుద్ధమైన ప్రకటనలు చేశారు. డెమోక్రాట్లతో ఈ వారాంతంలో చర్చించాలని ఉపాధ్యక్షుడు మైక్ పెన్స్‌ను కోరినట్లు తెలిపారు.

పాలస్తీనాలో ప్రజాస్వామ్య కూటమి

ఐదు ప్రగతిశీల పార్టీలతో ఏర్పాటు

రామల్లా : పాలస్తీనాలో ఐదు ప్రగతిశీల వామపక్ష పార్టీలు జట్టు కట్టాయి. ఐక్య పాలస్తీనాను సాధించి ప్రజాస్వామ్యాన్ని నెలకొల్పే ధ్యేయంతో ఈ ఐదు వామపక్ష పార్టీలు అడుగులు ముందుకు వేశాయి. పాలస్తీనా పీపుల్స్ పార్టీ, పాపులర్ ఫ్రంట్ ఫర్ ది లిబరేషన్ ఆఫ్ పాలస్తీనా, డెమోక్రటిక్ ఫ్రంట్ ఫర్ ది పాలస్తీనా పీపుల్, పిఎన్ఐఎంబి, పాలస్తీనా డెమోక్రటిక్ యూనియన్ ఏకతాటిపైకి వచ్చాయి. ఈ ప్రజాస్వామ్య కూటమి పాలస్తీనా లిబరేషన్ ఆర్గనైజేషన్ నియమ నిబంధనలతో పనిచేస్తుంది. ఇజ్రాయేల్ దురాక్రమణను, వలసరాజ్య స్థాపనను, ప్రజాస్వామ్య వ్యతిరేక శక్తులను అడ్డుకోవడం, జాతీయ ఆర్థిక స్థితిని దెబ్బతీసే ఇంధన విధానాన్ని తిప్పికొట్టే లక్ష్యంగా ఈ కూటమి పని చేస్తుంది. ఇజ్రాయేల్ దురాక్రమణలతో పాలస్తీనా దివాళా తీసే పరిస్థితి ఏర్పడుతుందని ఈ వామపక్ష పార్టీల నేతలు అభిప్రాయపడ్డారు. గాజ, వెస్ట్‌బ్యాంకును ఏకం చేసి పౌరుల సామాజిక భద్రత, సామాజిక న్యాయం, ఆర్థిక హక్కులు, భావ స్వేచ్ఛను రక్షించే దిశగా సరికొత్త రాజకీయాలు అవసరమని నేతలు అభిప్రాయం వ్యక్తం చేశారు. 2006 నుంచి పాలస్తీనాలో ఎన్నికలు జరగడం లేదు. మరోవైపు అమెరికా దాడులు, ఇంకో వైపు జెరుసలేంను స్వాధీనం చేసుకుని ఇజ్రాయేల్ యూదీకరణ చేస్తూ వలస రాజ్య స్థాపనకు పన్నాగాలు రచిస్తున్న నేపథ్యంలో పాలస్తీనా ఏకీకరణ అత్యవసరమని వామపక్ష పార్టీలు భావించాయి.

మొదటి పేజీ తరువాయి

నరసరావుపేట యువ జడ్జి ఐశ్వర్య హఠాన్మరణం

కాయాన్ని స్పీకర్ కోడెల శివప్రసాదరావు, ఎమ్మెల్యే శ్రీనివాసరెడ్డి, పలువురు జడ్జీలు సందర్శించి నివాళులర్పించారు. అనంతరం భౌతిక కాయాన్ని చిత్తూరు జిల్లా చంద్రగిరికి తరలించారు. ఇదిలా ఉండగా నరసరావుపేటలోనే ప్రాథమిక విద్యను పూర్తి చేసిన ఐశ్వర్య విజయవాడలోని సిద్ధార్థ కళాశాలలో ఎంఎల్ చేశారు. మొదటిసారి పిడుగురాళ్లలో న్యాయమూర్తిగా పని చేసిన ఆమె కొద్దికాలానికి బదిలీపై నరసరావుపేటకు వచ్చారు. స్థానిక కోర్టు ప్రాంగణంలోని బంగ్లాలో తన తల్లి, తమ్ముడుతో కలిసి ఉంటున్నారు. ఐశ్వర్య తండ్రి పివి రమణయ్య నరసరావుపేట ప్రిన్సిపల్ సీనియర్ సివిల్‌జడ్జిగా, జిల్లా జడ్జిగా పని చేశారు. ఉద్యోగ విరమణానంతరం నాలుగేళ్ల కిందటే మృతి చెందారు. వీరి స్వస్థలం నెల్లూరు జిల్లా కాగా చంద్రగిరిలో స్థిరపడ్డారు.

ఆగని హింస

జరుగుతున్నాయి. ఇదిలా వుండగా రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితిపై నివేదిక తక్షణమే నివేదిక పంపాలని కేంద్ర హోంశాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఇది బిజెపి కుట్ర పూరిత రాజకీయాలకు నిదర్శనమన్న వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి.

శుక్రవారం రాత్రి పొద్దుపోయిన తరువాత పలు ప్రాంతాల్లో సిపిఎం నేతల ఇళ్లపై బాంబుదాడులు జరిగాయి. తలస్సెరి సిపిఎం ఎమ్మెల్యే ఎఎన్ షమ్సీర్ నివాసంపై బాంబుదాడి జరిగింది. ఈ దాడి జరిగిన సమయంలో షమ్సీర్ ఇంట్లో లేరు. ఆయితే, అయన నివాసంలోని ఫర్నిచర్ తదితర సామాగ్రి ధ్వంసమైంది. అదూర్‌లోని సిపిఎం స్థానికనేత నివాసం పైన, రెండు దుకాణాలపైన కూడా ఆర్‌ఎస్ఎస్ మూకలు బాంబు దాడులకు దిగాయి. ఈ దాడుల్లో ఏడుగురికి గాయాలయ్యాయి. కన్నూర్ జిల్లా సిపిఎం మాజీ కార్యదర్శి పి. శశి నివాసంపై శుక్రవారం రాత్రి 11 గంటల సమయంలో దుండగులు నాటు బాంబులతో దాడి చేశారు. ఈ దాడిలో ఇంటి కిటికీ అద్దాలు పగిలిపోయాయి.

ఆ సమయంలో శశి భార్య, కుమారుడు ఇంట్లో ఉన్నారు. రాష్ట్రంలో కొనసాగుతున్న హింసాత్మక సంఘటనలకు సంబంధించి 1,718 మందిని పోలీసులు అరెస్టు చేశారు. మరో 1,009 మందిని ముందస్తు జాగ్రత్త చర్యగా అదుపులోకి తీసుకున్నారు. 1,018 మందిపై కేసులు నమోదయ్యాయి. హింసాత్మక సంఘటనలను నిరోధించేందుకు కన్నూర్, కోజికోడ్ జిల్లాల్లో భద్రతను మరింత పటిష్టం చేశామని రాష్ట్ర డిజిపి లోక్‌నాథ్ బెహరా తెలిపారు. శాంతి భద్రతలను అదుపులోకి తెచ్చేందుకు 'ఆపరేషన్ బ్రోకెన్ విండో'ను ప్రారంభించినట్లు తెలిపారు.

కొనసాగుతున్న ఉద్రిక్తత

ఆర్‌ఎస్ఎస్, బిజెపి కార్యకర్తలు గత మూడు రోజులుగా చేస్తున్న హింసాకాండతో కేరళలో ఉద్రిక్తత కొనసాగుతోంది. హింసకు దిగుతున్న వారిపై పలు ప్రాంతాల్లో ప్రతిఘటన కూడా చోటుచేసుకుంటోంది. మల్లపురం, కోజికోడ్ వంటి చోట్ల బిజెపి కార్యకర్తలను స్థానిక ప్రజలు నిలువరించినట్లు వార్తలు వస్తున్నాయి. తలస్సెరిలో బిజెపి రాజ్యసభ సభ్యుడు వి. మురళీధరన్ పూర్వీకులకు చెందిన నివాసంపై గుర్తుతెలియని వ్యక్తులు బాంబు వేశారు. తలస్సెరి బిజెపి మండలం అధ్యక్షుడు సుమేష్ నివాసంపై కూడా బాంబు దాడి జరిగింది.

త్వరలోనే అదుపులోకి ...

రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితిపై నివేదిక అందచేయాలని కేరళ ప్రభుత్వాన్ని కోరిన కేంద్ర హోంశాఖ మత్రి రాజ్‌నాథ్‌సింగ్ పరిస్థితులు త్వరలోనే అదుపులోకి వస్తాయని వ్యాఖ్యానించారు. న్యూఢిల్లీలో శనివారం మీడియాతో మాట్లాడిన ఆయన ఈ వ్యాఖ్య చేశారు.

ఆర్‌ఎస్ఎస్ శాంతి చర్చలను అడ్డుకొంటోంది : సిపిఐ(ఎం) కేరళ రాష్ట్ర కార్యదర్శి

సిపిఐ(ఎం) కేరళ రాష్ట్ర కార్యదర్శి కొడియెరి బాలకృష్ణన్ మాట్లాడుతూ ఆరెస్సెస్ ఘర్షణలను ప్రేరేపిస్తూ శాంతి చర్చలను అడ్డుకునే ప్రయత్నాలు చేస్తున్నదని విమర్శించారు. రాష్ట్రంలో హింసాత్మక ప్రాంతాలలో శాంతిని పునరుద్ధరించే దిశగా అధికార పార్టీ ప్రయత్నిస్తున్నదని చెప్పారు.

60 శాతం కొత్త వారికే అవకాశం

- యువతే నాకు వెన్నెముక
- ఓపిక లేని నాయకుల వల్లే ప్రజారాజ్యం అవకాశాన్ని కోల్పోయింది
- జనసేన అధ్యక్షులు పవన్ కళ్యాణ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

వచ్చే ఎన్నికల్లో 60 శాతం కొత్తవారికే పోటీ చేసే అవకాశం కల్పిస్తామని జనసేన అధ్యక్షులు పవన్ కళ్యాణ్ అన్నారు. ప్రకాశం జిల్లాలో ఈ అంశాన్ని తప్పకుండా పాటిస్తామన్నారు. విజయవాడలోని జనసేన రాష్ట్ర కార్యాలయంలో ప్రకాశం, చిత్తూరు జిల్లాల నాయకులతో విడివిడిగా సమీక్షా సమావేశాలను గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా పవన్ మాట్లాడుతూ సమస్యలు ఎక్కడుంటే అక్కడ జనసేన అండగా ఉంటే ప్రజలు ఆదరిస్తారన్నారు. నాకు నటన ఇచ్చిన సంతృప్తి కంటే, ప్రజా సమస్యలు పరిష్కరించినప్పుడే ఎక్కువ సంతృప్తి లభించిందన్నారు. భావజాలం లేని పార్టీలు రాజ్యాలు ఏలుతున్న ప్రస్తుత తరుణంలో కొత్తగా పార్టీ పెట్టడానికి సమయం ఆసన్నమైందని భావించానన్నారు. కళాశాలల నుంచి పట్టాలు తీసుకోకపోయినా, పోలిటికల్ సైన్స్, పబ్లిక్ పాలసీలు, దేశంలో కులాలు వాటి ప్రభావం, అంబేద్కరిజం వంటి వాటిని సంపూర్ణంగా అర్థం చేసుకున్నానని చెప్పారు. పీఆర్పీ ఆవిర్భావానికి బలమైన పాత్ర పోషించిన వారిలో తాను కూడా ఒకడినని చెప్పారు. ప్రజారాజ్యంతో సామాజిక న్యాయం జరిగి ఉండేదని, ఓపిక లేని నాయకులు పార్టీలో ఉండటం వల్లే ఆ అవకాశం చేజారిందన్నారు. అన్ని పార్టీల నాయకులూ పెట్టుబడికి అనుగుణంగా, ప్రజలకు వ్యతిరేకంగా వ్యవహరించేవారేనన్నారు. యువతను నమ్మి పార్టీని పెట్టామన్నారు. వారే తన వెన్నుముక అనీ, దీర్ఘకాలిక ప్రయోజనాల కోసం ఆచితూచి అడుగులు వేయాలని సూచించారు. రాజకీయాల్లో తనకు కాన్షీరాం స్ఫూర్తి అని, రాజకీయాలు నడపడానికి డబ్బు అవసరం లేదని రుజువు చేసిన మహానేత ఆయన అని అన్నారు. జనసేన ప్రారంభదశలోనే ఉందని, సంస్థాగత పటిష్టతకు కొంత సమయం పడుతుందని అన్నారు. వాణిజ్యపరమైన రాజకీయాలను ఆపకపోతే సామాన్యుల జీవితాలు డబ్బున్న వారి చేతుల్లోకి వెళ్లిపోతాయన్నారు. రిస్క్ చేయకపోతే కొత్తదనం రాదని, అటువంటి రిస్క్‌నే జనసేన చేస్తోందని చెప్పారు.

వచ్చే ఎన్నికలు పార్టీకి మొదటి లేక చివరి ఎన్నికలు కాదని, ఇది ప్రారంభం మాత్రమేనని అన్నారు. భవిష్యత్తు జనసేనదేనని ధీమా వ్యక్తం చేశారు. రాజకీయాలను ఇష్టంతో చేస్తానని, దీనిలో సహనం, ఓర్పు ఉంటాయన్నారు. తన అండతో గెలిచిన టిడిపి, ప్రతిపక్షంలోని వైసిపి జనసేనను రాజకీయ పార్టీగా గుర్తించడానికి కూడా ఇష్టపడని రోజులు ఉన్నాయన్నారు. అవే పార్టీలు ఇప్పుడు జనసేన తమతో కలిసి వస్తోందని ప్రచారం చేసుకుంటున్నాయన్నారు.

కృష్ణా కరకట్ట విస్తరణ

- నాలుగు లేన్ల రోడ్డు
- రూ.1181.92 కోట్లు ఖర్చు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాజధాని ప్రాంతానికి వెళ్లే కృష్ణానది కరకట్టను వెడల్పు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీనికోసం రూ.1181 కోట్లు ఖర్చవుతాయని అంచనా వేసింది. సీడ్ యాక్సెస్ రోడ్డును 16వ నెంబరు జాతీయ రహదారికి పొడిగించడం సాధ్యం కాకపోవడంతో దీనికి అనుగుణంగా కరకట్టను విస్తరించాలని నిర్ణయించింది. దీనిపై అమరావతి డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ల బోర్డు నిర్ణయం తీసుకుంది. డిసెంబర్లో జరిగిన 19వ బోర్డు సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. ముఖ్యంగా జాతీయ రహదారి నుండి సీడ్ యాక్సెస్‌రోడ్డును కలుపుతూ 25 మీటర్ల నిడివితో నాలుగు లేన్లు వేసేందుకు అవకాశం ఉందని ఇరిగేషన్ శాఖ ఇచ్చిన నివేదిక ఆధారంగా నాలుగులేన్ల రోడ్లు వేయాలని నిర్ణయించారు. దీనిపై ఆర్వీ అసోసియేట్స్, జిఐఐసి సంయుక్తంగా ప్లాను రూపొందించాయి. నిర్మాణఖర్చు.901.34 కోట్లు అవుతుండగా, సీనరేజీ ఛార్జీలు కలుపుకుంటే రూ.1181.92 కోట్లు అవుతుందని నిర్ణయించారు. దీనిపై వెంటనే తదుపరి చర్యలు తీసుకోవాలని ఎపి సిఆర్‌డిఏకు సూచించారు.

మోడీ గారడీకి ఓట్లు రాలవు

(మొదటిపేజీ తరువాయి)

భంగం కలిగించే రీతిలో మోడీ ప్రభుత్వం వ్యవహరిస్తోందని విమర్శించారు. కేరళలో మహిళ హక్కులను బిజెపి కాలరాస్తోందని ధ్వజమెత్తారు. నదీ జలాల విషయంలో కేంద్రం రాష్ట్రాల మధ్య వివాదాలను సృష్టిస్తోందని విమర్శించారు. జగన్‌పై హత్యాయత్నం కేసులో తాము పూర్తి స్థాయిలో దర్యాప్తు చేపట్టామన్నారు. దాడికి పాల్పడిన వ్యక్తి తాను జగన్ అభిమానినే అని, ప్రతిపక్షనేతకు సానుభూతి రావాలనే ఉద్దేశంతోనే ఈ దాడి చేశానని చెప్పాడని చంద్రబాబు పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వ దర్యాప్తు రికార్డులను కోర్టు ముందుంచుతామని చెప్తే, కేంద్ర ప్రభుత్వం ఎన్ఐఎకు అప్పగించి కోడికత్తి పార్టీకి సహకరించాలని చూస్తోందని విమర్శించారు. రాష్ట్ర అధికారాలను హస్తగతం చేసుకోవాలని చూస్తోందన్నారు. పోలవరం ప్రాజెక్టుకు అవార్డులిస్తూనే, ఈ ప్రాజెక్టు నిర్మాణంలో అవినీతి జరిగిందంటూ ప్రధాని మోడీ చెప్తున్నారని, ఇదెక్కడి న్యాయమని ప్రశ్నించారు. నిధులు ఇవ్వకుండా తప్పించుకోవడానికి పదేపదే అసత్యాలు చెప్తూ ప్రజలను మభ్యపెట్టాలని చూస్తున్నారని విమర్శించారు. కేంద్రం తీరు వల్ల ఉపాధి కూలీలకు డబ్బులు కూడా ఇవ్వలేక పోయామని, దీనికి బాధపడుతున్నామని వివరించారు. రైతుల రుణమాఫీ డబ్బులను సంక్రాంతి తర్వాత చెల్లిస్తామని, త్వరలో తేదీలను ప్రకటిస్తామని తెలిపారు. కార్యక్రమంలో మంత్రులు కిమిడి కళావెంకటరావు, కింజరాపు అచ్చెన్నాయుడు, ఎంపీలు అశోక్ గజపతిరాజు, కింజరాపు రామ్మోహన్ నాయుడు, జిల్లా కలెక్టర్ కె ధనంజయరెడ్డి, జన్మభూమి ప్రత్యేక అధికారి డాక్టర్ పి.లక్ష్మీనరసింహం పాల్గొన్నారు.

సిఎం సభలో మహిళల నిరసన

సంతబొమ్మాళి మండలం తాలాడకు చెందిన మహిళలు సిఎం ప్రసంగిస్తున్న సమయంలో నిరసన వ్యక్తం చేశారు. ప్రభుత్వ పథకాలు ఏవీ తమకు అందడంలేదంటూ లేచి నిల్చొని అసంతృప్తి తెలిపారు. పోలీసులు జోక్యం చేసుకొని వారిని కూర్చోబెట్టారు.

బిజెపి మూల్యం చెల్లించుకోక తప్పదు : కుటుంబరావు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో బిజెపి మూల్యం చెల్లించుకోక తప్పదని, ఆ పార్టీ దేశ వ్యాప్తంగా ఘోరంగా ఓడిపోవడం ఖాయమని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు చెరుకూరి కుటుంబరావు అన్నారు. ఏపీపై ప్రధాని మోడీకి ఎందుకింత కక్ష అని ఆయన ప్రశ్నించారు. ఈ మేరకు శనివారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. అబద్ధాల ప్రధానిగా చరిత్రలో మోడీ నిలిచిపోతారని, తప్పుడు హామీల పార్టీగా బిజెపి నిలుస్తుందని ఆయన పేర్కొన్నారు. వెనుక బడిన జిల్లాలకు కేటాయించిన రూ.1050 కోట్లకు యూసీలు ఇవ్వలేదని ఐదు పార్లమెంట్ స్థానాల వీడియో కాన్ఫరెన్స్‌లో ప్రధాని మోడీ చెప్పడం పచ్చి అబద్ధమని తెలిపారు. గతేడాది డిసెంబరు 18న నీతి అయోగ్ కేంద్రానికి రాసిన లేఖలో స్పష్టంగా ఏపీ రూ.1049.34 కోట్లకు యూసీలు ఇచ్చినట్లుగా స్పష్టంగా పేర్కొందన్నారు.

నేటి నుంచి మ్యూజిక్ అభ్యర్థులకు నైపుణ్య పరీక్షలు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

డిఎస్‌సి-2018 మ్యూజిక్ ఉపాధ్యాయ అభ్యర్థులకు ఆదివారం నుంచి సంగీత నైపుణ్య పరీక్షల్ని నిర్వహించనున్నారు. అభ్యర్థుల రోజువారీ షెడ్యూల్‌ను పాఠశాల విద్యాశాఖ కమిషనర్ వెబ్‌సైట్‌లో పొందుపర్చారు. ఆదివారం కానిస్టేబుల్, ఇతర పోటీ పరీక్షలు రాస్తున్న అభ్యర్థులకు ఈ నెల 12న పాఠశాల విద్యాశాఖ మ్యూజిక్ పరీక్షలు నిర్వహించనుంది.

జాతీయ సమ్మెకు సిద్ధం కావాలి

(మొదటిపేజీ తరువాయి)

ప్రయివేటీకరించే విధానాలతో ఉద్యోగులు, కార్మికులు తీవ్ర ఆవేదనతో ఉన్నారని, ఈ విధానాలను మార్చేందుకు 10 కార్మిక సంఘాలు సమ్మెకు పిలుపునిచ్చాయని తెలిపారు. దేశంలో అవినీతి అరికట్టబడి, ఉపాధిని పెంచే విధానాల కోసం చేపట్టే ఈ సమ్మెకు ప్రజలు మద్దతివ్వాలని కోరారు. విద్యా సంస్థలు, వ్యాపార కార్యాలయాలు, సినిమా హాళ్లు అన్నీ స్వచ్ఛందంగా బంద్‌లో పాల్గొనేందుకు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. ప్రభుత్వరంగంలోని ఫెర్టిలైజర్స్ కార్పొరేషన్‌ను కేంద్రం మూసివేసినందున ఏటా రూ.5 లక్షల కోట్ల ఎరువులను విదేశాల నుంచి దిగుమతి చేసుకుంటూ దేశ ప్రజలపై ఆర్థిక భారం మోపారని ఆవేదన వ్యక్తం చేశారు. ఐడిపిఎల్‌ను మూసివేయడంతో దేశ ప్రజలు మందుల కోసం తమ ఆదాయాల్లో 50 శాతం ఖర్చుచేస్తున్నారని తెలిపారు. సిఐటియు రాష్ట్ర కార్యదర్శి ఎం.జగ్గునాయుడు మాట్లాడుతూ అఖిలపక్ష కార్మిక సంఘాల ఆధ్వర్యాన జరిగే సమ్మెకు సన్నాహకంగా విశాఖ వ్యాప్తంగా కార్మికుల ఆవాసాల్లో సమావేశాలు, పరిశ్రమల వద్ద గేట్ మీటింగులు, జనరల్ బాడీలు నిర్వహించామని చెప్పారు. దేశంలో అసంఘటితరంగ సేవలమీదనే 94 శాతం ప్రగతి ఆధారపడి ఉందని తెలిపారు. భవన నిర్మాణరంగ కార్మికులు, ఆటో, తోపుడుబండ్లు, ఇంటి పనివారే దేశ ప్రగతికి కీలకమని, వారికి కనీస వేతనాలు రూ.18 వేలు, పింఛన్లు, ఇఎస్ఐ, పిఎఫ్ సౌకర్యాల కోసం సమ్మెలో వారంతా భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

దేశ వ్యాప్త సమ్మెకు పెరుగుతున్న మద్దతు

(మొదటిపేజీ తరువాయి)

రవాణా రంగాన్ని మినహాయించాలని ఆయన డిమాండ్ చేశారు. గడచిన రెండు సంవత్సరాల్లో రవాణా రంగం నుంచి కేంద్ర ప్రభుత్వం రూ. 3,09,601 కోట్లు పన్నుల రూపేణా వసూలు చేసినట్లు తెలిపారు. వసూలు చేసిన మొత్తం రోడ్డు రవాణా అభివద్ధికే వెచ్చించాల్సి ఉన్నప్పటికీ సర్కారు సరైన విధంగా కేటాయింపులు చేయడం లేదన్నారు. జీఎస్టీ వల్ల రవాణా రంగంలోని కార్మికులు పెద్ద ఎత్తున నష్ట పోయినట్టు ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. మోడీ సర్కారు తక్షణమే మోటారు వెహికల్ చట్టానికి సవరణను నిలిపివేయాలని డిమాండ్ చేశారు. అసంఘటిత రంగంలో వున్న రోడ్డు రవాణా కార్మికులకు సామాజిక, ఆర్థిక భద్రత కల్పించాలని, డ్రైవర్లను ప్రభుత్వం కార్మిక శాఖలో నమోదు చేసుకునే విధంగా గుర్తింపు ఇవ్వాలని అన్నారు. ఆలిండియా మోటార్ ట్రాన్స్ పోర్టు కమిటీ ఛైర్మన్ కుల్తారన్ సింగ్ అట్వాలీ మాట్లాడుతూ అసంఘటిత రంగంలో పనిచేస్తున్న కార్మికులకు కనీస వేతనం రూ. 24 వేలు ఇవ్వాలని, ఇన్సూరెన్స్ ప్రీమియంలో దళారీ వ్యవస్థను నిలువరించాలని కోరారు. పెట్రోలియం ఉత్పత్తులను జీఎస్టీ కిందకు తీసుకువచ్చి, ఐదు శాతం శ్లాబులోకి చేర్చాలని డిమాండ్ చేశారు. తమ సమస్యలపై పోరాడుతూనే జాతీయ కార్మిక సమ్మెకు మద్ధతు ఇస్తామని చెప్పారు. ఈ సమావేశంలో రాజధాని పరివాహన్ పంచాయత్ అధ్యక్షులు ఇంద్రజీత్ సింగ్, ఆటో టాక్సీ యూనియన్ ప్రధాన కార్యదర్శి ఎంఎస్ మన్సూరీ పాల్గొన్నారు.

సమ్మెకు బ్యాంకు యూనియన్లు మద్దతు

కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై రెండు రోజుల దేశ వ్యాప్త సమ్మెకు పది జాతీయ కార్మిక సంఘాలు ఇచ్చిన పిలుపుకు ప్రభుత్వ రంగ బ్యాంకుల యూనియన్లు మద్దతునిచ్చాయి. ఈ నెల 8, 9 జరిగే సమ్మెల్లో పాల్గొననున్నట్లు అఖిల భారత బ్యాంకు ఉద్యోగుల సంఘం (ఎఐబిఇఎ), భారత బ్యాంక్ ఉద్యోగుల సమాఖ్య(బిఇఎఫ్ఐ).. భారత బ్యాంకుల సంఘానికి(ఐబిఎ)కి తెలిపాయని బిఎస్ఇ ఫైలింగ్ సందర్భంగా ఐడిబిఐ బ్యాంక్ వెల్లడించింది. రెండు రోజుల సమ్మెలో ఎఐబిఇఎ, బిఇఎఫ్ఐ పాల్గొనడం వల్ల తమ బ్యాంకు బ్రాంచ్‌ల్లో, జోన్లలోని కార్యాల యాల్లోని కార్యకలాపాలపై ప్రభావం పడనుందని బ్యాంక్ ఆఫ్ బరోడా తెలిపింది. ప్రజా వ్యతిరేక విధానాలపై కేంద్రం అనుసరిస్తున్న విధానాలకు నిరసనగా, 12 డిమాండ్లను నెరవేర్చాలని ఐఎన్‌టియుసి, ఎఐటియుసి, హెచ్ఎంఎస్, సిఐటియు, ఎఐయుటిసియు, ఎఐసిసిటియు, యుటియుసి, టియుసిసి, ఎల్‌పిఎఫ్, ఎస్ఇడబ్ల్యుఎ తదితర జాతీయ కార్మిక సంఘాలు, రెండు రోజుల సమ్మెకు పిలుపునిచ్చాయి. బ్యాంక్ ఆఫ్ బరోడాలో విజయా, దేనా బ్యాంక్‌ల విలీనాన్ని నిరసిస్తూ గత నెల 26న చేపట్టిన సమ్మెలో వివిధ బ్యాంకులకు చెందిన పదిలక్షల మంది ఉద్యోగులు విధులను బహిష్కరించి పాల్గొన్న సంగతి తెలిసిందే. తొమ్మిది బ్యాంకు యూనియన్లు ఈ నిరసనల్లో పాల్గొన్నాయి.


మహేష్ బాబు

మే నుంచి మొదలు

సుకుమార్ దర్శకత్వంలో మహేష్ బాబు ఓ చిత్రం చేయనున్నారు. ఇది ఆయనకు 26వ చిత్రం. ఈ సినిమా ఏప్రిల్ నుండి మొదలు కానుందని గతంలో వార్తలు వచ్చాయి. అయితే తాజాగా సినీ వర్గాల సమాచారం ప్రకారం మే నుండి మొదలు కానుందని తెలుస్తోంది. మహేష్ ఈ సినిమాకు జూన్ నుండి వరుసగా డేట్లు ఇచ్చినట్లు తెలుస్తోంది. మహేష్ కాంబినేషన్‌లో ఉన్న సీన్లను జూన్ నుండి ఫారెన్ లొకేషన్స్‌లో షూట్ చేయనున్నారని సమాచారం. మహేష్ బాబు సరసన రకుల్ ప్రీత్ సింగ్ కథానాయికగా నటిస్తున్నట్లు ఆ మధ్య వార్తలు వచ్చాయి కానీ.. చిత్రబందం మాత్రం స్టార్ హీరోయిన్ని ఫైనల్ చేసే పనిలో ఉంది. ఇక రంగస్థలం సినిమాతో సూపర్ హిట్ కొట్టి టాప్ డైరెక్టర్‌గా తన స్థానాన్ని సుస్థిరం చేసుకున్న సుకుమార్, ఈ సినిమా కోసం అద్భుతమైన స్క్రిప్ట్‌ను తయారు చేశారి యూనిట్ చెబుతోంది.

రామ లవ్స్ సీత...

'రంగస్థలం'తో భారీ విజయాన్ని అందుకున్న రామ్ చరణ్ సంక్రాంతి కానుకగా ఈనెల 11న 'వినయ విధేయ రామ'తో ప్రేక్షకుల ముందుకు రానున్న విషయం తెలిసిందే. హై వోల్టేజ్ యాక్షన్ సన్నివేశాలతో బోయపాటి శ్రీను ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. చిత్రంలోని 'రామ లవ్స్ సీత' పాటను అన్నపూర్ణ ఏడెకరాల స్టూడియోలో వేసిన సెట్లో చిత్రీకరించారు. 'రామ లవ్స్ సీత' వీడియో సాంగ్ ప్రోమోను ఆదివారం విడుదల చేయనున్నారు. దేవి శ్రీ ప్రసాద్ సంగీతం అందించిన ఈ చిత్రంలో కియరా అద్వానీ కథానాయిక. వివేక్ ఒబేరాయి ప్రతినాయకుడి పాత్రను పోషించారు. దానయ్య డివివి ఈ చిత్రాన్ని నిర్మించారు.


కియారా, రామ్ చరణ్

రోహిత్ శెట్టి కొత్త రికార్డు


రోహిత్ శెట్టి

ఓ దర్శకుడు చేసిన సినిమాలు వరుసగా విజయం సాధించడం అంత సులువుకాదు. కథ, కథనాల్లో కొత్తదనం, ప్రస్తుతం ట్రెండ్‌ను అనుసరిస్తే తప్ప ప్రస్తుత దర్శకులు రాణించడం లేదు. అటువంటిది వరుసగా ఎనిమిది చిత్రాలు బాక్సాఫీస్ వద్ద వంద కోట్లు కలెక్ట్ చేయడం అనేది మరో విశేషం. ఆ ఘనతను బాలీవుడ్ దర్శకుడు రోహిత్ శెట్టి సాధించారు. ఆ విషయాన్ని హీరో రణవీర్ సింగ్ తన ఇన్‌స్టాగ్రామ్‌లో పేర్కొన్నాడు. ఆ వివరాలు కూడా వెల్లడించాడు. ఈ ఘనత సాధించింది బాలీవుడ్‌లో ఈయనొక్కరేనని స్పష్టం చేశారు. రణవీర్, రోహిత్ కాంబినేషన్‌లో వచ్చిన చిత్రం ' సింబా'. డిసెంబరు 28న విడుదలైన గురువారం వరకూ రూ.150.81 కోట్లు రాబట్టినట్లు విశ్లేషకులు చెప్పారు. ఈ జాబితాలో ఎనిమిదో చిత్రంగా 'సింబా' చేరింది. తెలుగు 'టెంపర్'కు హిందీ రీమేక్ ఇది. సారా అలీ ఖాన్ కథానాయిక. కరణ్ జోహార్ నిర్మించారు. అజయ్ దేవగణ్, పరిణీతి చోప్రా, తుషార్ కపూర్, అర్షద్‌వార్సీ, టబు ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'గోల్‌మాల్ ఎగైన్'. రోహిత్ తీసిన ఈ సినిమా 2017లో విడుదలైంది. రూ.80 కోట్లతో నిర్మించారు. చిత్రం దేశవ్యాప్తంగా రూ.200 కోట్లు రాబట్టింది. ఈ దర్శకుడికి రెండేళ్ల తర్వాత భారీ విజయాన్ని అందించిన చిత్రమ కూడా ఇదే. ఈ రికార్డును 'సింబా' క్రాస్ చేసే అవకాశం ఉందని విశ్లేషకుల అభిప్రాయ పడుతున్నారు. అయితే 2015 మాత్రం ఇంతకంటే పెద్ద విజయాన్ని అందించి ఆయన చిత్రం. అదే 'దిల్‌వాలే'. షారుక్ ఖాన్, కాజోల్, కృతి సనన్, వరుణ్ ధావన్ ప్రధాన తారాగణంగా రూపొందింది. గౌరీ ఖాన్ ఈ సినిమాను నిర్మించారు. ఈ ఈ చిత్రం ప్రపంచ వ్యాప్తంగా రూ.400 కోట్లకుపైగా వసూలు చేసింది. అజయ్ దేవగణ్ 'సింగం', సింగం 2' సినిమాల్లో కథానాయకుడిగా సందడి చేశారు. ఆయన ఈ చిత్రాల్లో పోలీసు అధికారిగా కనిపించారు. 2011లో వచ్చిన 'సింగం' రూ.100 కోట్ల క్లబ్‌లో చేరింది. 2014లో వచ్చిన 'సింగం 2' దేశవ్యాప్తంగా రూ.140 కోట్లకుపైగా రాబట్టింది.

'మిస్టర్ మజ్ను' హార్ట్ బ్రేక్...

అఖిల్ అక్కినేని హీరోగా శ్రీ వెంకటేశ్వర సినీ చిత్ర ఎల్‌ఎల్‌పి పతాకంపై రూపొందుతోన్న సినిమా 'మిస్టర్ మజ్ను'. 'తొలిప్రేమ' ఫేం వెంకీ అట్లూరి దర్శకత్వం వహిస్తున్నారు. బి.వి.ఎస్.ఎన్.ప్రసాద్ నిర్మిస్తున్నారు. యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కుతోంది. ప్రస్తుతం ఈ చిత్రం చిత్రీకరణ దశలో ఉంది. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసి ఈనెల 25న ఈ చిత్రాన్ని విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఇటీవల ఈ చిత్రానికి సంబంధించి విడుదలైన 'ఏమైనదో.. ఏమైనదో.. పలుకు మరచినట్టు పెదవికేమైనదో..', టైటిల్ సాంగ్‌కు అద్భుతమైన రెస్పాన్స్ వస్తోందని చిత్రబృందం పేర్కొంది. ఈ చిత్రంలోని 'హార్ట్ బ్రేక్' సాంగ్‌ను ఆదివారం 6 సాయంత్రం 6 గంటలకు విడుదల చేస్తున్నారు. ఇందులో నిధి అగర్వాల్ హీరోయిన్.నాగబాబు, ప్రియదర్శి, జయప్రకాష్, హైపర్ ఆది ఇతర ముఖ్యపాత్రలు పోషిస్తున్నారు.


అఖిల్

హీరోగా తేజ కొడుకు


కేతిరెడ్డి, తేజ

దర్శకుడు తేజ తన కుమారుడు అమితేవ్ తేజను హీరోగా పరిచయం చేయనున్నాడు. ఈ చిత్రానికి సంబంధించిన వివరాలు త్వరలో వెల్లడికానున్నాయి. చిత్రం మూవీస్ స్థాపించి 'జయం', 'నిజం' చిత్రాలను రూపొందించినప్పటి నుంచీ నిర్మాణంలో చేదోడువాదోడుగా ఉన్న కేతిరెడ్డి జగదీశ్వరరెడ్డి ఈ విషయాన్ని శనివారం వెల్లడించారు. తమిళనాడు తెలుగు యువశక్తి అధ్యక్షుడు, 'లక్ష్మీస్ వీరగ్రంథం' సినీ నిర్మాత అయిన కేతిరెడ్డి తన పుట్టినరోజు సందర్భంగా పేర్కొన్నారు. ఈ సందర్భంగా దర్శకుడు తేజ మాట్లాడుతూ తనకూ జగదీశ్వరరెడ్డికి ఉన్న అనుబంధాలను తెలుపుతూ, తమిళనాడులో తెలుగు వారి సమస్యలపై ఆయన చేసిన ఉద్యమాలను, తెలుగు సంస్కృతి, సంప్రదాయాలను కాపాడేందుకు ఆయన చేస్తున్న కృషిని కొనియాడారు. తాను 'చిత్రం మూవీస్'ను స్థాపించుటకు కారకుడని పేర్కొన్నారు. అనంతరం కేతిరెడ్డి జగదీశ్వరరెడ్డి మాట్లాడుతూ దర్శకుడు తేజ ఇప్పుడు బెల్లంకొండ శ్రీనివాస్, కాజల్ అగర్వాల్ కాంబినేషన్ తీస్తున్న 'సీత' చిత్రం కథ తనకు తెలుసుననీ, ఈ చిత్రం కచ్చితంగా తేజ జీవితంలో ఒక మైలురాయిగా నిలుస్తోందన్నారు. దర్శకుడుగా తేజకు 24 శాఖలన్నింటిలో ఉన్న లోపాలు తెలుసనని పేర్కొన్నారు. త్వరలో తమ 'చిత్రం మూవీస్' సంస్థ ద్వారా తేజ కుమారుడును హీరోగా పరిచయం కానున్నారనీ, మల్టీ లాంగ్వేజ్ సినిమాగా నిర్మించనునట్లు తెలిపారు. తాను దర్శకత్వం వహించే 'లక్ష్మీస్ వీరగ్రంథం' టీజర్‌ను ఈనెల 9న విడుదల చేయనునట్లు కేతిరెడ్డి జగదీశ్వరరెడ్డి తెలిపారు.

దీపికా పదుకొనే.కామ్

'అతి త్వరలోనే ఉత్సాహ పరిచేదొకటి రాబోతుంది. ఆ విషయాన్ని మీ అందరితో పంచుకోలేకుండా ఉండలేకపోతున్నా' అని దీపికా పదుకొనే తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో పోస్టు చేసి ఆమె అభిమానుల్లో టెన్షన్ క్రియేట్ చేసింది. ఆమె నుంచి వచ్చే కొత్త విషయం ఏమిటా? అని అంతా ఎదురు చూశారు. తర్వాత రోజు 'డబ్ల్యూ డబ్ల్యూడబ్ల్యూ. దీపికాపదుకొనే.కామ్' పేరుతో ఓ వెబ్‌సైట్ క్రియేట్ చేసినట్టు పేర్కొంది. ఇంతకీ విషయం ఏమిటంటే శనివారం దీపికా పుట్టిన రోజు. ఆ జన్మదినం అంటే ఫ్యాన్స్‌కు సంబరం. ఇప్పటి వరకూ దీపికాకు సంబంధించి వ్యక్తిగత వెబ్‌సైట్ లేదు. ఇక నుంచి ఆ సమస్య తీరనుంది. అభిమానులు నేరుగా ఈ వెబ్‌సైట్ ద్వారా ఈమెకు సంబంధించి అప్‌డేట్స్‌ను నిత్యం తెలుసుకోవచ్చు. 2015లో ఈమె డిప్రెషన్‌కు గురైన వారిని ఆదుకోవడం కోసం 'లివ్ లవ్ లాఫ్' అనే స్వచ్ఛంద సేవా సంస్థను ప్రారంభించారు. మానసికంగా ఇబ్బందులతో ఒత్తిడికి గురైన వారికి ఈ సంస్థ ద్వారా సాయమందిస్తోంది. దీపికా సోదరి అనిషా పదుకొనే ఈ సంస్థ బాధ్యతలు చూస్తున్నారు. ఇప్పుడు అభిమానుల కోసం ప్రత్యేకంగా వ్యక్తిగత వెబ్‌సైట్‌ను క్రియేట్ చేసింది. దీనికి సంబంధించిన ప్రకటనను ఆమె స్వయంగా ఇన్‌స్టాగ్రామ్‌లో తన ఫొటోతో ఓ క్యూఆర్ కోడ్‌తో పోస్టు చేసింది. దీపికా సంజయ్ లీలా భన్సాలీ దర్శకత్వంలో 'పద్మావత్' తర్వాత కొత్త సినిమాలు చేయలేదు. రణవీర్, దీపికా వివాహ బంధంతో డిసెంబర్‌లో ఒక్కటయ్యారు. ఇటీవల ఆమె ప్రొడక్షన్ హౌస్ కూడా ప్రారంభించారు. తన స్వంత బ్యానర్‌లో యాసిడ్ బాధితురాలు లక్ష్మీ అగర్వాల్ జీవిత కథను మొదటి సినిమాగా రూపొందించనున్నారు. మేఘనా గుల్జార్ దర్శకత్వం వహించనున్నారు. దీపికా లక్ష్మీ అగర్వాల్ పాత్రలో కనిపించనుంది. ఈ చిత్రానికి 'చాపాక్' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. విక్రాంత్ మాసే కూడా ఇందులో నటిస్తున్నారు.



దీపికా పదుకొనే

నోయెల్ ఓ ఇంటివాడయ్యాడు

నటుడు నోయెల్ ఓ ఇంటివాడయ్యాడు. నటి ఎస్తేర్ నోరోన్హాను వివాహం చేసుకున్నాడు. క్రైస్తవ మత పద్ధతిలో వీరి పెళ్లి జరిగింది. ఈ సందర్భంగా పెళ్లిలో దిగిన ఫొటోను నోయెల్ ట్విట్టర్‌లో పోస్టు చేశాడు. తాము ఇప్పుడు ఇద్దరం కాదని, ఒక్కటే అని అన్నారు. తన హృదయానికి ఆమే రాణి అని నోయెల్ ట్వీట్ చేశారు. అందరి ఆశీస్సులు కావాలని కోరాడు. వీరి వివాహానికి ఎస్.ఎస్. రాజమౌళి, రమ కూడా హాజరయ్యారు. మంగళూరులో వీరి వివాహం జరిగినట్లు తెలిసింది.



చంద్రబాబు ముందు కూర్చోబెట్టి చెప్పారు


రానా

నందమూరి తారకరామారావు జీవిత కథ ఆధారంగా తెరకెక్కిన 'ఎన్టీఆర్ కథానాయకుడు' భారీ అంచనాల నడుమ సంక్రాంతి కానుకగా 9న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ మూవీ ప్రమోషన్స్‌ను వినూత్నంగా నిర్వహిస్తూ.. ఈ చిత్రంలోని కీలకపాత్రధారులు బాలకృష్ణ, రానా, కళ్యాణ్ రామ్, నరేష్, సుమంత్, తదితర నటీనటులతో 'ది జర్నీ ఆఫ్ ఎన్టీఆర్ కథానాయకుడు' పేరుతో ప్రత్యేక వీడియో ఇంటర్వ్యూను విడుదల చేశారు. ఇందులో ఎన్టీఆర్ అల్లుడు, ప్రస్తుత ఆంధ్రప్రదేశ్ సీఎం చంద్రబాబుగా రానా నటిస్తున్న విషయం తెలిసిందే. తాజా వీడియోలో ఎన్టీఆర్ బయోపిక్ మూవీలో తన జర్నీ గురించి ప్రేక్షకులతో పంచుకున్నారు రానా. ఆయన మాట్లాడుతూ 'ఎన్టీఆర్ బయోపిక్‌లో అందరి పాత్రలు బాగానే ఉన్నాయి. నాకే ఇబ్బంది అయింది. బాలయ్య వాళ్ల నాన్నగారి పాత్ర.. కళ్యాణ్ రామ్ వాళ్ల నాన్న పాత్ర.. సుమంత్ వాళ్ల తాత పాత్ర.. నాకేమో చంద్రబాబు పాత్ర ఇచ్చి ఇచ్చారు. నేను 'బాహుబలి' తరువాత చేస్తున్న సినిమా. నా వయసు 35 సంవత్సరాలు. నాతో చంద్రబాబు పాత్ర చేయించారు. అది కూడా చంద్రబాబు నాయుడు ముందు కూర్చోబెట్టి నువ్ చేయాల్సింది ఈయన పాత్రే అని చెప్పారు. ఈ సినిమాలో నేను చేసిన పార్ట్స్ అన్నీ క్రిష్ నాకు చెప్పినట్టు చంద్రబాబు నాయుడు కూడా నాతో చెప్పారు. సో.. ఆయన వల్ల బెటర్ పెర్ఫామెన్స్ ఇవ్వగలిగాను' అంటూ చిత్ర విశేషాల్ని చెప్పుకొచ్చారు.

'ధీవర' సస్పెన్స్ థ్రిల్లర్



తెలుగులో వైవిధ్యమైన సినిమాల హవా పెరుగుతోంది. కొత్తగా వస్తోన్న దర్శకులే కాదు.. నిర్మాతలు కూడా ఈ తరహా కథలకే ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నారు. ఈ క్రమంలో మరో డిఫరెంట్ మూవీ రాబోతోంది. సినిమా పేరు 'ధీవర'. నాగసాయి, విదా చైతన్య హీరోహీరోయిన్లుగా నటించారు. టైటిల్‌కు తగ్గట్టుగానే భిన్నమైన స్క్రీన్ ప్లేతో సాగే ఈ మూవీ సస్పెన్స్ థ్రిల్లర్‌గా రాబోతోంది. ఈ చిత్రం ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను దర్శకుడు బాబీ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా దర్శకుడు బాబీ మాట్లాడుతూ " ధీవర కాన్సెప్ట్ బాగుంది. యూత్ రిలేట్ అయ్యే విధంగా కథ ఉందని చెప్పారు.

చిత్ర దర్శకుడు విజయ్ జిక్కి మాట్లాడుతూ 'ఇందులో స్క్రీన్ ప్లే హైలైట్‌గా ఉంటుందనీ, లవ్ అండ్ సస్పెన్స్ థ్రిల్లర్‌గా సాగే ఈ సినిమా ఒకేసారి రెండు జానర్స్‌లో సాగుతుంద'ని అన్నారు.


నిర్మాత హరనాథ్ బాబు మాట్లాడుతూ 'కమర్షియల్ అంశాలకు కూడా పెద్ద పీట వేసినట్టు చెప్పాడు. అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకునేలా యూత్‌ఫుల్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా వస్తోన్న ఈ మూవీ ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ వర్క్స్ జరుపుకుంటోంది. త్వరలోనే ఆడియోతో పాటు ట్రైలర్‌ను విడుదల చేస్తాం. అన్ని కార్యక్రమాలూ పూర్తి చేసుకుని వచ్చే నెలాఖరుకూ ప్రేక్షకుల ముందుకు తెస్తామ'ని తెలిపారు.

వాస్తవ ఘటనతో 'వనవాసం'

నవీన్‌రాజ్ శంకరాపు, శశి కాంత్, బందెల కరుణశ్రావ్య, శృతి హీరో హీరోయిన్లుగా పరిచయమవుతున్న చిత్రం 'వనవాసం'. భరత్ కుమార్.పి నరేంద్ర దర్శకత్వంలో బి. సంజయ్ కుమార్ నిర్మిస్తున్నారు. ఈ చిత్రం నిర్మాణాంతర కార్యక్రమాలు పూర్తి చేసుకొంది. శనివారం త్రివిక్రమ్ చేతుల మీదుగా పోస్టర్, టైటిల్ ఆవిష్కరించారు. అనంతరం త్రివిక్రమ్ మాట్లాడుతూ తనకు ఈ టైటిల్ బాగా నచ్చింది. ఈ టైటిల్ లాగానే సినిమా కూడా బాగుంటుందని ఆశిస్తున్నానంటూ టీం అందరికీ శుభాకాంక్షలు తెలిపారు. భరత్ కుమార్.పి.నరేంద్ర మాట్లాడుతూ కొన్ని యధార్థ సంఘటనల ఆధారంగా తెరకెక్కించాం. అందరూ మెచ్చే విధంగా ఉంటుందని ఆశిస్తున్నాన'ని అన్నారు. నిర్మాత మాట్లాడుతూ ప్రస్తుతం పోస్ట్‌ప్రొడక్షన్ కార్యక్రమాలు జరుగుతున్నాయని, త్వరలో ఆడియోను విడుదల చేయనున్నామని తెలిపారు. ఈ చిత్రానికి సంగీతం : ఎం.ఎం.కుమార్, సినిమాటోగ్రఫీ:ప్రేమ్ జై విన్సంట్.



'స్ట్రీట్ డాన్సర్'లు


శ్రద్ధా కపూర్


నోరా

వరుణ్ ధావన్ హీరోగా చేస్తున్న డాన్స్ నేపథ్య చిత్రంలో నటించడం లేదని ఈ వారం రోజులు క్రితం కత్రినా కైఫ్ పేర్కొంది. 'భరత్', ఈ చిత్రం షెడ్యూల్స్ డేట్స్ ఒకేసారి రావడంతో సమస్య తలెత్తిందని అందువల్లే ఈ ప్రాజెక్టు నుంచి తప్పుకుంటున్నట్టు తెలిపింది. ఇప్పుడు ఈమె స్థానంలో శ్రద్ధా కపూర్, నోరా ఫాతెహి నటించనున్నారు. రెమో డిసౌజా దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాను టీ సిరీస్ నిర్మిస్తోంది. ఈ చిత్రానికి 'స్ట్రీట్ డాన్సర్' అనే టైటిల్ ఖరారు చేశారు. కత్రినా ఈ చిత్రం నుంచి తప్పుకున్న వెంటనే కొత్త వారి కోసం అన్వేషించారు. శ్రద్ధా, నోరా తమ చిత్రానికి సరిపోతారని చిత్రయూనిట్ భావించింది. త్వరలో వీరిద్దరూ చిత్రీకరణలో పాల్గొంటారని దర్శకుడు తెలిపారు. మంచి డాన్సర్ అయిన నోరా ఈ చిత్రం తన పాత్రను చాలా సులువుగా చేసేస్తుందని రెమో చెప్పారు. శ్రద్ధా కపూర్ ఈ చిత్రంలో ఇండియన్ డాన్సర్‌గానూ, నోరా ఇంటర్నేషనల్ డాన్సర్‌గానూ చేయనున్నారు. నోరాదే శ్రద్ధా కంటే కీలకమైన పాత్ర.


ఫాతిమా సేన్ షేక్

ఫాతిమాకు మెగా ఛాన్స్

ఫాతిమా సేన్ షేఖ్...పరిచయం అక్కర్లేని పేరు. ఎందుకంటే 'దంగల్'లో ఆమె చేసిన పెర్ఫార్మెన్స్ అలాంటి గుర్తింపు తెచ్చింది. తాజాగా అమిర్ ఖాన్, అమితాబ్ బచ్చన్, కత్రినా కైఫ్ తదితరులు నటించిన 'థగ్స్ ఆఫ్ హిందుస్తాన్'లో చేసింది. ఇందులో ఫాతిమాది చిన్న పాత్రే అయినా మెప్పించింది. ఇప్పుడు ఆమెకు మెగా ఆఫర్ వచ్చింది. బాలీవుడ్ బాద్‌షా షారుఖ్ ఖాన్ సరసన నటించే అవకాశం దక్కింది. ఆయన హీరోగా చేయన్న 'సెల్యూట్'లో షేఖ్‌ను కథానాయికగా ఎంపిక చేయనున్నారు. ఈ సినిమాలో కథానాయిక కోసం తీవ్రంగా అన్వేషిస్తున్న తరుణంలో ఫాతిమా సరిపోతుందని ఓ అభిప్రాయానికి వచ్చారు. అయితే అధికారిక ప్రకటన మాత్రం రాలేదు. బయట మాత్రం చాలా మంది పేర్లు ఈ చిత్రంలో కథానాయికగా నటించే అవకాశం ఉందని ప్రచారం జరుగుతోంది. బాలీవుడ్ హంగామా వెబ్‌సైట్‌కు ఫాతిమా ఇచ్చిన ఇంటర్వ్యూలో మాత్రం తాను షారుఖ్ చిత్రంలో నటిస్తున్నట్టు పేర్కొంది. 'సెల్యూట్' చిత్రం ఎయిర్‌ఫోర్స్ ఆఫీసర్ రాకేష్ శర్మ జీవితం ఆధారంగా తెరకెక్కుతోంది. అంతరిక్షంలోకి వెళ్లిన ఈయన జీవితాన్ని వెండితెరపై దర్శకుడు మహేష్ మాత్తై ఆవిష్కరిస్తున్నారు. అంజుమ్ రాజబాలి ఈ చిత్రానికి కథను అందిస్తున్నారు. సిద్ధార్థ్ రాయ్ కపూర్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఈ చిత్రం ఫిబ్రవరిలో సెట్స్‌పైకి వెళ్లనుంది. సమ్మర్‌కు ముందే మేజర్ షెడ్యూల్‌ను పూర్తి చేయాలని సన్నాహాలు చేస్తున్నారు.



విజయపథానికి మరో మెట్టు

పియానో, వయొలిన్, డ్రమ్స్, గిటారు, ఫ్లూట్.. ఏదైతేనేం చదువుతో పాటు వివిధ రంగాల్లోనూ అందెవేసిన చెయ్యిగా తమ ప్రత్యేకతను చాటుకుంటూ ముందుకు సాగిపోతున్నారు నేటి యువత. ఇటువంటి కళల్లో రాణించటం వల్ల చదువుపై మక్కువ పెరిగిందంటున్నారు. జీవితానికి మరిన్ని మెరుగులు దిద్దుకోవడంతో పాటు తమ లక్ష్యాన్ని చేరుకోవడానికి ఇవి ఎంతో సహకరిస్తున్నాయని ఆత్మవిశ్వాసంతో చెబుతున్నారు. అయితే వీరికి ఆయా రంగాల్లో ఆసక్తి ఎందుకు కలిగింది? చదువునూ వీటినీ ఎలా బ్యాలెన్స్ చేసుకోగలిగారు? దీనికి ఎలాంటి ప్రోత్సాహం లభించింది ? ఈ విషయాలు యువత మాటల్లోనే తెలుసుకుందాం మరి..

శశాంక్, శృతి, లోకేష్, చైతన్య, రంజిత్, ధీరజ్ ఒక్కొక్కరు ఒక్కో రంగంలో నిష్ణాతులు. ఎంచుకున్న రంగం ఏదైనప్పటికీ దానికి మెరుగులు దిద్దుకోవడానికి చదువు అడ్డంకి కాలేదు అంటున్నారు వీరంతా. కుటుంబసభ్యుల సహకారానికి తమ ఆసక్తిని జోడిస్తూ, కోరుకున్న లక్ష్యాన్ని చేరుకోవాలని ఆశ పడుతున్నారు వీరు.

అంకిత భావంతో ...

ఆర్ఆర్ఎస్ జికె శశాంక్ వివిఐటిలో బిటెక్ విద్యార్థి. తన తల్లిదండ్రులు ఇద్దరూ సంగీత విద్వాంసులు కావటంతో చిన్నప్పటి నుంచే సంగీతం, ఫ్లూట్, గిటారు ఇలా అన్నింటినీ ఔపోశన పట్టేశాడు. ముందుగా ఇతని కెరీర్ కీబోర్డుతో మొదలైంది. శశాంక్ నాన్న ప్రేమ్‌కుమార్ గుంటూరులో సాయిస్మృతి సంగీత అకాడమీ నడుపుతున్నారు. ఆయనే శశాంక్ గురువు. ఈ అకాడమీ 33 ఏళ్ల నుంచీ నడుస్తోంది. మ్యూజిక్‌లో ఉన్న 12 ఇనుస్ట్రుమెంట్స్‌ను ఒక్కోటి మార్చుకుంటూ అన్నింటినీ చాలా సులువుగా నేర్చుకున్నాడు. కానీ వాటిల్లో మరింత నైపుణ్యం సంపాదించుకోవడమే శశాంక్ లక్ష్యం. 'నేను తొమ్మిదో తరగతి చదివేటప్పుడు బాలోత్సవ్‌లో బాలరత్న అవార్డు వచ్చింది. పక్కన నిలబడి, జ్ఞానమొసగ రాదె.. నాకు నచ్చిన కీర్తనలు. ప్రస్తుతం ఫ్లూట్ మీద శ్రద్ధ పెట్టాను' అంటాడు శశాంక్. శశాంక్ అక్క శృతి వయొలెన్‌లో నేర్పరి. తనూ వివిఐటీలో బీటెక్ చదువుతోంది. ఇనుస్ట్రుమెంటల్ సోలో, ఇనుస్ట్రుమెంటల్ బ్యాండ్, గ్రూప్ పోటీల్లో వివిఐటిలో జరిగిన యువజనోత్సవాల్లో తానూ పాల్గొనడంతో పాటు పలు బహుమతులు సొంతం చేసుకుంది. 'ఎక్కడ ఏ కార్యక్రమం జరిగినా తమ్ముడూ, నేనూ నాన్నతో వెళ్లి పాల్గొంటాం. అంకితభావంతో నేర్చుకుంటే ఎవరైనా ఏ రంగంలోనైనా మంచి స్థాయికి చేరుకుంటారు' అంటుంది శృతి. ఏటా ఇక్కడ జరిగే ఈ కార్యక్రమంలో వీరిద్దరూ తప్పకుండా పాల్గొంటారు. 'మెకానికల్ కోర్ జాబ్‌తో పాటు మ్యూజిక్‌లోనూ ప్రావీణ్యం సంపాదించాలన్నది నా జీవిత లక్ష్యం' అంటాడు శశాంక్.

నేనూ స్వర బ్యాండ్‌లో ఉన్నా..

విజయవాడ కెఎల్ యూనివర్శిటీలో బిటెక్ చదువుతున్నాడు సరివిశెట్టి లోకేష్.. పది సంవత్సరాల నుంచి వివిఐటిలో 'స్వర బ్యాండ్' ట్రూప్ నడుస్తోంది. దీని మాధ్యమంగా పలు కార్యక్రమాల్లో పాల్గొన్నాడు లోకేష్. స్వర బ్యాండ్‌లో 50 మంది సభ్యులు



ఉంటారు. ప్రతి సంవత్సరం దీనిలోకి కొందరు రావడం, కొందరు వెళ్లడం సహజంగా జరుగుతుంటుంది. ఎక్కడికెళ్లినా స్వర కామన్‌గా ఉంటుంది. గత ఏడాది జరిగిన అమరావతి ఫుడ్ ఫెస్ట్‌లో ఈ బ్యాండ్ చురుగ్గా పాల్గొంది. అందులో భాగంగా లాంథనింగ్ ఫెస్ట్ (చెట్లు పెంచాలి) అనే అంశాన్ని తీసుకున్నారు. ఇప్పటిదాకా 50కి పైగా కార్యక్రమాలు స్వరబ్యాండ్ ద్వారా నిర్వహించారు. క్యాంపస్‌లో జరిగిన సోలో క్లాసికల్, లైట్ మ్యూజిక్, సోలో వెస్టర్న్‌లో మొదటి బహుమతి దక్కించుకుంది స్వర బ్యాండ్. 'చిన్నతనం నుంచే గిటార్ నేర్చుకున్నాను. ఇదంతా అమ్మానాన్నల ప్రోత్సాహంతోనే సాధ్యపడింది' అని ఎంతో గర్వంగా చెబుతాడు లోకేష్.

ఆసక్తి పెరిగింది..

వివిఐటీలో బిటెక్ విద్యార్థి రంజిత్. నాన్న చార్టెడ్ అకౌంటెంట్. అమ్మ టీచర్. ఇతనికి పాడటంతోపాటు డ్రమ్స్ వాయించడమూ ఇష్టం. ఇవి నేర్చుకోవడానికి ప్రత్యేకంగా ఏ గురువునూ ఆశ్రయించలేదు. రోజులో కొంత సమయాన్ని కేటాయించి, తనకున్న ఆసక్తితోనే ఇవి నేర్చుకున్నాడు. బ్రేక్ టైంలోనో, కాలేజీ ముగిసిన తర్వాతనో సమయం దొరికినప్పుడల్లా స్వర క్లబ్‌లో ప్రాక్టీస్ చేసేవాడు. 'ఒక్కోసారి ఈవెంట్స్ ఉన్నప్పుడు బయటకూ వెళ్లాల్సి ఉంటుంది. క్లబ్ మెంబర్స్ అందరూ కలిసి వెళతాము. ఏ ఈవెంట్‌కి వెళ్లినా నలుగురు, ఐదుగురు కలిసి గ్రూప్‌గా వెళ్తాము. ఇందులో భాగంగానే బ్యాండ్‌లో ఉన్న వాళ్లందరం జాతీయ స్థాయిలో జరిగిన కార్యక్రమానికి గతేడాది హర్యానా వెళ్లాం. నిఫా పేరిట 2017 అక్టోబర్‌లో ప్రభుత్వమే దీనిని నిర్వహించింది. మా కాలేజీ నుంచి పదిమంది విద్యార్థులం పాల్గొన్నాం. ఈవెంట్స్ ఉన్నప్పుడు ధ్యాసంతా ప్రాక్టీస్ మీదే ఉంటుంది. ఎవరికి ఇష్టమైనవి వారు నేర్చుకుంటాం. మా కాలేజీలో ఇన్ని నేర్చుకోవాలనే నిబంధన ఏమీలేదు. దీనివల్ల చదువుకు ఎలాంటి ఆటంకమూ కలగకపోగా మరింత చదవాలనే ఆసక్తి పెరిగింది. ఇదంతా మనల్ని మనం సమన్వయ పరచుకోవడంపైనే ఆధారపడి ఉంటుంది' అని తన అనుభవాన్ని చెప్పుకొచ్చాడు రంజిత్.





ప్రావీణ్యం సంపాదించగలిగాను

వివిఐటిలో బీటెక్ విద్యార్థి ఎమ్ఎస్‌కె చైతన్య. తల్లిదండ్రులు ఇద్దరూ టైలరింగ్ వృత్తిలో ఉన్నారు. 'చెల్లి కూచిపూడి డ్యాన్స్ చేస్తుంటే గమనిస్తూ ఉండేవాడిని. నేనూ ఏదో ఒకటి చెయ్యాలనుకుంటున్న సమయంలో స్వరబ్యాండ్ గురించి తెలిసి, దీనిలో సభ్యుడిగా చేరాను. ఇక్కడే పాడటం, గిటారు వాయించడం నేర్చుకున్నాను' అంటున్నాడు చైతన్య. పియానో అంటే ప్రాణం పెట్టే ధీరజ్ కెఎల్ యూనివర్శిటీలో బిటెక్ చదువుతున్నాడు. రెండో తరగతి నుంచి పది సంవత్సరాల పాటు క్లాసికల్‌లో కర్ణాటక మ్యూజిక్ నేర్చుకున్నాడు. నాలుగో తరగతిలో ఉండగా ఈటీవీ, ఆంధ్రావాలా, ఆల్ ఇండియా రేడియోలోనూ పాల్గొన్నాడు. చదువుకు ఆటంకం కలుగుతుందని కొన్నాళ్లు పియానోకు దూరంగా ఉన్నాడు. తిరిగి రెండేళ్ల నుంచీ దీనిపై మళ్లీ శ్రద్ధ పెట్టాడు. 'నా ఇష్టానికి ఎవరూ ఎప్పుడూ అడ్డు చెప్పేవారు కాదు. అందుకే ఎలాంటి అంతరాయమూ కలగలేదు. నేను తీసిన 'నీ వెంటే నేను' షార్ట్‌ఫిల్మ్ యూట్యూబ్‌లో 70 వేల వ్యూస్ తెచ్చి పెట్టింది. 'క్రష్' షార్ట్ ఫిల్మ్‌కి అవార్డు కూడా వచ్చింది. నా ఆసక్తికి తోడు ఇంట్లో అందరూ బాగా ప్రోత్సహించేవారు. అందుకే ఇంత ప్రావీణ్యాన్ని సంపాదించగలిగాను' అని ఎంతో ఆత్మవిశ్వాసంతో చెబుతాడు ధీరజ్.

వేరే ఆలోచనలు ఏమీ పెట్టుకోకు.. నీ చదువు పాడవుతుంది అంటూ చాలామంది తల్లిదండ్రులు పిల్లలను హెచ్చరిస్తూ ఉంటారు. కానీ, పిల్లలకు చదువుతో పాటు ఇతర కళల్లోనూ అంతకుమించిన నైపుణ్యమూ, ఆసక్తీ ఉంటుందని తెలుసుకుని ఆ దిశగా ప్రోత్సహించాలి. అప్పుడే వారికి నచ్చిన రంగంలో రాణిస్తారు. జీవితానికి మరిన్ని మెరుగులు దిద్దుకోవడానికి చదువు ఒక్కటే సరిపోదు. చదువే జీవితమూ అయిపోదు. ఎవరిలో ఏ నైపుణ్యం ఉందో తెలుసుకొని.. దాన్ని వెలికితీసి సాన పెట్టగలిగితే చాలు. విజయపథానికి మరో మెట్టు చేరువైనట్లే. మరిన్ని విజయాలు ఒడిసి పట్టుకున్నట్టే!

- వైష్ణవిశ్రీ



ఆత్మస్థైర్యంతో ముున్ముందుకు ...

నేటి యువతులు తన కలలను సాకారం చేసుకోవడానికి విద్యను ఆశ్రయిస్తున్నారు. కానీ అక్కడా అడుగడుగునా ఆటంకాలు ఎదురవుతూనే ఉన్నాయి. ఒక్కోసారి కొందరి ఉన్మాదానికి యువతుల జీవితాలు చీకట్లో నెట్టివేయబడుతున్నాయి. అలాంటి ఒక విషాదకర కథే ఇంద్రజిత్ కౌర్‌ది.

ఇంద్రజిత్ కౌర్ సొంతూరు మొహాలీకి దగ్గరలోని మరౌలీ అనే గ్రామం. ఆమె కాలేజీకి వెళ్లే సమయంలో అదే ఊరికి చెందిన మన్‌జిత్ సింగ్ అనే యువకుడు "ప్రేమిస్తున్నా.." అంటూ రోజూ వెంటబడేవాడు. కానీ అతని ప్రేమను ఆమె అంగీకరించలేదు. తన వెంటపడవద్దని పలుమార్లు గట్టిగా చెప్పింది కూడా. దాంతో ఆమె మీద ద్వేషాన్ని పెంచుకున్నాడతను. తనకు దక్కనిది మరొకరికి దక్కకూడదనే ఉన్మాదంలోకి వెళ్లాడు. అవకాశం కోసం ఎదురు చూస్తున్నాడు. ఒకరోజు కాలేజీకి వెళ్లే సమయంలో దారిలో మాటువేసిన మన్‌జిత్ ఆమెపై యాసిడ్ దాడికి తెగబడ్డాడు. ఆ దాడిలో ఆమె శరీరం గాయాలు పాలవ్వడమేకాక, కంటిచూపును కోల్పోయింది. అనేక ప్లాస్టిక్ సర్జరీలు జరిగాయి. లక్షల్లో ఖర్చయింది. కుటుంబం ఆర్థికంగా చితికిపోయింది. ఈ సంఘటన 2011లో జరిగింది. చివరికి తన పనులూ తాను చేసుకోలేని పరిస్థితుల్లోకి నెట్టివేయబడింది. ప్రతి చిన్న విషయానికీ ఇతరుల మీద ఆధారపడాల్సి వచ్చేది. ఆ సమయంలో తన తల్లి తప్ప మరెవరూ తనకు అండగా నిలబడలేదు. చివరికి తన సోదరుడు, తనవారకున్న బంధువులు కూడా ధైర్యం చెప్పకపోగా ప్రతిక్షణం ఆమెను నిరుత్సాహ పరచేవారు. నీవు ఇంటికి, సమాజానికి బరువయ్యావంటూ వేధించేవారు. ఓదార్చేవారు లేక ఎన్నో రోజులు ఏడుస్తూనే గడిపిందామె. ఇదంతా గమనిస్తున్న తను ఎవరికీ భారం కాకూడదని భావించింది. అందుకే డెహ్రాడూన్‌లోని 'నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ విజువల్ హ్యాండీక్యాప్డ్'లో జాయిన్ అయింది. అక్కడే ఆమె జీవితం ఒక మలుపు తిరిగింది. ఆ ఇన్‌స్టిట్యూట్‌లో ఉన్న ప్రతి ఒక్కరూ ఆమెకు అండగా నిలిచారు. ఆమెలో ధైర్యాన్ని నింపడమే కాదు, బతుకుపై ఆశ కలిగేలా చేశారు. గతంలో టెక్నికల్‌గా తెలియని అనేక విషయాలను అక్కడే నేర్చుకుందామె. యాసిడ్ దాడి తర్వాత ఆపేసిన చదువును మరలా ప్రారంభించింది. ఎమ్ఏ, పిహెచ్‌డి చేసింది.

ఇంద్రజిత్ కౌర్ మానసికంగా కోలుకున్న తర్వాత తనలాంటి మరెందరి కోసమో పనిచేయడం మొదలెట్టింది. పంజాబ్, హర్యానా హైకోర్టులో వైద్య ఖర్చులకుగాను, తన జీవిత భృతిని కోరుతూ ఆర్థిక సాయం చేయాలని ఒక పిటిషన్ వేసింది. ఏడేళ్ల ఆమె పోరాటం కారణంగానే యాసిడ్ బాధితులకు పంజాబ్, హర్యానా రాష్ట్రాలతో పాటు కేంద్రపాలిత ప్రాంతమైన చండీఘడ్ కూడా ఆర్థిక సహాయం అందించే విధంగా పోరాడింది. ఇంకా ఆమె ఒక ప్రైవేటు కంపెనీలో ఉద్యోగం చేసుకుంటూనే పోటీ పరీక్షలకు ప్రిపేర్ అయింది. ఢిల్లీలోని కెనరా బ్యాంకులో క్లర్క్‌గా ఉద్యోగం సాధించింది. ప్రస్తుతం ఆమె జీవితంలో గెలవడమే కాదు. తనలాంటి మరెందరికో దారిచూపుతోంది. శభాష్! ఇంద్రజిత్ కౌర్.








జోక్:


చలపతి : ఎందుకు బాబూ! అలా ఒక కన్ను మూసి చూస్తున్నావు?

బిట్టు: మా ఇంట్లోకి ఎవరైనా వస్తే ఓ కన్నేసి ఉంచమని మా తాతగారు చెప్పారండి!

పొడుపు కథ

మీసాలయ్య మిద్దెక్కితే
ఎలుకరాజు
అదిరిపడ్డాడు.






చుక్కలు కలపండి!

పిల్లలూ! పక్కనున్న చిత్రంలోని చుక్కల్ని కలిపి.. బొమ్మను పూర్తిచేయండి!!

దారి కనుక్కోండి!



పిల్లలూ! ఈ గజరాజుకు అరటిపండ్లను చేరే దారి చూపించి, దాని ఆకలిని తీర్చుదామా? పండ్లను చేరే దారి కనుక్కోండి మరి!

దోశలు

బి.నరేష్
4వ,తరగతి
ప్రాథమిక పాఠశాల
మెయిన్,
హెచ్.మురవణి,
కర్నూలు జిల్లా



పాపకు ఆకలి వేసింది
అమ్మకు విషయం చెప్పింది
అమ్మ బిరబిర వచ్చింది
దోశల పిండి తెచ్చింది
పాపకు దోశలు పోసింది
ముద్దుగ వడ్డన చేసింది
పాప హాయిగ నవ్వింది
గబగబ అన్నీ తినేసింది
పాపకు ఆకలి పోయింది
బాగుగ ఆటలు ఆడింది
అమ్మకు ముద్దు పెట్టింది
అమ్మకు కడుపు నిండింది



నేను గీసిన బొమ్మ



టి. చిన్నారి,
6వ తరగతి,
జెడ్.పి.హైస్కూల్,
పెనుమాక,
గుంటూరు జిల్లా.



పిల్లల్లారా.. రారండి!!

కథలు, కవితలు, మీరు గీసిన బొమ్మలు, చూసిన ప్రదేశాలు, కనిపెట్టిన సైన్సు సంగతుల గురించి రాసి మీపేరు, ఫొటోతో పంపవల్సిన మాచిరునామా

చిన్నారి, జీవన, ప్రజాశక్తి తెలుగు దినపత్రిక,
హౌస్ నెం : 27-30-4, ఆకులవారి వీధి, గవర్నర్ పేట, విజయవాడ-2.
ఇ మెయిల్ - Chinnaarips@gmail.com





శభాష్‌ రాహుల్‌

గత కొంతకాలంగా పేలవ ఫామ్‌తో విమర్శలు పాలవుతున్న ఓపెనర్‌ కేఎల్‌ రాహుల్‌ శనివారం అభిమానుల ప్రశంసలు అందుకుంటున్నాడు. నాల్గో టెస్టు మూడో రోజు 15వ ఓవర్లలో రవీంద్ర జడేజా వేసిన మొదటి బంతిని ఆసీస్‌ ఓపెనర్‌ హారిస్‌ మిడాన్‌ దిశగా షాట్‌ కొట్టాడు. అది నేరుగా ఫీల్డర్‌ కేఎల్‌ రాహుల్‌ వైపు వెళ్లింది. దానిని రాహుల్‌ అద్భుతమైన రీతిలో డైవ్‌ కొట్టి క్యాచ్‌ పట్టాడు. అందరూ అది ఔట్‌ అని అనుకున్నారు. కాని బంతి నేలను తాకిన విషయాన్ని గమనించిన రాహుల్‌ ఔట్‌ కాదంటూ తన నిజాయితీని చాటుకున్నాడు. దీంతో ఫీల్డ్‌ అంపైర్‌ 'శభాష్‌ రాహుల్‌' అంటూ మెచ్చుకున్నాడు.

మైదానంలో పింక్‌డే

ఆస్ట్రేలియా పాస్ట్‌ బౌలర్‌ మెక్‌గ్రాత్‌ క్యాన్సర్‌ బాధితుల కోసం ఏర్పాటు చేసిన మెక్‌గ్రాత్‌ ఫౌండేషన్‌కు నిధుల సేకరణ కోసం సిడ్నీ టెస్టు మూడో రోజును పింక్‌ డే గా ప్రకటించారు. దీంతో స్టేడియంలో గులాబీ రంగుతో నిండిపోగా.. టీమిండియా క్రికెటర్లకు పింక్‌ టోపీలు ఇచ్చి క్రికెట్‌ ఆస్ట్రేలియా మైదానంలోకి ఆహ్వానించింది. మెక్‌గ్రాత్‌ భార్య జేన్‌ కొన్ని సంవత్సరాల నుంచి బ్రెస్ట్‌ క్యాన్సర్‌తో బాధపడుతూ 2008లో చనిపోయింది. దీంతో మెక్‌గ్రాత్‌ ఈ మహమ్మారి నుంచి ఇతరులను కాపాడలనే ఉద్దేశంతో 2005 సంవత్సరంలో బాధితులకు అవగాహన, చికిత్సలో సాయం చేసేందుకు ఈ ఫౌండేషన్‌ స్థాపించి అప్పటినుంచి సేవలు అందిస్తున్నాడు. పింక్‌ డే కార్యక్రమం ద్వారా సేకరించిన విరాళాలను ఆస్ట్రేలియాలో క్యాన్సర్‌తో బాధపడుతున్న బాధితులకు అందిస్తారు. ఈ కార్యక్రమంపై పలువురు అభిమానులు, క్రీడాకారులు ఇరుజట్లను అభినందిస్తున్నారు.



70 ఏళ్ల చరిత్రను తిరగరాయడానికి టీమిండియా తన మార్గాన్ని సులభతరం చేసుకుంది. తొలి ఇన్నింగ్స్‌లో 622 పరుగుల భారీ స్కోర్‌ చేసి ఆతిథ్య ఆస్ట్రేలియాపై మూడోరోజు ఆధిపత్యం చెలాయించింది. వెలుతురు సరిగా లేక ముందే నిలిచినా ఆరు వికెట్లను పడగొట్టి మ్యాచ్‌పై పట్టు సాధించింది. టీమిండియాకంటే కంగారు జట్టు ఇంకా 386 పరుగుల వెనకంజలో ఉంది. హ్యాండ్‌కోంబ్స్‌(28), కమ్మిన్స్‌(25) పరుగులతో క్రీజులో ఉన్నారు.



కుల్దీప్‌యాదవ్‌
3 వికెట్లు



జడేజా 2 వికెట్లు

స్పిన్నర్ల హవా

- సత్తాచాటిన కుల్దీప్‌, జడేజా
- ఆస్ట్రేలియా 236/6
- వెలుతురులేమితో ముందే నిలిచిన మూడో రోజు ఆట

సిడ్నీ : ఆస్ట్రేలియాతో జరుగుతున్న నాల్గో టెస్ట్‌కు వెలుతురులేమి అంతరాయం కలిగించింది. మరో గంట ఆట మిగిలి ఉన్నా ఆకాశాన్ని మేఘాలు కమ్మేయడంతో అంపైర్లు మూడోరోజు ఆటను ముందే నిలిపివేశారు. మరో 16.3 ఓవర్ల ఆట మిగిలి ఉన్నా వెలుతురు లేమి కారణంగా మ్యాచ్‌ను కొనసాగించలేకపోయారు. తొలి రెండ్రోజులూ బ్యాట్స్‌మెన్‌ సత్తా చాటగా మూడోరోజు బౌలర్లు ఆధిపత్యం చెలాయించారు. టీమిండియా 622 పరుగుల భారీ స్కోర్‌ను చేరే క్రమంలో శనివారం ఇన్నింగ్స్‌ను కొనసాగించిన కంగారుజట్టు ఆరు వికెట్ల నష్టానికి 236 పరుగులు చేయగల్గింది. ఓవర్‌ నైట్‌స్కోరు 24 పరుగులతో మూడోరోజు బ్యాటింగ్‌కు దిగిన ఆస్ట్రేలియా జట్టుకు ఓపెనర్లు మొదటి వికెట్‌కు 72 పరుగులు జోడించారు. ప్రమాదకరంగా మారుతున్న ఈ జోడీని కుల్దీప్‌ యాదవ్‌ విడదీశాడు. ఖ్వాజా (27)ను తొలిగా అవుట్‌ చేశాడు. అనంతరం వచ్చిన లాబస్‌చేంజ్‌తో కలిసి మరో ఓపెనర్‌ హారిస్‌ రెండో వికెట్‌కు 56 పరుగులు జోడించాడు. అర్ధశతకం పూర్తి చేసిన హారిస్‌(79)ను జడేజా బౌల్డ్‌ చేశాడు. మరికొద్దిసేపటికే లాబస్‌చేంజ్‌(38) షమీ బౌలింగ్‌లో రహానేకు క్యాచ్‌ ఇచ్చి వెనుదిరిగాడు. అనంతరం వచ్చిన మార్ష్‌ (8)పరుగుల వద్ద జడేజా పెవిలియన్‌కు పంపాడు. 67వ ఓవర్లో కుల్దీప్‌ వేసిన బంతిని హెడ్‌ (20) అతడికే క్యాచ్‌ ఇచ్చి వెనుదిరిగాడు. ఆ వెంటనే పైన్‌(5) కూడా కుల్దీప్‌ బౌలింగ్‌లో అవుటయ్యాడు. మూడోరోజు ఆట ముగిసే సమయానికి హాండ్స్‌కాంబ్‌ (28 నాటౌట్‌), కమ్మిన్స్‌ (25 నాటౌట్‌) క్రీజులో ఉన్నారు. భారత బౌలర్లలో కుల్దీప్‌కు మూడు, జడేజాకు రెండు, షమీకి ఒక వికెట్‌ దక్కాయి.



స్కోరు బోర్డు

టీమిండియా తొలి ఇన్నింగ్స్‌ 622/7 డిక్లేర్డ్‌

ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్‌ : హ్యారిస్‌(బి) జడేజా 79, ఖ్వాజా (సి)పుజారా(బి)కుల్దీప్‌ యాదవ్‌ 27, మార్నస్‌ (సి)రహానే (బి)షమి 38, మార్ష్‌ (సి)రహానే (బి)జడేజా 8, హెడ్‌(సి అండ్‌ బి)కుల్దీప్‌యాదవ్‌ 20, పైన్‌ (బి) కుల్దీప్‌ యాదవ్‌ 5, హ్యాండ్‌స్కాబ్‌ (బ్యాటింగ్‌) 28, కమ్మిన్స్‌ (బ్యాటింగ్‌) 25, అదనం 6 (మొత్తం 83.3 ఓవర్లలో ఆరు వికెట్ల నష్టానికి 236 పరుగులు)

బౌలింగ్‌ : షమి 16-1-54-1, బుమ్రా 16-4-43-0, జడేజా 27.3-9-62-2, కుల్దీప్‌ 24-6-71-3.



బెస్ట్‌ రైడర్‌ : పవన్‌ కుమార్‌ శరావత్‌
బెస్ట్‌ డిపెండర్‌ ఆఫ్‌ ది సిరీస్‌ : నితీష్‌ కుమారు యుపి యోధా
విన్నింగ్‌ టీమ్‌ ఆఫ్‌ ది కెప్టెన్‌ : రోహిత్‌ కుమార్‌
బెస్ట్‌ వ్యాలెబుల్‌ పేయిర్‌ ఆఫ్‌ ది టోర్నిమెంట్‌ : పవన్‌ కుమార్‌ శరావత్‌



పవన్‌ కుమార్‌ శరావత్‌

ప్రొ కబడ్డీ ఆరో సీజన్‌ విజేత బెంగళూరు బుల్స్‌

ముంబయి : ఉత్కంఠభరితంగా సాగిన ప్రొ కబడ్డీ ఆరోసీజన్‌ విజేతగా బెంగళూరు బుల్స్‌ జట్టు అవతరించింది. హోరాహోరీగా జరిగిన ఫైనల్లో బెంగళూరు బుల్స్‌ జట్టు 38-33 పాయింట్ల తేడాతో గుజరాత్‌ ఫార్చ్యూన్‌ జెయింట్స్‌ను చిత్తుచేసి తొలిసారి టైటిల్‌ను ముద్దాడింది. బెంగళూరు సాధించిన 27 రైడ్‌ పాయింట్లలో పవన్‌కుమార్‌ 23 పాయింట్లను సాధించి గెలుపులో కీలకపాత్ర పోషించాడు. ట్యాకిల్స్‌లో ఆ జట్టు కొంత వెనుక బడ్డా నాలుగుసార్లు గుజరాత్‌ను ఆలౌట్‌ చేయడం కలిసొచ్చింది. అటు గుజరాత్‌ జట్టులో సచిన్‌ 10 రైడ్‌ పాయింట్లను సంపాదించాడు. ట్యాకిల్స్‌ ద్వారా 8, ఎక్స్‌ట్రా పాయింట్లను మూడు సంపాదించింది. రెండుసార్లు మాత్రమే బెంగళూరును ఆలౌట్‌ చేయగల్గింది. ఫైనల్‌ విజేత బెంగళూరుకు రూ.3 కోట్లు, రన్నరప్‌ గుజరాత్‌కు రూ.1.80 కోట్ల ప్రైజ్‌మనీ దక్కింది. ప్లేయర్‌ ఆఫ్‌ సీజన్‌ ఆటగాడికి రూ. 15 లక్షలు, బెస్ట్‌ రైడర్‌కు 10 లక్షల రూపాయల నగదు లభించింది.

నార్త్‌ ఈస్టర్స్‌ చిత్తు

ప్రిమియర్‌ బ్యాడ్మింటన్‌ లీగ్‌

అహ్మదాబాద్‌ : ప్రిమియర్‌ బ్యాడ్మింటన్‌ లీగ్‌లో భాగంగా శనివారం జరిగిన పోటీల్లో బెంగళూరు ర్యాప్టర్స్‌ జట్టు నార్త్‌ ఈస్టర్న్‌ వారియర్స్‌పై గెలిచింది. బెంగళూరు ట్రంప్‌ మ్యాచ్‌గా తీసుకున్న పురుషుల డబుల్స్‌ మ్యాచ్‌లో 15-14, 15-11 పాయింట్ల తేడాతో ఛంగ్‌-సెంగ్‌ (నార్త్‌)పై గెలిచి 2-0 పాయింట్ల ఆధిక్యత సంపాదించింది. ఆ తర్వాత పురుషుల సింగిల్స్‌లో కిదాంబి శ్రీకాంత్‌ 15-11, 15-12 పాయింట్ల తేడాతో సెన్సోంబున్స్‌(నార్త్‌)పై గెలిచాడు. మహిళల సింగిల్స్‌ నార్త్‌ ట్రంప్‌ మ్యాచ్‌లో సైనా 15-10, 15-7తో వూ(బెంగళూరు)పై గెలిచి 3-2కు ఆధిక్యతను తగ్గించింది. పురుషుల సింగిల్స్‌లో సాయిప్రణీత్‌(బెంగళూరు) 12-15, 15-6, 15-7 పాయింట్ల తేడాతో గెలిచి 4-2తో మ్యాచ్‌ను చేజిక్కించుకుంది.

దక్షిణాఫ్రికాకు స్వల్ప లక్ష్యం

కేప్‌టౌన్‌ : దక్షిణాఫ్రికాతో జరుగుతున్న రెండోటెస్ట్‌లో పాకిస్తాన్‌ కేవలం 40 పరుగుల లక్ష్యాన్ని మాత్రమే నిర్దేశించగల్గింది. పాకిస్తాన్‌ తొలి ఇన్నింగ్స్‌లో 177 పరుగులు చేయగా, రెండో ఇన్నింగ్స్‌లో పాకిస్తాన్‌ 294 పరుగులకే పరిమితం కావడంతో సఫారీ జట్టుకు కేవలం 40 పరుగుల లక్ష్యాన్ని మాత్రమే నిర్దేశించగల్గింది. అంతకుముందు ఓవర్‌నైట్‌ స్కోర్‌ ఆరు వికెట్ల నష్టానికి 382 పరుగులతో శనివారం తొలి ఇన్నింగ్స్‌ కొనసాగించిన సఫారీ జట్టు 431 పరుగులు చేసింది. డికాక్‌ 59 పరుగులు చేసి ఔటయ్యాడు. పాకిస్తాన్‌ రెండో ఇన్నింగ్స్‌లో షఫీక్‌ 88, బాబర్‌ అజామ్‌ 72, మసూద్‌ 61 పరుగులు చేశారు. స్టెయిన్‌, రబాడాకు నాలుగేసి వికెట్లు దక్కాయి.

వన్డే సిరీస్‌ కివీస్‌దే

57 బంతుల్లోనే సెంచరీ చేసిన తుషారా

మౌంట్‌ ముంగనూయ్‌ (న్యూజిలాండ్‌) : మూడు వన్డేల సిరీస్‌ను ఆతిథ్య న్యూజిలాండ్‌ జట్టు 2-0తో చేజిక్కించుకుంది. శనివారం శ్రీలంకతో జరిగిన రెండో వన్డేలో కివీస్‌జట్టు 21 పరుగుల తేడాతో విజయం సాధించింది. టాస్‌ గెలిచిన కివీస్‌ను మాన్రో(87), టేలర్‌(90), నిషమ్‌(64) అర్థశతకాలతో రాణించడంతో నిర్ణీత 50 ఓవర్లలో ఏడు వికెట్ల నష్టానికి 317 పరుగులు సాధించింది. భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన శ్రీలంక బ్యాట్స్‌మెన్‌ డిక్‌వెల్లా, జేమ్స్‌ పెరీరా, మెండీస్‌, గుణతిలక, చండీమాల్‌ వెనువెంటనే ఔటయ్యారు. న్యూజిలాండ్‌ బౌలర్లు సత్తాచాటడంతో శ్రీలంక 27 ఓవర్లలో 128 పరుగులకు 7 వికెట్లను కోల్పోయి కష్టాల్లో పడింది. కేవలం 16 పరుగుల వ్యవధిలో ఐదు వికెట్లను చేజార్చుకుంది. ఓపెనర్‌ గుణతిలకే తన అద్భుత బ్యాటింగ్‌తో కివీస్‌ విజయానికి కొంతసేపు అడ్డుకట్ట వేసినా 71 వ్యక్తిగత స్కోర్‌వద్ద నీషమ్‌ చేతిలో ఔటయ్యాడు. జట్టు స్కోర్‌ 128 పరుగులకే ఏడు వికెట్లు కోల్పోయిన ఓటమి అంచుల్లో ఉన్న లంకను తుషారా పెరీరా 74 బంతుల్లో 13 సిక్సర్లు, 8 ఫోర్ల సాయంతో 140 పరుగులతో విధ్వంస ఇన్నింగ్స్‌ ఆడాడు. కేవలం 57 బంతుల్లోనే సెంచరీని పూర్తిచేసి శ్రీలంక తరఫున న్యూజిలాండ్‌పై వేగంగా శతకం బాదిన బ్యాట్స్‌మ్యాన్‌గానూ రికార్డు నెలకొల్పాడు. అంతేగాక కివీస్‌ జట్టుపై లంక తరఫున ఓ ఇన్నింగ్స్‌లో అత్యధిక సిక్సర్లు బాదిన జయసూర్య పేరుమీద ఉన్న (11 సిక్సర్ల) రికార్డును అధిగమించాడు. తుషారా విధ్వంస ఇన్నింగ్స్‌తో విజయావకాశాలు ఒక్కసారిగా శ్రీలంకవైపు మళ్లాయి. మరో ఎండ్‌లో అడుతున్న బ్యాట్స్‌మన్లు విఫలం కావ్వడంతో శ్రీలంక జట్టు 46.2 ఓవర్లలో 298 పరుగుల వద్ద ఆలౌటైంది. మ్యాన్‌ ఆఫ్‌ ది మ్యాచ్‌ తుషారా పెరీరాకు లభించింది. సోధికి మూడు, హెన్రీ, నీషమ్‌ చెరో రెండు వికెట్లు దక్కాయి.



ఇండియా రెడ్‌ విజయం

బిసిసిఐ మహిళా క్రికెట్‌ టోర్నీ

విజయవాడ : మూలపాడు ఎసిఎ క్రికెట్‌ గ్రౌండ్‌లో జరుగుతున్న బిసిసిఐ మహిళా ఛాలెంజర్స్‌ క్రికెట్‌ టోర్నీలో శనివారం ఇండియా రెడ్‌- ఇండియా గ్రీన్‌ జట్ల మధ్య మ్యాచ్‌ జరిగింది. ఈ మ్యాచ్‌లో ఇండియా రెడ్‌ పది పరుగుల తేడాతో గెలిచింది. ఇండియా గ్రీన్‌ జట్టు టాస్‌ గెలిచి ఫీల్డింగ్‌ ఎంచుకోవడంతో తొలుత బ్యాటింగ్‌ చేసిన ఇండియా రెడ్‌ నిర్ణీత 50 ఓవర్లలో ఐదు వికెట్ల నష్టానికి 199 పరుగులు చేసింది. ఓపెనర్లు హర్లీన్‌ బి డియోల్‌ 57, వేదా కృష్ణమూర్తి 35 పరుగులతో రాణించారు. ఇండియా గ్రీన్‌ బౌలర్లు ఎన్‌ఎన్‌బి కీర్తన మూడు, రేణుక కె సింగ్‌ రెండు వికెట్లు తీశారు. అనంతరం 200 పరుగుల విజయలక్ష్యంతో బరిలోకి దిగిన ఇండియా గ్రీన్‌ 49.3 ఓవర్లలో 189 పరుగులకు ఆలౌట్‌ కావడంతో ఓటమి పాలైంది. జట్టులోని బ్యాట్స్‌ ఉమెన్‌ టి. హనబ్‌నన్‌ 65, డి.హేమలత 50 పరుగులతో రాణించినా ఫలితం లేకపోయింది. రెడ్‌ బౌలర్లు షికా పాండే, కెఆర్‌ జన్‌జాడ్‌ చెరో రెండు వికెట్లు తీశారు.

నేడు థాయ్‌లాండ్‌తో తలపడనున్న భారత్‌

ఆసియా ఫుట్‌బాల్‌ టోర్నీ

అబుదాబి : నాలుగేళ్లకొకసారి జరిగే ఆసియా ఫుట్‌బాల్‌ కప్‌ (ఏఎఫ్‌సి) పోటీలు శనివారం యూఏఈలో ప్రారంభమయ్యాయి. ఈ ఏడాది ఆసియాకప్‌లో పోటీపడే జట్ల సంఖ్య 16 నుంచి 24కు పెరగడంతో వాటిని ఆరు గ్రూపులుగా విభజించారు. గ్రూప్‌-ఎలో భారత జట్టుకు సునీల్‌ ఛెత్రీ సారథ్యం వహించనున్నాడు. భారత్‌ తన మొదటి మ్యాచ్‌ను ఆదివారం థాయ్‌లాండ్‌తో ఆడనుంది. ఫిఫా ర్యాంకింగ్స్‌లో భారత్‌ ప్రస్తుతం 97వ ర్యాంక్‌లో ఉండగా టోర్నీలో మెరుగ్గా రాణించేందుకు అన్ని ప్రయత్నాలు చేస్తోంది. ముఖాముఖి ఇరుజట్లు 24సార్లు తలపడగా 12సార్లు భారత్‌, ఐదు సార్లు థాయ్‌లాండ్‌ గెల్చింది. ఏడు మ్యాచ్‌లు డ్రాగా ముగిశాయి. ఈ టోర్నీలో భారత్‌ నాల్గోసారి పాల్గొంటోంది. థాయ్‌లాండ్‌ 1972 లో మూడోస్థానంలో నిలిచింది. 1964 ఆసియా కప్‌లో టీమిండియా రెండోస్థానంలో నిలవ గల్గింది. ఈ పోటీల్లో భారత్‌ 2011లో చివరి సారిగా పాల్గొంది. ఇక, డిఫెండింగ్‌ చాంపియన్‌ ఆస్ట్రేలియా టైటిల్‌ ఫేవరెట్‌గా బరిలోకి దిగుతోంది. అబుదాబిలో వాతావరణ పరిస్థితులను అలవాటు చేసుకోవాలనే ఉద్దేశ్యంతో 18 సభ్యుల బృందాన్ని భారత ఫుట్‌బాల్‌ సమాఖ్య నెలరోజుల ముందే అక్కడకు పంపిన సంగతి తెలిసిందే. గ్రూప్‌లో అగ్రస్థానంలో నిలిచిన రెండుజట్లు నాకౌట్‌లోకి ప్రవేశిస్తాయి.

జనవరి 6 : భారత్‌ X థాయ్‌లాండ్‌
జనవరి 10 : భారత్‌ X యుఏఈ
జనవరి 14 : భారత్‌ X బహ్రెయిన్‌

స్విట్జర్లాండ్‌దే హాఫ్‌మన్‌ కప్‌

పెర్త్‌ : రోజర్‌ ఫెదరర్‌ సారథ్యంలో స్విట్జర్లాండ్‌కు మూడోసారి హాఫ్‌మన్‌ కప్‌ను సంపాదించిపెట్టాడు. శనివారం పెర్త్‌లో జరిగిన మిక్స్‌డ్‌ టీమ్‌ ఫైనల్లో బెలిందా బెన్సిక్‌తో కలిసి సంయుక్తంగా రెండోసారి టైటిల్‌ గెలుపులో కీలకపాత్ర పోషించాడు. ఫైనల్లో జర్మనీని 2-1 పాయింట్ల తేడాతో స్విట్జర్లాండ్‌ ఓడించింది. ఫెదరర్‌ పురుషుల సింగిల్స్‌లో తొలిమ్యాచ్‌లో అలెగ్జాండర్‌ జ్వెరేవ్‌ను, కెర్బర్‌-జ్వెరేవ్‌ల జోడీని ఫెదరర్‌-బెలిందాల జోడీ ఓడించింది. ఫెదరర్‌ 4-0, 1-4, 4-3(5/4) పాయింట్ల తేడాతో జ్వెరేవ్‌ను ఓడించాడు. హోరాహోరీగా సాగిన మూడోసెట్‌ టైబ్రేక్‌లో గెలుపు ఇరుజట్లను ముద్దాడింది. మొత్తంమ్మీద స్విస్‌జట్టు నాల్గోసారి హాఫ్‌మన్‌ కప్‌ను ముద్దాడింది. రికార్డుస్థాయిలో అమెరికా ఆరుసార్లు హాప్‌మన్‌ కప్‌ను గెల్చుకుంది.



Published and Printed by Paturu Ramaiah on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governarpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Paturu Ramaiah, Ph : 2577248, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68